షిర్డీ సాయిబాబాను దర్శించుకున్న సీఎం సతీమణి



గీతారెడ్డిని సత్కరించిన షిర్డీ సాయి సంస్థాన్ ఆలయ అధికారులు 2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 3 జూలై 2025 | సంపుటి: 9 | సంచిక: 186 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

దూర విద్యా పితామహుడు
ప్రొ. రాంరెడ్డికి ఘన నివాళి



2





## ఏడాదిలో ఒక్క నెల
## సర్కారు దవాఖానలో
# పని చేయండి

### ప్రయివేటు డాక్టర్లకు సూచించిన సీఎం రేవంత్

పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం లక్ష్యంగా ముందుకు పోతున్నం

తెలంగాణ రైజింగ్- 2047 విజన్ డాక్యుమెంట్‌లో హెల్త్ టూరిజం కీలకమైన అంశం

కార్పొరేట్ ఆసుపత్రులకు పోటీగా ప్రభుత్వ వైద్యం

**హైదరాబాద్, జూలై 02, (మనం బ్యూరో):** రాష్ట్రంలోని పేదలకు ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందించడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఇందు కోసం కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యులు కూడా సహకారం అందించాలనీ, ఏడాదిలో నెల రోజులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేయాలని సూచించారు. బుధవారం బంజారా హిల్స్‌లో ఏఐజి హాస్పిటల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ హైదరాబాద్ ప్రజలకు రెండో అతిపెద్ద హాస్పిటల్‌ను అందుబాటులోకి తెచ్చినందుకు డా.నాగేశ్వర్‌రెడ్డిని అభినందించారు. నాగేశ్వర్‌రెడ్డి సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ ఇచ్చిందనీ, ఆయనకు తెలంగాణ నుంచి భారతరత్న వచ్చేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నామనీ, అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్‌గా ఉంటుందని వెల్లడించారు. హైదరాబాద్‌ను ...మిగతా 2లో

### 'పది' పాసైన ప్రతీ విద్యార్థి ఇంటర్‌లో చేరాలె

9-12 తరగతుల విధానంపై అధ్యయనం చేయండి

కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు సాధించాలె

యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రగతిపై నివేదిక ఇవ్వండి

విద్యాశాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 02, (మనం బ్యూరో):** పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి ...మిగతా 2లో

పాశమైలారం ఫైర్ యాక్సిడెంట్..

## మృతుల కుటుంబాలకు
# రూ. కోటి పరిహారం

### కార్మికులకు అన్నిరకాల బీమా క్లెయిమ్‌లు చెల్లిస్తం

- సిగాచి కంపెనీ సెక్రటరీ వివేక్‌కుమార్ వెల్లడి
- ప్రమాదంపై నిపుణుల కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- దుర్ఘటనలో 40 మంది మరణించినట్లు ప్రకటించిన సర్కారు
- ఆ 13 మంది ఎక్కడ? ఆచూకీ దొరక్క కుటుంబ సభ్యుల ఆవేదన
- ఈ మిస్సింగ్స్‌లో ఒకరు జనసేన కార్యకర్త
- డెడ్‌బాడీలు అప్పగించే వరకూ కదలం : కంపెనీ ముందు బాధితుల ఆందోళన



**హైదరాబాద్, జూలై 02, (మనం బ్యూరో):** సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి పరిశ్రమలో జరిగిన దుర్ఘటనపై ఆ కంపెనీ యాజమాన్యం స్పందించింది. మంగళవారం దుర్ఘటన జరిగిన స్థలాన్ని సీఎం రేవంత్ రెడ్డి సందర్శించి కంపెనీ యాజమాన్యం మృతి చెందిన కార్మికుల కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకోవాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో బుధవారం సిగాచి కంపెనీ యాజమాన్యం దిగొచ్చింది. ఈ మేరకు ఆ కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. పరిశ్రమలో జరిగన పేలుడు కారణంగా 40 మంది మృతి చెందినట్లు పేర్కొన్నారు. మరో 33 మంది గాయపడ్డారని తెలిపారు. ప్రమాద ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. గాయపడిన వారి వైద్య చికిత్సలకు అయ్యే ఖర్చులన్నింటినీ కంపనీ ...మిగతా 2లో

### నిపుణుల కమిటీ ఏర్పాటు..

మరోవైపు, సంగారెడ్డి జిల్లా పాశమైలారం పేలుడు ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త బి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో సభ్యులుగా చీఫ్ సైంటిస్ట్ టి.ప్రతాప్ కుమార్, విశ్రాంత శాస్త్రవేత్త సూర్యనారాయణ, పూణేకి చెందిన భద్రతాధికారి సంతోష్ ముగే ఉన్నారు. పాశమైలారం ప్రమాదానికి గల కారణాలతో పాటు కర్మాగారాల భద్రతా నియమావళి పాటించారా? లేదా? అనే అంశాలపై ఈ కమిటీ విచారణ జరపనుంది. ఈ ఘటనపై నెలరోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. భవిష్యత్తులో రసాయన కర్మాగారాల్లో ఇలాంటి ఘటనలు జరుగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించాలని ప్రభుత్వం కోరింది. ఈ కమిటీకి డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సహకారం అందించాలని ఆదేశించింది.




### ఆ మరణాలు కొవిడ్ వ్యాక్సిన్‌ల వల్ల కాదు

ఆకస్మిక మరణాలపై కేంద్రం ప్రకటన

మునుపటి అనారోగ్య సమస్యల ప్రభావమేనని తేల్చిన ఐసీఎంఆర్, ఎయిమ్స్ పరిశోధనలు

**ఢిల్లీ, జూలై 2:** కరోనా మహమ్మారి తర్వాత దేశంలో ఆకస్మిక మరణాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా 40 ఏళ్ల లోపు వారు కూడా గుండె పోటుతో ప్రాణాలు కోల్పోతుండటం కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో ఐసీఎంఆర్, ఎయిమ్స్ వంటి సంస్థలు దీనిపై పరిశోధనలు చేపట్టి కీలక విషయాలు వెల్లడించాయి. ఈ మరణాలకు, కొవిడ్ వ్యాక్సిన్లతో ఎలాంటి సంబంధం ...మిగతా 2లో

### బాబ్లీ గేట్లు ఎత్తివేత

ఎస్సారెస్పీలో పెరిగిన నీటి మట్టం



**ఆదిలాబాద్, జూలై 2:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువనున్న బాబ్లీ ప్రాజెక్టు గేట్లను తెలంగాణ, మహారాష్ట్ర అధికారులు మంగళవారం పైకి ఎత్తారు. దీంతో దిగువన ఉన్న ఎస్సారెస్పీలోకి నీటి ప్రవాహం వచ్చి చేరుతోంది. నిన్నటి వరకు ఎస్సారెస్పీలోకి 3032 క్యూసెక్కులుగా ఉన్న ఇన్ ఫ్లో, బుధవారం ఉదయానికి 6713 క్యూసెక్కులకు చేరుకుంది. ఎస్సారెస్పీలో మంగళవారం ఉదయం వాటర్ లెవెల్ 1064.90 ఫీట్లు, ...మిగతా 2లో

## ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయం ఎమర్జెన్సీ

అసెంబ్లీలో అసభ్య పదజాలం ఎక్కువైతుంది

మాక్ పార్లమెంటు.. రాజకీయ అంశం కాదు

విద్యార్థుల నైపుణ్యాన్ని ప్రదర్శించే వేదిక

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



**హైదరాబాద్, జూలై 02, (మనం బ్యూరో):** ప్రస్తుతం అసెంబ్లీలో అసభ్య పదజాలం వినిపిస్తోందనీ ఇది చాలా బాధాకరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. అసెంబ్లీ లైవ్ టెలికాస్ట్‌లు చూసి తల్లిదండ్రులు తమ పిల్లలకు టీవీ చూడవద్దని చెబుతున్నారని పేర్కొన్నారు. బుధవారం నారాయణగూడలోని కెవిఐటి కళాశాలలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ పార్లమెంట్ సెషన్‌లో రాంచందర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎమర్జెన్సీ చీకటి అధ్యాయంగా నిలిచిందన్నారు. ఈ మాక్ పార్లమెంట్ ఆ కాలంలో ప్రజలపై జరిగిన అణచివేతను, చరిత్రలోని చీకటి రోజులను గుర్తు చేసిందన్నారు. నేను పాఠశాలలో చదువుతున్న సమయంలో మా నాన్నగారు దేశంలో పరిస్థితులు ఎలా ...మిగతా 2లో



### ఆ రెండు పార్టీల్లో చేరను

అవి హిందూత్వంపై గౌరవంలేని పార్టీలు

అందుకే.. 'కాంగ్రెస్, బీఆర్ఎస్‌లలో చేరేది లేదన్న రాజాసింగ్

శివసేనలో చేరవచ్చని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. తాను ...మిగతా 2లో



### హసీనాకు ఆరెల్ల శిక్ష

ఢాకా కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ తీర్పు

**ఢాకా, జూలై 2:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఆరెల్ల జైలు శిక్ష విధించినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. ఆమెను అరెస్టు చేసిన లేక లొంగిపోయిన రోజు నుంచి ఈ శిక్ష అమలుకానుంది. గత ఏడాది రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని పదవి కోల్పోయి, దేశం వీడిన ...మిగతా 2లో

### జనవరిలో మేడారం జాతర

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** అంగరంగా వైభవంగా కోట్లాది మంది భక్తులు ఆరాధించే వనదేవతలు సమ్మక్క, సారలమ్మల జాతరకు ముహూర్తం ఖరారైంది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జన జాతరగా పేరుగాంచిన మేడారం మహాజాతర-2026 తేదీలను పూజారుల సంఘం అధికారికంగా ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు ఈ మహా వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపింది. మహా కుంభమేళాను తలపించే వన జాతర ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో జన



జాతర జరగనుంది. అలయ ప్రధాన పూజారులు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జనవరి 28న సారలమ్మ, ...మిగతా 2లో

### మైక్రోసాఫ్ట్‌లో భారీగా లేఆఫ్‌లు.. 9 వేల మందికి నోటీసులు!

9

### దలైలామా ఎంపిక నిర్ణయం

- గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్‌ది మాత్రమే
- మరెవరికి అధికారం లేదన్న దలైలామా
- దలైలామా వారసుడికి బీజింగ్ ఆమోదం ఉండాలి: చైనా



### అర్వింద్‌కు మరోసారి ఏసీబీ పిలుపు

ఫార్ములా ఈ రేస్ కేసులో సమన్లు

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** హైదరాబాద్‌లో జరిగిన ఫార్ములా ఈ-రేస్ కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్‌కు ఏసీబీ అధికారులు మరోమారు నోటీసులు జారీ చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈ నోటీసులు జారీ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేస్ నిర్వహణకు సంబంధించిన కేసులో ఏసీబీ అధికారులు విచారణను ...మిగతా 2లో

## ముందుగా.. ట్రంప్ భార్యను దేశం నుంచి బహిష్కరించాలె



అమెరికా అధ్యక్షుడికి తాకుతున్న తిరుగుబాటు ఉద్యమాల సుర్కు

**వాషింగ్టన్, జూలై 2:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వలసదారుల విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలోనే అమెరికా పౌరులు అయినప్పటికీ కొందరిని బహిష్కరించాలంటూ తాజాగా ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఆన్లైన్ వేదికగా ఆయన కుటుంబాన్ని టార్గెట్ చేస్తూ సంతకాల సేకరణ జరుగుతోంది. అందరికన్నా ముందు ట్రంప్ సతీమణి మెలానియాను బహిష్కరించాలన్న పిటిషన్‌కు అనుకూలంగా వేలాదిమంది సంతకాలు చేస్తున్నారు. ఈ ఆన్‌లైన్ మూవ్ మెంట్ పబ్లిక్ పాలసీ అడ్వకసీ గ్రూప్ ఒకటి ప్రారంభించింది. "సహజంగా పౌరసత్వం పొంది అమెరికా పౌరులుగా మారిన వారిని ట్రంప్ బహిష్కరించాలని భావిస్తున్నందున.. మెలానియా, ఆమె తల్లిదండ్రులను ...మిగతా 2లో

### అమెరికా సరిహద్దుల్లో దొరికిపోయిన 10,382 మంది భారతీయులు

**వాషింగ్టన్, జూలై 2:** అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తూ ఈ ఏడాది జనవరి నుంచి మే మధ్యలో 10,382 మంది భారతీయులు దొరికిపోయారు. వీరిలో పెద్దల రక్షణ లేని 30 మంది మైనర్లు కూడా ఉన్నారు. అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించిన వారిలో కూడా అత్యధికంగా గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారున్నారు. ఈ డేటాను అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం ...మిగతా 2లో



# ఏడాదిలో ఒక్క నెల సర్కారు దవాఖానలో పని చేయండి

(మొదటి పేజీ తరువాయి)

హెల్త్ టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామనీ, అందులో భాగంగానే డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని క్యాన్సర్ కేర్ సలహాదారునిగా నియమించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం చేపట్టే ప్రణాళికలో డా.నాగేశ్వర్ రెడ్డిని భాగస్వాములు కావాలని కోరారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు హెల్త్ ప్రొఫైల్ కార్డును క్రియేట్ చేయాలని భావిస్తున్నామన్నారు. ఒకప్పుడు ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ పోయి ఇప్పుడు స్పెషలిస్ట్ డాక్టర్స్ రోజులు వచ్చాయనీ, హెల్త్ ప్రొఫైల్ క్రియేట్ చేయడం ద్వారా దీన్ని బ్రేక్ చేయవచ్చని వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయనీ, గోషామహల్‌లో నూతన ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించుకోబోతున్నామని తెలిపారు. నిర్మాణంలో ఉన్న వివిధ ఆసుపత్రులు పూర్తయితే, మొత్తం 7 వేల పడకలు అందుబాటులోకి వస్తాయనీ, కార్పొరేట్ ఆసుపత్రులతో పోటీ పడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.



# షిర్డీ సాయిబాబాను దర్శించుకున్న సీఎం సతీమణి

## ఆలయ అధికారులు గీతారెడ్డిని సత్కరించారు

షిర్డీ, జూలై 2: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి గీతారెడ్డి షిర్డీ సాయిబాబాను దర్శించుకున్నారు. మహారాష్ట్రలోని షిర్డీ ఆలయాన్ని సందర్శించి సాయిబాబాను దర్శించుకున్న ఆమె షిర్డీ సాయిబాబాను దర్శించుకోవడం ఇదే మొదటి సారి అని ట్లు తెలిపారు. ద్వారకామాయి, గురుస్థాన్ ఆలయాలను దర్శించుకున్నట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా సాయిబాబా సంస్థాన్ ఆలయ అధికారులు గీతారెడ్డిని శాలువాతో సత్కరించి బాబా విగ్రహం, ప్రసాదం అందజేశారు.

# హసీనాకు ఆరెల్ల శిక్ష

(మొదటి పేజీ తరువాయి)

షేక్ హసీనా.. భారత్లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆమెతో పాటు అప్పటి నేతలు, సలహాదారులు, సైనికాధికారులపై నేరారోపణలు నమోదయ్యాయి. ఢాకా కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఇప్పటికే ఆమెకు అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఆమెను స్వదేశానికి రప్పించేందుకు యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది.

# 'పది' పాసైన ప్రతీ విద్యార్థి ఇంటర్‌లో చేరాలె

(మొదటి పేజీ తరువాయి)

తప్పనిసరిగా ఇంటర్మీడియట్ విద్య పూర్తి చేసేలా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పదో తరగతిలో పెద్ద సంఖ్యలో ఉత్తీర్ణత కనిపిస్తోందనీ, ఇంటర్మీడియట్ పూర్తయ్యే సరికి ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోవడానికి గల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. విద్యాశాఖపై ఐసీసీలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ ఎంతో కీలకమనీ, ఆ దశలో విద్యార్థికి సరైన మార్గదర్శకత్వం లభించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాల్లో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉంటుందనీ, అక్కడ డ్రాపౌట్స్ సంఖ్య తక్కువగా ఉంటుందని వివరించగా, ఆ రాష్ట్రాల్లో అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో విద్యా కమిషన్, ఆ విభాగంలో పని చేసే ఎన్జీవోలు, పౌర సమాజం సూచనలు, సలహాలు పరిగణనలోనికి తీసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్‌లో విద్యార్థుల చేరికతో పాటు వారి హాజరుపైనా దృష్టి సారించాలనీ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల నమూనాలను సీఎం పరిశీలించారు. పాఠశాలల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలనీ, నిర్మాణాల ప్రగతిపై ప్రతి వారం తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలను చేపడతామన్నారు. ఇప్పటికే ఒక్కో పాఠశాలకు సంబంధించిన స్థల సేకరణ పూర్తయినందున రెండో పాఠశాలకు సంబంధించిన స్థల గుర్తింపు, సేకరణ ప్రక్రియపై దృష్టి సారించాలని సూచించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం నిర్మాణ నమూనాలను సీఎం పరిశీలించి పలు మార్పులను సూచించారు. దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఈసందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# ముందుగా.. ట్రంప్ భార్యను దేశం నుంచి బహిష్కరించాలె

(మొదటి పేజీ తరువాయి)

మొదట అమెరికా నుంచి బయటకు పంపేయడం సరైందని భావిస్తున్నాం. బారన్ (ట్రంప్ చిన్న కుమారుడు) కూడా వెళ్లిపోవాలి. ఎందుకంటే ఆయన అమ్మమ్మ కూడా వేరే దేశంలో జన్మించారు. ట్రంప్ చెప్తున్నదాని ప్రకారం.. మీ అమ్మమ్మ అమెరికాలో జన్మించి ఉండాలి. కానీ మెలానియా తల్లి వేరే దేశంలో జన్మించారని మనకు తెలుసు. బయటకు పంపే విషయంలో మినహాయింపులు ఉండకూడదు. జాతీయ భద్రత, వలస అంశంలో ఉల్లంఘనల గురించి ట్రంప్ సీరియస్గా ఉన్నందున.. ట్రంప్ సొంత కుటుంబానికి మినహాయింపు ఇవ్వకూడదు. మెలానియా వెళ్లిపోవాలి'' అని ఆ పిటిషన్ పేర్కొంది.1970లో యుగోస్లేవియాలో మెలానియా జన్మించారు. ఆమె అసలు పేరు మెలానిజా క్నావ్స్. మోడలింగ్లో కెరీర్ను వెతుక్కొంటూ 1996లో అమెరికా వచ్చారు. 2001లో గ్రీన్కార్డ్ పొందిన ఆమె.. 2006లో యూఎస్ పౌరురాలిగా మారారు. అమెరికా వెలుపల జన్మించిన రెండో ప్రథమ మహిళ ఆమె. ట్రంప్ నిర్ణయాల నేపథ్యంలో అసలు మోడలింగ్ కోసం మెలానియా యూఎస్ వచ్చినప్పుడు చెల్లుబాటయ్యే వీసాను కలిగిఉన్నారా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల లాస్‌ఏంజెలెస్‌లో జరిగిన ర్యాలీలో యూఎస్ కాంగ్రెస్ సభ్యురాలు మాగ్జిన్ వాటర్స్ ఇదే అనుమానం వ్యక్తంచేశారు. ఇక్కడ జన్మించిన వారి, అలాగే వారి తల్లిదండ్రులను పత్రాలను ట్రంప్ పరిశీలించాలనుకుంటే.. తొలుత ఆయన మెలానియాకు సంబంధించిన కాగితాలను చూడాలని ఆన్‌లైన్ ఉద్యమకారులు డిమాండ్ చేశారు.

## దూర విద్యా పితామహుడు ప్రొ. రాంరెడ్డికి ఘన నివాళి

హైదరాబాద్, మనం ప్రతినిధిః దేశంలో దూరవిద్యను ప్రవేశ పెట్టి దూర విద్యా పితామహుడుగా పేరు పొందిన ప్రొ. జి. రాంరెడ్డి వర్ధంతిని డా.బీఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి చిత్రపటానికి ఘనంగా పుష్పాంజలి అర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి, అకాడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ డా. యల్.విజయ కృష్ణా రెడ్డి, ప్రొ. ఆనంద్ పవార్, ప్రొ.జి.మేరీ సునంద, డా.డి.రమాదేవి, డా. పి. వెంకటర రమణ, ఎన్.సి. వేణుగోపాల్, పలు విభాగాల అధిపతులు, డీన్స్, బోధన, భోదనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం

(మొదటి పేజీ తరువాయి)

యాజమాన్యమే భరిస్తుందనీ, కార్మికులకు అన్ని రకాల బీమా క్లెయిమ్‌లు చెల్లిస్తామని స్పష్టం చేశారు. ప్రమాదంపై స్టాక్‌మార్కెట్లకు లేఖ రాశామన్నారు. కంపెనీలో జరిగిన ప్రమాద ఘటనకు రియాక్టర్ పేలుడు కారణం కాదని తెలిపారు. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణ జరిపిస్తోందనీ, నివేదిక కోసం ఎదురు చూస్తున్నట్లు వెల్లడించారు. 3 నెలల వరకు ప్లాంట్‌లో కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు వివేక్ కుమార్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, పాశమైలారం సిగాచీ పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో క్షతగాత్రులు చికిత్స పొందుతున్న పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆసుపత్రికి ఆ కంపెనీ డైరెక్టర్ చిదంబరం వచ్చారు. సిగాచీ వైస్ ప్రసిడెంట్ ఎల్ఎన్ గోవన్ మృతదేహం తీసుకెళ్లేందుకు ఆయన వచ్చినట్లు సంబంధిత పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి.

### బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన..

ఇదిలా ఉండగా, సిగాచి పరిశ్రమ వద్దకు మంత్రి దామోదర రాజనర్సింహ్మ, ఆ పరిశ్రమ ప్రతినిధులు వెళ్లారు. ఘటనా స్థలం నుంచి శిథిలాల తొలగింపును బుధవారం ప్రారంభించారు. ఇదే సమయంలో తమ కుటుంబ సభ్యులను తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ బాధితులు కంపెనీ ముందు ఆందోళనకు దిగారు. ప్రమాదం ఘటన జరిగిన మూడు రోజులు అవుతున్నా, తమ వాళ్ల ఆచూకీ చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్సూరెన్స్ కంపెనీల కోసం శిథిలాల తొలగింపును అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

### 40 మంది మృతి చెందినట్టు ప్రకటించిన ప్రభుత్వం..

కాగా, సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో 40 మంది మృతి చెందినట్లు అటు ప్రభుత్వం ఇటు పరిశ్రమ యాజమాన్యం ప్రకటించింది. అయితే, ఈ ఘటనలో గల్లంతైన 13 మంది ఆచూకీ ఇప్పటి వరకూ లభించలేదు. అయితే, ప్రమాద ఘటన జరిగి నాలుగు రోజులైనప్పటికీ గల్లంతైన వారి ఆచూకీ దొరక్క పోవడంతో వారి కుటుంబ సభ్యులు కంపనీ యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, పాశమైలారం దుర్ఘటనలో ఆచూకీ తెలియకుండా పోయిన కార్మికుల్లో ఒకరు జనసేన కార్యకర్తగా తెలుస్తోంది. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు మిస్సింగ్‌లో ఒకరు శ్రీకాకుళం జిల్లాకు చెందిన వ్యక్తి.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వీరాభిమాని అయిన ఇతడు గత ఎన్నికల్లో పూర్తి స్థాయిలో పార్టీ విజయం కోసం పని చేసినట్లు సమాచారం. అతడి బంధువులు బుధవారం ఘటనా స్థలం పరిసరాల్లో గుండెలు బాదుకుంటూ పలువురిని తమ వాడి ఆచూకీ కోసం వేడుకోవడం అక్కడున్న వారిని కలచివేసింది.

# అమెరికా సరిహద్దుల్లో దొరికిపోయిన 10,382 మంది భారతీయులు

(మొదటి పేజీ తరువాయి)

ఏప్రిల్ 2024 నాటికి డిపార్ట్మెంట్ ఆఫ్ హోమ్ల్యాండ్ సెక్యూరిటీ లెక్కల ప్రకారం అమెరికాలో 2.2 లక్షల మంది భారతీయులు ఎటువంటి పత్రాలు లేకుండా జీవిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి 332 మందిని అక్కడి నుంచి వెనక్కి పంపారు.

భారతీయులు అక్రమ రవాణాదారుల మాటలు విని కఠిన మార్గాల్లో ప్రయాణించి అమెరికాలోకి ప్రవేశించాలనుకొంటారు. భారీ సరిహద్దు గోడ, కంచెలను తప్పించుకొనేందుకు ప్రమాదకరమైన సముద్ర మార్గాన్ని కూడా ఆశ్రయిస్తున్నారు. మే 9వ తేదీన ఇలా ప్రయాణిస్తూ కాలిఫోర్నియాలోని డెల్ మార్ సమీపంలో పడవ బోల్తాపడి భారత్ 14 ఏళ్ల బాలుడు, 10 ఏళ్ల బాలిక ప్రాణాలు కోల్పోయారు. వీరిద్దరూ అన్నా చెల్లెళ్లు. ఇలాంటి పడవలు తరచూ మెక్సికో తీరం నుంచి బయల్దేరి అమెరికాలో జలాల్లోకి చొరబడతాయి. వీటిలో ప్రయాణించిన వారు అమెరికా భూభాగంపై దిగుతారు.

# బాబ్లీ గేట్లు ఎత్తివేత

(మొదటి పేజీ తరువాయి)

15.880 టీఎంసీలు ఉండగా, బాబ్లీ గేట్లు తెరవడంలో బుధవారం ఉదయానికి వాటర్ లెవెల్ 1065.30 ఫీట్లు, 16.405 టీఎంసీలకు పెరిగింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 1091 ఫీట్లు, 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో వాటర్ లెవెల్ 1065.30 ఫీట్లు, 16.405 టీఎంసీలు ఉంది. గతేడాది ఇదే రోజు ప్రాజెక్టులో నీటి నిలువ 1060.30 ఫీట్లు, 10.835 టీఎంసీలుగా ఉంది. ప్రస్తుతం సరాసరి 6713 క్యూసెక్కుల నీటి ఇన్ ఫ్లో వస్తోంది.

# ఆ రెండు పార్టీల్లో చేరను

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీకి రాజీనామా చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్‌లో చేరతారంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. హిందూత్వ సిద్ధాంతానికి వ్యతిరేకంగా పనిచేసే ఏ పార్టీలోనూ తాను చేరబోనని కుండబద్దలు కొట్టారు.

'కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు హిందూత్వం మీద ఏమాత్రం గౌరవం లేదు. అలాంటి పార్టీలలోకి నేను వెళ్లను' అని ఆయన తేల్చిచెప్పారు. తాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్‌లకు వీరాభిమానినని, వారి కోసమే చివరి వరకు పనిచేస్తానని పేర్కొన్నారు.

మరోవైపు, రాజాసింగ్ తన హిందూత్వ ఎజెండాకే కట్టుబడి ఉంటానని చెప్పడంతో, అదే సిద్ధాంతాన్ని అనుసరించే శివసేన పార్టీలో చేరవచ్చనే ప్రచారం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. గతంలో కూడా రాజాసింగ్ శివసేనలో చేరి, మహారాష్ట్రలోని నాందేడ్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తారని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.

ప్రస్తుతం తెలంగాణలో శివసేన పార్టీ నామమాత్రంగానే ఉంది. ఈ నేపథ్యంలో రాజాసింగ్ వంటి బలమైన, ప్రజాదరణ ఉన్న నాయకుడు పార్టీలోకి వస్తే, ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించి రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసుకోవాలని శివసేన నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలోనే రాజాసింగ్ అడుగులు శివసేన వైపు పడుతున్నాయని ఊహాగానాలు ఊపందుకున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల విషయంలో స్పష్టత ఇచ్చినప్పటికీ, ఆయన తదుపరి రాజకీయ గమ్యం ఏంటనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది.

# ఆ మరణాలు కొవిడ్ వ్యాక్సిన్‌ల వల్ల కాదు

(మొదటి పేజీ తరువాయి)

లేదని తమ అధ్యయనాల్లో తేలినట్లు స్పష్టం చేశాయి. మునుపటి అనారోగ్య సమస్యల ప్రభావమే ఆయా వ్యక్తుల మరణాల్లో కీలక అంశమని పేర్కొన్నాయి. ఈమేరకు అధ్యయనాల నివేదికలను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా ప్రకటించింది. 18-45 ఏళ్ల వయసు వారిలో ఆకస్మిక మరణాలు సంభవించడంపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్సీడీసీ), ఎయిమ్స్ పరిశోధనలు చేశాయి. 2023 మే-ఆగస్టు మధ్య 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పలు ఆసుపత్రుల్లో సర్వే చేశాయి. ఆరోగ్యంగా కన్పించినప్పటికీ 2021 అక్టోబరు నుంచి 2023 మార్చి మధ్య ఉన్నట్టుండి మరణించిన వారి డేటాను పరిశీలించాయి. వీటిని అధ్యయనం చేసిన తర్వాత.. ఈ ఆకస్మిక మరణాలకు కొవిడ్ వ్యాక్సిన్లతో ఎలాంటి సంబంధం లేదని గుర్తించినట్లు ఆయా సంస్థలు వెల్లడించాయి. భారత్ లో కొవిడ్ వ్యాక్సిన్లు సురక్షితం, సమర్థవంతమైనవి. వీటివల్ల దుష్ప్రభావాలు చాలా అరుదైన సందర్భాల్లో మాత్రమే కన్పించాయి. గుండె సంబంధిత ఆకస్మిక మరణాలకు అనేక కారణాలు ఉన్నాయి. జన్యుపరమైన సమస్యలు, జీవన శైలి, మునపటి అనారోగ్యాలు.. ఇలా ఏవైనా కావొచ్చు'' అని అధ్యయనాల్లో తెలిపాయి. ఈ ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలే కారణమంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, తప్పుదోవ పట్టించేవేనని పునరుద్ఘాటించాయి. ఆధారాల్లేకుండా చేసే ఇలాంటి ప్రచారాలు వ్యాక్సిన్లపై విశ్వసనీయతను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తంచేశాయి. కొవిడ్ మహమ్మారి సమయంలో ఈ టీకాల వల్లే ఎంతోమంది ప్రాణాలు నిలిచాయని ఆ సంస్థలు ప్రకటించాయి.

# అర్వింద్‌కు మరోసారి ఏసీబీ పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

వేగవంతం చేశారు. ఈ క్రమంలో నేడు (గురువారం) ఉదయం 11:30 గంటలకు తమ ఎదుట విచారణకు హాజరు కావాలని అర్వింద్ కుమార్‌కు పంపిన నోటీసులో పేర్కొన్నారు. ఈవెంట్ నిర్వహణలో ఆయన పాత్ర, ఇతర ఆర్థిక లావాదేవీలపై అధికారులు ఆయనను ప్రశ్నించే అవకాశం ఉంది. కాగా, గత నెల రోజుల పాటు అర్వింద్ కుమార్ విదేశీ పర్యటనకు వెళ్లిన ఆయన జూన్ 30న హైదరాబాద్‌కి వచ్చారు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు తాజాగా ఈ నోటీసులు జారీ చేయడం గమనార్హం. గతంలోనూ ఈ కేసుకు సంబంధించి మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు విచారించి, ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

# ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయం ఎమర్జెన్సీ

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయో వివరించేవారు. పత్రికలు నిజమైన వార్తలు ప్రచురించలేక పోయేవి. ఏదైనా పత్రిక నిజం రాస్తే దాన్ని నిలిపివేసేవారు. ఇవన్నీ ఎమర్జెన్సీ సమయంలో జరిగిన దుశ్చర్యలేనని వ్యాఖ్యానించారు. ఇక్కడి విద్యార్థులు చాలా చక్కగా వ్యవహరిస్తున్నారనీ, విద్యార్థులు ప్రదర్శిస్తున్న తీరు లెజిస్లేటివ్ బిహేవియర్‌కు ఉదాహరణగా, ప్రస్తుత శాసనసభల కంటే మెరుగైన విధంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఈ మాక్ పార్లమెంట్ రాజకీయ అంశం కాదు, ఇది విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించే వేదిక అని పేర్కొన్నారు. ఇందులో పాల్గొన్న విద్యార్థుల్లో కొంతమంది భవిష్యత్తులో అసెంబ్లీ లేదా పార్లమెంట్ సభ్యులుగా మారొచ్చు. అది ఏ పార్టీ అయినా సరే. ఇది శుభ పరిణామమేనని వ్యాఖ్యానించారు. పెద్ద కుటుంబాల వారికే రాజకీయాల్లో చోటుంటుందన్న భావన తప్పనీ, ఆసక్తి, నైపుణ్యం ఉన్న ప్రతీ ఒక్కరికీ అవకాశం ఉంటుందనీ, ప్రస్తుతం అధికార, ప్రతిపక్ష పార్టీల్లో చాలామంది మహిళా ఎంపీలు ఉన్నారని పేర్కొన్నారు. ఈ లా కాలేజ్ మేనేజ్‌మెంట్ కమిటీలో తాను కూడా సభ్యుడినేననీ, ఈ కాలేజిలో లా కోర్సు ప్రారంభించడంలో తన పాత్ర కూడా ఉందని ఈ సందర్భంగా రాంచందర్‌రావు తెలిపారు.

# ఆగస్టు 10న అంబేద్కర్ వర్సిటీ ఎంబీఏ,(హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్) ఎంట్రన్స్ టెస్ట్

హైదరాబాద్, మనం ప్రతినిధిః డా.బీ.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్) ఎంట్రన్స్ టెస్ట్ ఆగస్ట్ 10న నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రి అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంట్రన్స్ టెస్ట్‌కి జూలై 15 చివరి తేదీ అని పేర్కొన్నారు. ఆగస్ట్ 10న (ఆదివారం) మధ్యాహ్నం 2:30 నుండి 3:30 వరకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న నిర్దిష్ట పరీక్షా కేంద్రాల్లో మాత్రమే ఎంట్రన్స్ పరీక్షను నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఐ-సెట్ 2025లో అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా ఎంబీఏ కోర్సుల్లో అడ్మిషన్స్ పొందొచ్చని వెల్లడించారు. లేదా అంబేద్కర్ విశ్వవిద్యాలయం నిర్వహించే ఎంబీఏ, ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్) ఎంట్రన్స్ టెస్ట్-2025 లో అర్హత సాధించిన అభ్యర్థులు ప్రవేశం పొందొచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం విశ్వవిద్యాలయ పోర్టల్‌ను లేదా వెబ్ సైట్‌ను సంప్రదించొచ్చని సూచించారు.

## జనవరిలో మేడారం జాతర

(మొదటి పేజీ తరువాయి)

పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి చేరుకుంటారు. దీంతో జాతర అధికారికంగా ప్రారంభమవుతుంది. మరుసటి రోజు అంటే జనవరి 29న, జాతరలో అత్యంత కీలక ఘట్టమైన సమ్మక్క తల్లిని చిలకలగుట్ట నుంచి గద్దెలపైకి తీసుకువస్తారు. ఇక, జనవరి 30వ తేదీన భక్తులు తమ మొక్కులను చెల్లించుకోవడానికి పూర్తి రోజు కేటాయించారు. లక్షలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకుని బంగారం (బెల్లం), పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి తమ భక్తిని చాటుకుంటారు. ఇక చివరి రోజైన జనవరి 31న అమ్మవార్లు తిరిగి వనప్రవేశం చేయడంతో ఈ మహాజాతర ముగుస్తుందని పూజారుల సంఘం తమ ప్రకటనలో స్పష్టం చేసింది.

# దారి మళ్లింపు అందుకే...

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అనుకూలించని వాతావరణం
- బెంగళూరు, విజయవాడలకు విమానాల దారి మళ్లింపు

హైదరాబాద్, మనం ప్రతినిధిః శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండ్ కావాల్సిన పలు విమానాలను అధికారులు దారిమళ్లించినట్లు సమాచారం. విమానాశ్రయం పరిసరాల్లో వాతావరణం అనుకూలించకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. విమానాశ్రయం పరిసరాల్లో గత రెండు రోజుల నుంచి ప్రతికూల వాతావరణం నెలకొందని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు రావాల్సిన విమానాలలో కొన్నింటిని బెంగళూరుకు మరికొన్నింటిని విజయవాడకు మళ్లించినట్లు పేర్కొన్నారు. లఖ్‌నవూ, కోల్‌కత్తా, ముంబై, జయపుర నుంచి వచ్చే వాటిని బెంగళూరుకు డైవర్ట్ చేయగా.. బెంగళూరు నుంచి వచ్చిన విమానాన్ని విజయవాడలో ల్యాండ్ చేయించినట్లు తెలిపారు. కాగా, బుధవారం ఉదయం పరిస్థితి అనుకూలించడంతో తిరిగి విమానాలు శంషాబాద్‌కు వచ్చాయి. కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు.

- రేవంత్‌కు బేసిన్‌ల గురించి తెలియదు?
- అవగాహన లేక.. అహంకారంతోనే మాటాడుతుండ్రు?
- 'బనకచర్ల కట్టే బాబు దేవుడు?.. ఆపాలని పోరాడుతున్న బీఆర్ఎస్ పా(ములా)మా?
- కాంగ్రెస్ నేతలు నిద్రలో కూడా కలవరిస్తుండ్రు?
- బీఆర్ఎస్ ప్రజల కోసమే పనిచేస్తుంది?
- రేవంత్.. సొంత రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తుండ్రు?

# 'బ్యాగ్ మ్యాన్' చీకటి ఒప్పందం

హైదరాబాద్, మనం ప్రతినిధిః ఏపీ సీఎం చంద్రబాబు కోసం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'బ్యాగ్ మ్యాన్'గా మారి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర హక్కులు, ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తుంటే?.. రేవంత్ రెడ్డి మాత్రం కేవలం సొంత రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆయన తీవ్రంగా మండిపడ్డారు. కాగా, ఇటీవల రేవంత్ ప్రభుత్వం ప్రగతి భవన్‌లో ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై హరీశ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ ప్రజెంటేషన్ చూస్తే హైదరాబాద్‌లో కాకుండా అమరావతిలో ఇచ్చినట్లుందని, దాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే తయారు చేసిందనే అనుమానం కలుగుతోందని ఆయన ఎద్దేవా చేశారు. బనకచర్ల ప్రాజెక్టును ఏపీ సీఎం ఎలా ముందుకు తీసుకెళ్తున్నారో, ఎలాంటి వ్యాఖ్యలు చేశారో ఆ ప్రజెంటేషన్‌లో ఉద్దేశపూర్వకంగానే చూపించలేదని ఆరోపించారు. 'బనకచర్ల కట్టే చంద్రబాబు రేవంత్‌కు దేవుడిలా కనిపిస్తున్నారు. అదే బనకచర్లను ఆపాలని పోరాడుతున్న బీఆర్ఎస్ మాత్రం చచ్చిన పాములా కనిపిస్తోంది' అని హరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్‌ను చచ్చిన పాముతో పోల్చడంపై హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ నిజంగానే చచ్చిన పాము అయితే, కాంగ్రెస్ నేతలు నిద్రలో కూడా దాని గురించే ఎందుకు కలవరిస్తున్నారని ప్రశ్నించారు. పదకొండేళ్లుగా కేంద్రంలో అధికారంలో లేని కాంగ్రెస్ పార్టీ కూడా చచ్చిన పామేనా? అని ఆయన నిలదీశారు. టెక్నికల్గా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయినా, ఆయన మనసంతా ఏపీ వైపే ఉందనే విషయం రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోందని అన్నారు.

బనకచర్ల విషయంలో రేవంత్ రెడ్డి, చంద్రబాబు మధ్య తెరవెనుక ఒప్పందాలు జరిగాయని హరీశ్ రావు ఆరోపించారు. 2024లో ప్రజాభవన్ వేదికగా రేవంత్ రెడ్డి, బెజవాడ వేదికగా ఉత్తమ్ కుమార్ రెడ్డి గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపారని అన్నారు. దీనికి కొనసాగింపుగా, 2024 నవంబర్ 15న, ఆ తర్వాత డిసెంబర్‌లోనూ ఏపీ సీఎం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖలు రాశారని, ఈ లేఖలన్నీ బయటకు వచ్చినా రేవంత్ రెడ్డి మౌనంగా ఉన్నారని దుయ్యబట్టారు. ఈ కుట్రను తాను ఈ ఏడాది జనవరి 24న ప్రెస్ మీట్లో బయటపెట్టానని, ఆ తర్వాతే తెలంగాణ ప్రభుత్వం తరఫున మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అంతకు ముందు తేదీ వేసి కేంద్రానికి లేఖ రాశారని హరీశ్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పోరాటం వల్లే బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్) ప్రక్రియ తాత్కాలికంగా ఆగిందని, ఇది తమ పోరాట ఫలితమేనని స్పష్టం చేశారు. అపెక్స్ కమిటీ సమావేశంలో బనకచర్ల అంశం చర్చకు రాలేదని, కేవలం సముద్రంలోకి వృథాగా పోతున్న 3 వేల టీఎంసీల నీటిపై ఇరు రాష్ట్రాలు కూర్చుని మాట్లాడుకోవాలని మాత్రమే నిర్ణయించారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి నదీ బేసిన్‌లపై కనీస అవగాహన లేదని, అహంకారంతో మాట్లాడితే ప్రజలు అధఃపాతాళానికి తొక్కడం ఖాయమని హెచ్చరించారు.

## ఘనంగా మాజీ చైర్మన్ జన్మదిన వేడుకలు



**రంగారెడ్డి, జూలై 2 (మనం న్యూస్):** షాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నెంటూరీ రవీందర్ రెడ్డి జన్మదిన వేడుకలు గ్రీన్ హిల్స్ కాలనీలో ని రవీంద్ర ఇన్ఫ్రా డెవలపర్స్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం బి ఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ శాలువ కప్పి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అరవింద్ శర్మ మాట్లాడుతూ మాజీ మంత్రి , మహేశ్వరం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు నెంటూరీ రవీందర్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, పెంబర్తి శ్రీనివాస్, మల్లా రెడ్డి, బాబు, చండీశ్వర్, రాజు గుప్త తదితరులు పాల్గొన్నారు.

# దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

## మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి కి సమ్మె వినతి పత్రం అందజేత

## మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి. కిషన్




**తుర్కయంజాల్,జులై 2( మనం న్యూస్):** జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనీ విజయవంతం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి కిషన్ అన్నారు. బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులకు సమ్మె కరపత్రాలు అందజేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డికి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి కిషన్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్స్, అసోసియేషన్ ల జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ పిలుపుమేరకు జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనీ విజయవంతం చేయాలని అన్నారు. శతాబ్ద కాలంగా కార్మిక వర్గం అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలలోని 24 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లుగా తీసుకొచ్చి వాటి అమలుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ లేబర్ కోడ్ లు అమలు జరిగితే కార్మిక సంఘాల ఏర్పాటు కష్టతరం అవుతుందన్నారు. కార్మికుల సమిష్టి భేరసారాల శక్తి నిర్వీర్యం చేయబడుతుందని, ఉద్యోగ భద్రత, ఉపాధి అవకాశాలు కార్మికులు కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. కార్మిక శాఖ కూడా నిర్వీర్యం చేయబడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్ట వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్ ల అమలును తక్షణమే రద్దు చేయాలని, స్థానిక సంస్థలకు నిధులు కేటాయించి మున్సిపాలిటీలను బలోపేతం చేయాలని తెలిపారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ కార్మికులందరినీ వెంటనే పర్మినెంట్ చేసి కనీస వేతనం 26000 రూపాయలుగా నిర్ణయించాలని, మున్సిపల్ శాఖలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారి చదువు, వృత్తి నైపుణ్యతను గుర్తించి జవాన్లుగా, డ్రైవర్లుగా, శానిటరీ ఇన్స్పెక్టర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా మొదటి ప్రాధాన్యత ఇచ్చి ప్రమోషన్స్ కల్పించాలన్నారు. కార్మికులు వివిధ కారణాల రీత్యా మరణిస్తే దహన ఖర్చులకు 30 వేల రూపాయలు కేటాయించాలని, ఎక్స్ గ్రేషియా రూ.5లక్షలు ఇచ్చి వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ఇ. మహేష్, ఏ. రవి, ఎం సుధాకర్, ఎన్. వెంకటేష్, సిహెచ్ అంజయ్య, జె సరిత, ఎస్ నరేష్, కే మంజుల తదితరులు పాల్గొన్నారు.

## నేడు మహేశ్వరంలో సీఎం పర్యటన



**రంగారెడ్డి, జూలై 2 (మనం న్యూస్):** మహేశ్వరం నియోజకవర్గం కెసి తండా గ్రామపంచాయతీలోని మలబార్ గోల్ , డైమండ్ ప్రైవేట్ లిమిటెడ్ వారు నూతనంగా నిర్మానించిన మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను ప్రారంభించడానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారు, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లు గురువారం హాజరవుతున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లు ను మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ కిచన్నగారి లక్ష్మారెడ్డి , మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టిపిసిసి మెంబర్దేప భాస్కర్ రెడ్డి తదితరులు పరిశీలించారు.

# భారీగా గంధపు చెక్కల పట్టివేత



**చేవెళ్ల, జులై 2(మనం న్యూస్ ):** భారీగా గంధం చెక్కలను తరలిస్తున్న వాహనాన్ని మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు, చేవెళ్ల పోలీసులు పట్టుకున్నారు . చేవెళ్ల పోలీస్ స్టేషన్ లో చేవెళ్ల ఏసీపీ కిషన్ కేసు వివరాలను వెల్లడించారు. చేవెళ్ల మండల పరిధిలోని బస్తేపూర్ గేట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు మాదాపూర్ ఎస్ఓటి పోలీసులు, చేవెళ్ల పోలీసులు కలిసి అక్రమంగా హెచర్ డీసీఎమ్ లో తెల్లగంధం చెక్కలు తరలిస్తున్న వాహనాని పట్టుకున్నారు. మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లా నుంచి నగర్ గూడాలో ఉన్న ఆంధ్ర సుగంధ ద్రవ్యాల కంపెనీకి దాదాపు 30 నుండి 35లక్షలు విలువ గల 1000 కేజీల గంధం చెక్కలను తరలిస్తున్నారున్నారు. ఈ విషయంలో అటవీ శాఖ యాక్ట్ కింద 5 గురి పై కేసు నమోదు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుకొని రిమాండ్ కు తరలించడం జరిగిందన్నారు. ఇద్దరు పరారీలో ఉన్నారు.పరారీలో కంపెనీ ఓనర్, మేనేజర్ ఉన్నారు. వాహనాని కూడా గుర్తు పట్టలేకుండా తయారు చేసుకొని తరలిస్తున్నారున్నారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు అటవీ శాఖ ఆఫీస్ రవికుమార్, మాదాపూర్ ఎస్ఓటి సీఐ సంజయ్ కుమార్, ఎస్వోటీ ఎస్ఐ సతీష్ రెడ్డి, చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, చేవెళ్ల ఎస్ఐ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపార సంస్థలో మున్సిపల్ అధికారులు తనిఖీలు

- పర్యావరణానికి ప్లాస్టిక్ వాడటంతో మానవ ఆరోగ్యానికి హానికరం
- తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి



**తుర్కయంజాల్, జులై 2( మనం న్యూస్):** ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం దెబ్బతింటుందని, ప్లాస్టిక్ వాడితే జరిమానాలు విధిస్తామని తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని బేకరీలు, జనరల్ స్టోర్లు, ఇతర వ్యాపార సంస్థల్లో మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తున్న దుకాణదారులపై జరిమాణాలు విధించారు.ఈ సందర్భంగా కమిషనర్ అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పురపాలక సంఘ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం కఠినంగా అమలు చేస్తున్నామని, నిషేధిత ప్లాస్టిక్ ను వినియోగిస్తున్న వారిపై జరిమాణాలు, కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ వాడటంతో మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి హాని కలిగే ప్రమాదం ఉందన్నారు. ప్లాస్టిక్ రహిత తుర్కయాంజల్ ను సాధించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని, ప్లాస్టిక్ వినియోగంపై నియంత్రణ చర్యలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ వినయ్, వార్డ్ ఆఫీసర్ బాలకృష్ణ, మేతరి నవీన్, చెక్క వెంకటేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**ఆత్మకూర్(ఎం), జూన్ 2 (మనం న్యూస్):** ఆత్మకూరు (ఎం) మండలం సర్వేపల్లి గ్రామానికి చెందిన నిమ్మ శేఖర్ రెడ్డి మాతృమూర్తి మరణించగా వారి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ శాసనసభ్యురాలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మరియు మండల బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బి చందర్ గౌడ్ పాల్గొన్నారు.

# నివాసాలు తొలగించకుండా అధికారులతో మాట్లాడుతా



- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**రంగారెడ్డి, జూలై 2 (మనం న్యూస్):** బైరామల్ గూడ చెరువు ప్రక్కన నివాసం ఉంటున్న వారి నివాసాలు తొలగించకుండా అధికారులతో మాట్లాడుతా అని ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ బైరామల్ గూడ చెరువు ప్రక్కన దాదాపు 30 నుంచి 40 సంవత్సరాలుగా మేము అక్కడ నివాసం ఉంటున్నాం అని దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కి తెలిపారు.మా యొక్క నివాసాలు తీసివేయలని అధికారులు తెలిసిన నేపథ్యంలో మేము మీ దగ్గరకు రావడం అని తెలిపారు.అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మీ నివాసాల ముందు ఇంతకుముందే బాక్స్ డ్రైన్స్ కట్టడం జరిగింది అని,ఎవరు ఎలాంటి ఆందోళనకు గురికోవొద్దు అని,నిర్భయంగా ఉండండి అని హామీ ఇచ్చారు.ఏ ఒక్క నివాసాలు తొలగించకుండా అధికారులతో మాట్లాడి ఎవరికి నష్టం రాకుండా చూసుకునే బాధ్యత తనదని సుధీర్ రెడ్డి తెలిపారు.

# ఖర్గే సభను విజయవంతం చేయాలి



- టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్

**కడ్తాల్, జులై 02 ( మనం, న్యూస్):** ఎల్బీ స్టేడియంలో ఈ నెల 4 న జరిగే సభ చాలా కీలకమైందని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హాజరయ్యే సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి నేనావత్ భీక్యా నాయక్ తో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులతో ఏఐసీసీ అధ్యక్షులు ఖర్గే మాట్లాడటం ముఖ్యమైనా అంశామని, ఇది పార్టీ చరిత్ర లో ఒక గొప్ప సమావేశమని తెలిపారు. ఖర్గే చెప్పే సందేశాలను ప్రజలకు చేరువయ్యేలా ఉంటుందన్నారు. మల్లికార్జున ఖర్గే గ్రామ స్థాయిలో, పార్టీకి పనిచేసే పార్టీ కార్యకర్తలతో మాట్లాడనున్నారని తెలిపారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడానికి ఎలా ముందుకెళ్లాలి అందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఖర్గే నాయకులకు దిశా నిర్దేశం చేయనున్నారని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలు సంతోషంగా ఉన్నారని ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వం మోడీ సర్కారు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజల్లోకి ఎలా తీసుకెల్లాలో ఖర్గే వివరించానున్నారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గ్రామం నుండి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు ముఖ్య నాయకులు అలాగే మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మండల ముఖ్య నాయకులు ఈ సమావేశానికి రావలసిందిగా శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ వెంకటేష్, మాజీ సర్పంచ్ శంకర్, జహంగీర్ అలీ, రామకృష్ణ, జహంగీర్ బాబా, జగన్ గౌడ్,యాదయ్య గౌడ్, మాజీ సర్పంచ్ శేఖర్ గౌడ్, రాజేందర్, సక్ర నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సైపై చర్యలు తీసుకోవాలి



**నల్గొండ, జులై 2( మనం న్యూస్):** భూ వివాదాల్లో జోక్యం చేసుకుంటున్న మునుగోడు ఎస్త్సై పై చర్యలు తీసుకోవాలని మునుగోడు గ్రామానికి చెందిన పెరుమాళ్ళ లక్ష్మయ్య బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాకు గ్రామ శివారులో వ్యవసాయ భూమి ఉన్నదని మా పెద్దన్న పెరమాళ్ల కనకయ్య కు మా కు కొంతకాలంగా మా ఇద్దరి మధ్య భూ వివాదం నడుస్తుందన్నారు. వారికి నలుగురు కుమారులు ఉండడంతో నన్ను భూమి మీదికి రానివ్వకుండా దుర్భాషలాడి ఆస్తి మీదికి రానివ్వడం లేదని అన్నారు.ఈ వివాదంలో ఎస్త్సై జోక్యం చేసుకొని పెద్దమనిషిని అని చూడకుండా శారీరకంగా మానసికంగా తీవ్ర శోభకు గురి చేశారని ఆరోపించారు. ఈ విషయంపై విచారించి చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు.

## శ్రీ లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకున్న పట్నం మహేందర్ రెడ్డి



**యాదగిరిగుట్ట, జూలై 2 (మనం న్యూస్):** యాదగిరిగుట్టలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ఆయన తనయుడు యువనేత పట్నం రమేష్ రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి వేద పండితుల ఆశీర్వచనా చేశారు. స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని భగవంతుని కోరుకుంటున్నట్లు తెలిపారు.

# జులై 4న ఎల్బీ స్టేడియంలో బహిరంగ సభను విజయవంతం చేద్దాం

- టిపిసిసి వైస్ ప్రెసిడెంట్, చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జీ బొంతు రామ్మోహన్

**చేవెళ్ల, జులై 2 (మనం న్యూస్ ):** 4వ తేదిన ఎల్బి స్టేడియంలో నిర్వహించే ఖర్గే సభను విజయవంతం చేయాలని టి పి సి సి వైస్ ప్రెసిడెంట్, చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జీ బొంతు రామ్మోహన్ అన్నారు. చేవెళ్ల పట్టణ సమీపంలోని పద్మావతి కన్వెన్షన్ హాల్ లో పార్టీ అధ్యక్షులు , నాయకులు గ్రామస్థాయి కమిటీ సభ్యులతో టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ , చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జీ బొంతు రామ్మోహన్, నారాయణపేట శాసన సభ్యురాలు పర్ణిక రెడ్డి, చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్యలతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... చేవెళ్ల నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో గ్రామస్థాయి నాయకులు పాల్గొనాలన్నారు.అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఆత్మీయ సమ్మేళనం వహించడం జరుగుతుందన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు , బ్లాక్ అధ్యక్షులు పార్టీ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో నియోజకవర్గం నుండి పాల్గొని విజయవంతం చేయాలన్నారు.ఈ సభకు ముఖ్యఅతిథిగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పాల్గొంటారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి , చేవెళ్ల, ముడిమ్యాల సహకార సంఘాల చైర్మన్లు దేవర వెంకటరెడ్డి గోనె ప్రతాపరెడ్డి, టిపిసిసి సభ్యులు షాబాద్ దర్శన్, మాజీ జెడ్పిటిసి మాలతి కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, డిసిసి ఉపాధ్యక్షులు బండారు ఆగిరెడ్డి, పడాల రాములు, చేవెళ్ల మున్సిపల్ పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు వీరేందర్ రెడ్డి, చేవెళ్ల మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, వివిధ గ్రామాల గ్రామ కమిటీ అధ్యక్షులు, నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



## భారతీయ పౌరులపై అమెరికా దుర్మార్గపు చర్యలను ఖండించాలి



**మర్రిగూడ, జూలై 02(మనం న్యూస్):** దేశ ప్రయోజనాలను ప్రతిష్టను అమెరికాకు తాకట్టు పెడుతున్న నరేంద్ర మోడీ విధానాలపై ఉద్యమించాలని భారతీయులపై అమెరికా దుర్మార్గపు చర్యను ఆపాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బుధవారం రోజు అమెరికా రాయబార కార్యాలయాన్ని ముట్టడి చేయాలని చలో అమెరికా రాయబార కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి వెళుతున్న అఖిలభారత యువజన సమైక్య నల్లగొండ జిల్లా అధ్యక్షులు బూడిద సురేష్ ని (ప్రివెంటివ్) ముందస్తు అరెస్టు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ విధానాలు దేశానికి ప్రమాదకరమని దేశాన్ని తిరోగమన దిశలో తీసుకెళ్లే విధానాలను అనుసరిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు వత్తాసు పలుకుతూ దేశ సార్వభౌమత్వాన్ని ప్రతిష్టను నష్టపరిచే చర్యలను దేశ పౌరులు తిప్పికొట్టాలన్నారు. భారత పౌరులపై అమెరికా దుర్మార్గంగా వ్యవహరించడాన్ని అభ్యంతరం చెప్పడంలో నరేంద్ర మోడీ విఫలమవడం ద్వారా మరోసారి తన క్రూరమైన వైఖరిని అమెరికా బహిర్గతం చేసిన మోడీ ప్రభుత్వం మౌనం వహించడం సిగ్గుచేటని ఆయన ఆరోపించారు. దేశ ప్రజల రక్షణకు అమెరికా రాయబార కార్యాలయాన్ని ముట్టడి కార్యక్రమం విజయవంతం చేయాలనీ వెళ్తున్న మమ్మల్ని అరెస్టు చేయడం నీతిమాలిన చర్య అని ఆయన విమర్శించారు.

## వర్షా కాలంలో....



కొన్ని ప్రకృతి వరాలు
పరవశింప జేస్తుంటయ్
చిటపట మంటూ చినుకులు
ఇంటి రేకులపై సరిగమల సవ్వడైతది
వసారా మీదుగా నీటి బొట్లై
రాలుతున్న దృశ్యం

మనసున ముత్యాల ముగ్గుల్ని పరుస్తది
పచ్చని ఆకుల మధ్య
తచ్చాడుతున్ననీటి బిందువులు
వెండి వెలుగుల చుక్కలై మెరుస్తుంటయ్

అరటాకులే గొడుగులైన అడుగులు
కాగితప్పడవల్లే కదలాడిన బుడుగులు
వర్ష ఋతువు హర్ష స్మ ృతులు

వరదలతో ఊరంతా ఉప్పొంగినా
చింతచెట్టు కింద ముసలవ్వ కాల్చిన
మొక్కజొన్న పొత్తులు తింటూ
బషీర్ భాయ్ ఇచ్చిన
గరమ్ ఛాయ్ తాగుతూ..
దోస్తులతో చేసే కమ్మని కబుర్లు
మనసున మల్లెలై గుభాళించేవి

సూరన్న రవ్వంత తొంగిచూసినా..
రక్కున ఆకాశంలో
పొడుసు కొచ్చిన ఇంద్రధనస్సు
ఆనందాన్ని మోసుకొచ్చిన ఉషస్సయ్యేది

ఏరువాక సాగుతో పల్లెంతా పడుచు పిల్లయ్యేది
హరిత హారాన్ని కప్పుకున్న అడవంతా
కవి కుంచె గీసిన అక్షర చిత్రమయ్యేది..!

**- డా. కటుకోఝ్వల రమేష్**
9949083327

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# భారత్ 'పచ్చ బంగారం' : ఐసిపివి



మనదేశం ముఖ్యంగా మన తెలంగాణ నేల అన్నం పెట్టే వ్యవసాయానికి పెట్టింది పేరు. మన రైతన్నలు పండించే పప్పు ధాన్యాలు లక్షలాది మందికి ఆహారం, బలం. కానీ, ఒక చేదు నిజాన్ని ఒప్పుకోవాలి. ప్రపంచంలోనే ఎక్కువ పప్పు ధాన్యాలు పండించే దేశం మనదే అయినా, కందిపప్పు విషయంలో మాత్రం మనం దిగుమతులపై ఆధారపడుతున్నాం. ఏటా దాదాపు 15 లక్షల టన్నుల కంది పప్పును దిగుమతి చేసుకోవడానికి 800 మిలియన్ డాలర్లు ఖర్చు పెడుతున్నాం. ఇది మన ఆహార భద్రతకు, అన్నదాతల జీవితాలకు పెద్ద సవాలు. దీనికి తోడు, రోజురోజుకీ మారి పోతున్న వాతావరణం, అకాల వర్షాలు, ఊహించని ఎండలు వ్యవసాయాన్ని మరింత గందరగోళంలో పడేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో, ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది సెమీ-అరిడ్ ట్రాపిక్స్ (ఇక్రిశాట్) ఓ అద్భుతమైన కందిపప్పు వంగడాన్ని తీసుకొచ్చింది. దాని పేరే ఐసిపివి 2544. ఇది నిజంగా మన వ్యవసాయానికి ఓ కొత్త దారి చూపబోతోంది. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా తీవ్రమైన వేడిని తట్టుకునే, ఫోటో-థర్మో ఇన్సెన్సిటివ్ కందిపప్పు రకం ఇది. అంటే, ఇది 45 డిగ్రీల సెల్సియస్ వరకు ఉండే ఉష్ణోగ్రతలను తట్టుకోగలదు. అంతేకాదు, కేవలం 125 రోజుల్లోనే కోతకు వస్తుంది. ఇప్పటివరకు కొన్ని నెలలకే పరిమితమైన కంది పప్పును సంవత్సరం పొడవునా పండించే అవకాశం కలగడం ఒక పెద్ద విప్లవం అనొచ్చు.

**ఆవిష్కరణల ప్రతిరూపం**

ఐసిపివి 25444 అనేది సాధారణ రకం కాదు, ఇది ఓ అసాధారణ వంగడం. దీని ముఖ్య లక్షణం దాని అద్భుతమైన వేడి నిరోధకత. వేసవిలో మండుటెండల్లో కూడా దీన్ని పండించుకోవచ్చు. ఇది 'ఫోటో-థర్మో ఇన్సెన్సిటివ్' కావడం వల్ల, పంట పెరుగుదల పగటిపూట సూర్యరశ్మి లేదా ఉష్ణోగ్రతలపై ఆధారపడదు. గతంలో కందిపప్పును కొన్ని సీజన్లలో మాత్రమే పండించడానికి ఇదే కారణం. కర్ణాటక, ఒడిశా, మన తెలంగాణలో చేసిన పరీక్షల్లో ఇది హెక్టారుకు 2 టన్నుల దిగుబడి నిచ్చింది. ఇది మన దేశ వాతావరణ పరిస్థితుల్లో ఎంత బాగా పండుతుందో దీని ద్వారా అర్థమవుతుంది. ఈ అద్భుతం అనుకోకుండా జరిగింది కాదు. ఇది ఇక్రిశాట్ 2024లో రూపొందించిన 'ప్రపంచంలోనే మొట్టమొదటి కందిపప్పు స్పీడ్-బ్రీడింగ్ ప్రోటోకాల్' ఫలితం. ఈ కొత్త పద్ధతి పంటల అభివృద్ధి కాలాన్ని గణనీయంగా తగ్గించింది. సాధారణంగా కొత్త వంగడాలను అభివృద్ధి చేయడానికి 15 సంవత్సరాలు పట్టేది. కానీ ఇప్పుడు కేవలం ఐదేళ్లలోనే పూర్తి చేయొచ్చు. ఈ ప్రోటోకాల్ వల్ల శాస్త్రవేత్తలు సంవత్సరానికి నాలుగు సార్లు పంటలను పండించి,



ఆధునిక జన్యు సాంకేతికతలను ఉపయోగించి విత్తన ఉత్పత్తిని, జన్యు విశ్లేషణను వేగవంతం చేస్తున్నారు. 'అవసరం, సంకల్పం' ఉంటే సైన్స్ ఏమైనా సాధించగలదని ఇది నిరూపిస్తుంది.

**భవిష్యత్ ప్రణాళికలు, విస్తృత ప్రయోజనాలు:**

ఐసిపివి 25444 రాకతో మన కందిపప్పు కొరతను తీర్చడానికి, వ్యవసాయ రంగం మరింత బలంగా మారడానికి రెండు రకాల వ్యూహాలు అమలు చేయవచ్చు. ఒకటి, ఇప్పటికే ఉన్న సాగు భూముల్లో ఎక్కువ దిగుబడి కోసం ఈ కొత్త రకాన్ని ఉపయోగించడం (నిలువువిస్తరణ). రెండోది, ఇంకా పండించని భూముల్లోకి, ముఖ్యంగా వేసవి కాలంలో ఖాళీగా ఉండే భూముల్లోకి సాగును విస్తరించడం (క్షితిజ సమాంతర విస్తరణ). దీని వేడిని తట్టుకునే సామర్థ్యం, తక్కువ కాలపరిమితి రబీ (శీతాకాలం)లో వరి కోత తర్వాత మిగిలిన పొలాల్లో, సాగునీటి సౌకర్యాలున్న ఖాళీ వేసవి భూముల్లో పండించడానికి ఎంతో అనుకూలం. ముఖ్యంగా, సాగునీటి వ్యవస్థల చివర ఉండే 20 నుండి 30 లక్షల హెక్టార్ల 'టెయిల్-ఎండ్ కమాండ్ ఏరియాస్' లో ఇది పెద్ద మార్పు తీసుకురాగలదు. ఈ ప్రాంతాల్లో నీటి కొరత వల్ల రెండో పంటలు సరిగా పండవు. ఇక్కడ హెక్టారుకు 1.5 నుండి 2 టన్నుల దిగుబడినిచ్చే కందిపప్పును పండించడం వల్ల రైతుల ఆదాయం పెరుగుతుంది. అంతేకాకుండా గతంలో నిరుపయోగంగా ఉన్న కాలాలను కూడా లాభదాయకంగా మార్చుకోవచ్చు. ఏడాది పొడవునా కందిపప్పు పండించగలిగే అవకాశం మన వ్యవసాయానికి గొప్ప వరం.

ఇది రైతులకు పంటల మార్పిడిలో స్వేచ్ఛనిస్తుంది, ఆదాయ మార్గాలను పెంచుతుంది. ఒక సీజన్ పంట పాడైతే వచ్చే నష్టాన్ని తగ్గిస్తుంది. వాతావరణ మార్పులు, ఊహించని వాతావరణ పరిస్థితుల్లో ఈ బలం మనకు చాలా అవసరం. దేశీయంగా కందిపప్పు ఉత్పత్తి పెరిగితే, మార్కెట్లో ధరలు స్థిరంగా ఉంటాయి, వినియోగదారులకు కూడా అందు బాటులో ఉంటాయి. ఇది మన దేశ ఆహార భద్రతను బలో పేతం చేస్తుంది. అంతేకాదు, కందిపప్పు దిగుమతులపై ఏటా ఖర్చు చేసే 800 మిలియన్ డాలర్లు ఆదా అవుతాయి. ఈ సొమ్మును ఇతర ముఖ్యమైన అభివృద్ధి పనులకు ఉపయోగిం చవచ్చు.

**సవాళ్లు, మన ముందున్న మార్గం**

ఐసిపివి 25444 అద్భుతమైన అవకాశాలను అందిస్తున్నప్పటికీ, దీనిని దేశవ్యాప్తంగా విస్తృతంగా అమలు చేయడానికి కొన్ని సవాళ్లను అధిగమించాలి. చాలా మంచి దిగుబడినిచ్చే వంగడాలు అందుబాటులో ఉన్నా, మన దేశంలో కందిపప్పు ఉత్పత్తి ఇంకా నిలకడగా లేదు. దీనికి కారణం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మెరుగైన సాగు విధానాలు ఇంకా పూర్తిస్థాయిలో రైతులకు చేరకపోవడమే.

**అడ్డుగా నిలిచే కొన్ని ముఖ్యమైన సమస్యలు**

నాణ్యమైన విత్తనాల సరఫరా కొరత, జీవన ఎరువుల వాడకంలో సవాళ్లు, ఎక్కువ శ్రమతో కూడిన సాగు, పంట కోసిన తర్వాత వచ్చే సమస్యలు వంటి మౌలిక సదుపాయాల కొరతలు వెంటాడతాయి. అంతేకాకుండా చాలామంది రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై అవగాహన లేదు. ధరల్లో హెచ్చుతగ్గులు కూడా వారి సాగు నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి.

**పరిష్కారాలు**

ఈ పంటపై పూర్తి ప్రయోజనాలను పొందాలంటే, మనం సమగ్ర విధానాన్ని అవలంబించాలి. రైతన్నలకు కొత్త పద్ధతుల గురించి వివరించడానికి బలమైన వ్యవసాయ విస్తరణ సేవలు అవసరం. వారికి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలి. సాగునీటి సౌకర్యాలను మెరుగు పరచాలి. మార్కెట్లో ధరలను స్థిరంగా ఉంచాలి. రిమోట్ సెన్సింగ్, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ వంటి ఆధునిక పద్ధతులను ఉపయోగించి, మెరుగైన సాగు విధానాలతో, విత్తన సరఫరా వ్యవస్థలను పటిష్టం చేసి 15 లక్షల హెక్టార్లకు సాగును విస్తరించాలి. ఇక్రిశాట్ వంటి పరిశోధనా సంస్థలు, వాణిజ్య విత్తన కంపెనీల మధ్య బలమైన భాగస్వామ్యాలను ప్రోత్సహించడం ఇలాంటి ఆవిష్కరణలు నిరంతరం కొనసాగడానికి, విస్తృతంగా రైతులకు చేరడానికి చాలా ముఖ్యం. ఐసిపివి 25444 కేవలం ఒక కొత్త వంగడం కాదు. ఇది మన శాస్త్రవేత్తల ప్రతిభకు నిదర్శనం. మన దేశ వ్యవసాయ భవిష్యత్తుకు ఓ ఆశాకిరణం. కందిపప్పుకు ఉన్న కాలపరిమితిని తొలగించి, ఇది నిజంగా 'అన్ని కాలాల కందిపప్పు'గా మారబోతోంది. వేడిని తట్టుకునే దీని శక్తి, వేగంగా పండే దీని గుణం మన దేశ కందిపప్పు కొరతకు ఓ చక్కటి పరిష్కారం.

**అండగా నిలవాలి**

ఆర్థిక ప్రయోజనాలకు మించి ఈ వంగడం మన దేశ ఆహార భద్రతను పెంచుతుంది. వాతావరణ మార్పులను తట్టుకునే శక్తిని మన వ్యవసాయానికి ఇస్తుంది. ఇది రైతులకు ఎక్కువ విలువనిచ్చే, మార్పులకు అనుగుణంగా ఉండే పంటను అందిస్తుంది. అనూహ్య వాతావరణ మార్పుల కాలంలో, ఇది వారికి ఎక్కువ ఆదాయ మార్గాలను, స్థిరత్వాన్ని ఇస్తుంది. మన దేశం వాతావరణ మార్పుల సవాళ్లను, ఆహార అవసరాలను ఎదుర్కొంటున్నప్పుడు ఇటువంటి ఆవిష్కరణలు కేవలం వ్యవసాయ పురోగతులు మాత్రమే కావు. అవి మన దేశానికి మరింత సురక్షితమైన, సంపన్నమైన, స్థిరమైన భవిష్యత్తుకు పునాదులు. ఈ 'పచ్చ బంగారం' మన పొలాలను సుసంపన్నం చేసి మన రైతన్నలకు అండగా నిలుస్తుందని ఆశిద్దాం.

**- జనక మోహన రావు దుంగ**
8247045230

# ప్రాణాంతకంగా మారుతున్న ప్లాస్టిక్



నేడు ప్రపంచమంత ప్లాస్టిక్‌మయం అయ్యింది. ప్లాస్టిక్ కనబడని గృహం లేదు, వాడని మనిషి లేడు. ఎక్కడ చూసినా ఏమున్నదా గర్వకారణం, సర్వం గరళ ప్లాస్టిక్ బ్యాగుల బూతమే. వాడడానికి సౌకర్యంగా, మన్నిక కలిగిన గుణాలు ప్లాస్టిక్స్ స్వంతం. చెవులను శుభ్రం చేసుకునే ఇయర్ బడ్ నుంచి, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, పాలు/నూనె/ద్రవాల ప్యాకెట్లు, వాటర్ పాటిల్స్, పానీయాలు తాగే స్ట్రాలు, వంటింటి సరుకులు నిల్వ చేసే డబ్బాలు, కుర్చీలు, పలు రకాల పర్నీచర్లు, పిల్లల ఆట బొమ్మల వరకు ఎక్కడ చూసినా, ఏ దుకాణానికి వెళ్లినా సర్వం ప్లాస్టిక్ వస్తువులు లేదా ప్యాకేజ్‌లు కనిపిస్తున్నాయి. నాడు కర్రకు ప్రత్యామ్నాయంగా, వరప్రసాదంగా 1930ల్లో కనుగొనబడి, 1970-1980లో వాడకం మొదలైన ప్లాస్టిక్ ఉత్పత్తులు నేడు సముద్ర జలాలు, సాగు నేలలను సహితం విషతుల్యం చేసే దుస్థితి వరకు ప్లాస్టిక్ బూతం చేరింది.

వాడి పడేసిన ప్లాస్టిక్ ఉత్పత్తులు జీవ విచ్ఛిన్నం కావడానికి 100 నుంచి 1000 ఏండ్లు పడుతున్నది. రసాయనశాస్త్ర పరంగా చిన్న చిన్న అణువు అనేకం రసాయన చర్యల ద్వారా కలిసి అతి పెద్ద శృంఖలాలు ఏర్పడి, ప్లాస్టిక్ బృహదణువులుగా లేదా పాలిమర్లా పిలువబడతాయి. పాలిథీన్ కవర్స్, పివిసి పైప్స్ లాంటి ప్రధాన ప్లాస్టిక్ ఉత్పత్తుల గుర్చి మనకు తెలుసు.

**అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం**

ఒక నాడు షాపుల్లో పర్యావరణహిత పేపర్ ప్యాకింగ్ చేసే అలవాటు ఉండేది. మనం ఏ వస్తువును కొన్నా ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల్లోనే ఇంటికి తెచ్చుకుంటాం. ప్రపంచవ్యాప్తంగా సాలీనా 5 ట్రిలియన్ల ప్లాస్టిక్ బ్యాగులు తయారు చేయబడడం, నిమిషానికి 1 మిలియన్ బ్యాగులు వాడడం, ప్రతి మనిషి సగటున 25 నిమిషాలకు ఒక ప్లాస్టిక్ బ్యాగు వాడడం జరుగుతున్నది. విచ్చలవిడిగా, విచక్షణారహితంగా వాడుతున్న ప్లాస్టిక్ బ్యాగుల పర్యావరణానికి అత్యంత ప్రమాదకర



మని మేల్కొనవలసిన సమయం ఆసన్నమైంది. ప్లాస్టిక్ బ్యాగుల వినియోగంతో దాదాపు ఒక లక్ష సముద్ర జంతువుల మనుగడ ప్రశ్నార్థకం అయ్యింది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రమాదకర ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం పట్ల అవగాహన కల్పించడానికి, వాటి దుష్ప్రభావాలను వివరించడానికి ప్రతి ఏట 03 జూలై రోజున అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం వేదికగా ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని పూర్తిగా తగ్గించడం, వాటి విష ప్రభావాలను వివరించడం, వాటికి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వెతకడం, పర్యావరణ పరిరక్షణకు కంకనబద్దులు కావడం లాంటి అంశాలను అవగాహన పరుస్తారు.

**ప్లాస్టిక్ బ్యాగులు లేని పౌర సమాజ నిర్మాణం సాధ్యమా!**

మన ఇంట్లో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించుకోవడం, ప్లాస్టిక్ కవర్ల్సు బదులుగా పేపర్ లేదా క్లాత్ బ్యాగులు వాడడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగులను నిషేధించడం, తప్పనిసరి అయినపుడు ఒక్క ప్లాస్టిక్ బ్యాగును తిరిగి పలుమార్లు వాడడం, ప్లాస్టిక్ బ్యాగులు లేని మార్కెటింగ్ రోజులను తిరిగి పొందడం, సహజ ఉత్పత్తులతో బ్యాగులను తయారు చేసుకొని వాడడం లాంటి చర్యలకు పూనుకోవలసిన సమయం ఆసన్నమైంది. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే మైక్రో ప్లాస్టిక్ అవశేషాలు మానవ శరీరంలోకి చేరి తీవ్ర అనారోగ్యాలకు కారణం కావడం, సకల జీవ కోటి మనుగడ ప్రశ్నార్థకం కావడం జరుగుతుంది. నేడు ప్లాస్టిక్ వ్యర్థాలు భూగ్రహానికి శాపాలుగా మారుతున్నాయి.

సారవంతమైన నేలల్ని, సముద్ర నదీ జలాలను ప్లాస్టిక్ బ్యాగులు కలుషితం చేస్తు న్నాయి. అన్నీ తెలిసిన నరుడు నరకానికి నిచ్చె నలు వేస్తున్నాడు. తను ప్రమాదంలో పడడమే కాకుండా సకల జీవరాశులను కూడా ప్రమాదం లోకి నెడుతున్నాడు నేటి డిజిటల్ యుగపు మానవుడు. అందుకే తక్షణమే ప్లాస్టిక్ బ్యాగు రహిత సమాజ స్థాపనకు ప్రతినబూనుదాం, మన రేపటి ఆరోగ్యాలను మనమే కాపాడుకుందాం.

**(3 జూలై అంతర్జాతీయ ప్లాస్టిక్ రహిత దినం)**

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# యుద్ధం ఏం సాధించింది?



పన్నెండు రోజులుగా కొనసాగిన ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం అమెరికా అధ్యక్షుడి 'ట్రూత్' మెస్సేజ్ తర్వాత నెమ్మదించింది. కొన్ని ఉల్లంఘనలు జరిగినా.. 2025 జూన్ 24 నుంచి సీజ్ ఫైర్ అమలులోకి వచ్చింది. అప్పుడు ఇరాన్‌లో అణు స్థావరాల ధ్వంసం తనకు దక్కిన గౌరవంగా ట్రంప్ ప్రకటించుకున్నారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిర్వీర్యం చేశామని, బాలిస్టిక్ మిస్సైల్ సామర్థ్యాన్ని ధ్వంసం చేశామని, సైనిక నాయకత్వానికి తీవ్ర నష్టం కలిగించామని, ఇది తమ విజయమని ఇజ్రాయెల్ ప్రకటించింది. గట్టిగా పోరాడడం వల్లే ఇజ్రాయెల్, అమెరికా దిగివచ్చాయని, సీజ్ ఫైర్ కోసం అమెరికా తమను బతిమాలిందని ఇరాన్ చెప్పింది. పన్నెండు రోజుల యుద్ధానికి విరామమిచ్చి.. ఒక వారం గడిచినా.. యుద్ధంలో ఎవరు ఏం సాధించారో గొప్పలు చెప్పుకోవడం తప్ప.. ఇప్పటికీ దేనిపైనా స్పష్టత లేకుండాపోయింది.

ఇజ్రాయెల్-ఇరాన్ వార్ మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందేమోననే ఆందోళనలు విశ్వవ్యాప్తంగా నెలకొనగా.. ట్రంప్ ప్రకటన తర్వాత ఒకటే సారి సీజ్ ఫైర్ నిర్ణయం జరిగింది. అయితే ఇందులో ఇరాన్, అమెరికా చాకచక్యంగా వ్యవహరించినట్టు అర్థమవుతున్నది. బంకర్ బస్టర్ బాంబులతో తమ అణుస్థావరాలపై దాడికి ప్రతిఘటనగా ఖతర్ లోని అల్ ఉదెద్ ఎయిర్ బేస్ పై దాడి చేసినట్టు ఇరాన్ ప్రకటించింది. అయితే దీనికి సంబంధించి ఖతార్, అమెరికాలకు ముందస్తు సమాచారమివ్వడంతో ఆ దేశాలు అప్రమత్తమై నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నాయి. ఆ తర్వాత ట్రంప్ ఇరాన్ కు థాంక్యూ చెబుతూనే.. యుద్ధ విరమణకు ప్రయత్నాలు చేశారు. ఖతర్ సహకారంతో ఇరాన్ సీజ్ ఫైర్‌కు అంగీకరించేలా చేయగలిగారు. అయితే యుద్ధం వల్ల రోజుకు రూ. వేల కోట్లు ఖర్చు అవుతుండడం, ఆయుధ నిల్వలు తగ్గిపోతుండడం, అంతర్జాతీయ ఒత్తిడి కారణంగా ఇరాన్, ఇజ్రాయెల్‌లు సీజ్ ఫైర్‌కు



ఒప్పుకున్నట్లు తెలుస్తున్నది.

నోబెల్ శాంతిబహుమతి కావాలని ట్రంప్ బలంగా కోరుకుంటున్నారు. ఇందుకోసం ఇప్పటికే రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధ విరమణను ప్రయత్నించి విఫలమయ్యారు. భారత్-పాకిస్తాన్ యుద్ధం తనవల్లే ఆగిందని గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇప్పుడు ఇరాన్ -ఇజ్రాయెల్ యుద్ధాన్ని తానే ఆపినట్లు కనిపిస్తే.. నోబెల్ శాంతి బహుమతి తనకు వచ్చే అవకాశముందని భావించే ట్రంప్.. ఖతర్‌లోని అమెరికాకు చెందిన అల్ ఉదేద్ ఎయిర్ బేస్పై దాడి జరిగినా స్పందించకుండా.. యుద్ధ విరమణ ప్రయత్నాలు చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, ఇరాన్-ఇజ్రాయెల్ సీజ్‌ఫైర్‌కు, ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకున్నందుకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని ఇప్పటికే జార్జియా రిపబ్లికన్ రిప్రజెం టేటివ్ బడ్డీ కార్టర్ ట్రంప్ పేరును నోబెల్ శాంతి బహుమతికి ప్రతిపాదించారు. మిడిల్ ఈస్ట్‌లో అమెరికా యుద్ధాలను గతంలో ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నష్టం చేయడమే తమ లక్ష్యమని, అది పూర్తయిందని ఇప్పటికే ట్రంప్ ప్రకటించడం గమనార్హం.

ఈ యుద్ధంలో తమది చారిత్రాత్మక విజయమని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ఇప్పటికే ప్రకటించారు, ఇరాన్ పరమాణు కార్యక్రమం, బాలిస్టిక్ మిస్సైల్ సామర్థ్యాలను గణనీయంగా నాశనం చేశామని ఇజ్రాయెల్ చెబుతున్నది. ఈ దాడులు ఇరాన్ను అణ్వాయుధ సామర్థ్యం నుండి సంవత్సరాల వెనక్కి నెట్టిందని వాదిస్తున్నది. 30 మంది ఇరాన్ ఉన్నతస్థాయి మిలటరీ నాయకులను, కీలక అణుశాస్త్రవేత్తలను మట్టుబెట్టామని చెబుతున్నది. అయితే తాము హతమార్చామని ఇజ్రాయెల్ చెబుతున్న ఇద్దరు కీలక వ్యక్తులు మళ్లీ ఇరాన్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొని కనిపించడం గమనార్హం. మరోవైపు ఈ యుద్ధంలో తామే విజయం సాధించామని ఇరాన్ ప్రకటించుకున్నది. దేశంలో పెద్ద ఎత్తున విజయోత్సవ సంబురాలు నిర్వహిస్తున్నది. ఇరాన్ మిస్సైల్స్ ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ రక్షణ వ్యవస్థను చిన్నాభిన్నం చేశాయని ఇరాన్ చెబుతున్నది. తమ పరమాణు కార్యక్రమం కొనసాగుతుందని, ఐఏఈఏ ఒప్పందం నుంచి బయటకు వస్తున్నట్లు ఇరాన్ పేర్కొంటుండడం గమనార్హం. అయితే ఎవరి వాదనలు ఎలా ఉన్నా.. ఈ యుద్ధం మరింత పెరగకుండా ప్రపంచ దేశాలను ఊపిరి పీల్చుకునేలా చేసింది. అయితే గాజాలోని పాలస్తీనా పౌరులపై ఇజ్రాయెల్ చేస్తున్న మారణకాండను ఆపేందుకు నోబెల్ శాంతి బహుమతికి ప్రయత్నిస్తున్న ట్రంప్ సహకరిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

**- మహమ్మద్ ఆరిఫ్**
7013147990

# పోతరాజు వేషధారణలో విపరీత పోకడలు ఎందుకు?



ఆషాడ మాసంలో జంట నగరాలలో, శ్రావణ మాసం తెలంగాణ పల్లెలలో జరిగే పండుగ బోనాలు. తెలంగాణలో అత్యంత ఉత్సాహంతో సకలజనులు జరుపుకునే పండగ. గ్రామదేవతలైన మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ ఈదమ్మ, పెద్దమ్మ ,చౌడమ్మ పోలేరమ్మలకు బోనం పెడతారు. సాధారణ స్త్రీలు బోనాలుచేసి భక్తి తో ఎత్తుకుంటారు. కొందరు శివసత్తులులు మూడంత్రాల బోనం, ఏడంత్రాల బోనం చేస్తారు. ప్రతి అంతరంలో ప్రత్యేకంగా బెల్లన్నం(పరమన్నం) పెరుగన్నం, పాలన్నం, తెల్లన్నం లాంటి ఆహార పదార్థాలను బోనంలో పెట్టి ఊరేగింపుగా బయలుదేరుతారు. ఊరగింపు సమయంలో బోనాలకు రక్షణగా గ్రామదేవతలైన ఏడుగురు అక్కల ముద్దుల తమ్ముడైన పోతరాజు ముందు నడుస్తాడు. దుష్టశక్తులను దరిచేరకుండా వీర గోలలు పెడేల్ పెడేల్ మంటు వీరంగం వేస్తాడు. డప్పుల మోతలు, జెమడికే చప్పుళ్ళు, డిల్లెం బొల్లెం దరువులకు అనుగుణంగా అడుగులేస్తాడు. పోతరాజు విన్యాసాలు చేస్తుంటే చూసి ఆనందించని వారుండరు. వారి వీరగోలల చప్పుడుకు అదరని వారుండరు.

పోతరాజు వేషధారణ విషయంలో పెయ్యంత పసుపు బండార్లు రుద్దుకుంటారు. గజ్జల లాగేసుకుంటారు. పిక్కలకు మువ్వలు, కాళ్లకు గజ్జెలు కట్టుకుంటారు. గొర్రె ఉన్నితో చేసిన శాలువా లాంటి వస్త్రం నడుముకు చుట్టుకుంటారు. చేతిలో జనుపనారతో చేసిన వీరగోలలు పట్టుకుంటారు. కొందరు తల వెంట్రుకలు సహజంగా పెంచుకుంటారు. మరి కొందరు విగ్గు పెట్టుకుంటారు. ఒక్కొక్కసారి చేతిలో శూలం, కత్తి లాంటివి కూడా పట్టుకుంటారు. ప్రతిచోట పోతరాజు వేషధారణ అటు ఇటుగా ఇలాంటి ఆహార్యంతోనే ఉంటుంది. పోతరాజు వేషధారులు భక్తితో ప్రదర్శన ఇస్తూ భక్తులను అలరిస్తారు.

ఒకప్పుడు ఈ పోతరాజు వేషాలు ప్రత్యేకంగా కొందరు మాత్రమే వేసేవారు. కొందరు శివసత్తులుగా ఉండి వృత్తిగా స్వీకరించేవారు. వారు వివిధ సందర్భాలలో అంటే దేవుని లగ్గం, ఇంటి లగ్గం, మల్లన్న పండగ, బీరప్ప పండగ, గంగ బోనం, మైలలు తీసిసుడు, కొన్ని బహుజన కులాలలోని పెళ్లిళ్ల సందర్భంగా ఈ పోతరాజు వేషాలు వేస్తారు.

ఈ మధ్యకాలం లో కొంతమంది యువకులు ఉత్సాహంతో పోతరాజు వేషధారణ చేసి అలరిస్తున్నారు. అందులో తప్పు పట్టవలసినది ఏమీ లేదు. అత్యుత్సాహంతో పోతరాజు వేషధారణలో కొంచెం అతిగా ప్రవర్తిస్తున్నట్టు అనిపిస్తుంది. ముఖ్యంగా పసుపు బండార్లలకు బదులుగా వేరువేరు రంగులతో వేషధారణ చేస్తున్నారు. పసుపు బండార్లలో ఉన్న పవిత్రత, భక్తి భావన ఇలాంటి వేషధారణలో కనిపించడం లేదు. కాబట్టి మన సంస్క ృతి ,సంప్రదాయాలకు, పండుగలకు సంబంధించిన విషయం కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవలసిన బాధ్యత మనందరిది.

ప్రస్తుత కాలంలో సామాజిక మాధ్యమాల ప్రభావం ప్రజల మీద విపరీతంగా ఉంది. బోనాలు గాని, బతుకమ్మ గాని, పోతరాజుల వేషధారణ గాని ప్రత్యేక సందర్భా లలో పవిత్రంగా చేసుకునేవి. కానీ ఈ మధ్యకాలంలో ప్రతి వేదిక దగ్గర, సమయం కాని సమయాలలో, రాజకీయ వేదికల దగ్గర కనిపిస్తున్నవి. తెలంగాణ సంస్క ృతి, సంప్రదాయాలు తెలియని వారికి తప్పుడు సందేశం వెళ్ళే అవకాశం ఎక్కువగా ఉంది. చేసే పని ఏదైనా మన సంస్క ృతి సంప్రదాయాలకు గౌరవం పెంచేదిగా ఉండాలి. తెలంగాణ ప్రజానీకం ఆ విధంగా ఆలోచిస్తారని కోరుకుంటున్నాను.

**- డా. ఎడ్ల కల్లేశ్**
9866765126

# పారిశుధ్య నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలి

## జూలై 15 నాటికి రోడ్ల పై ఎక్కడా ప్లాస్టిక్, చెత్త లేకుండా శుభ్రం చేయాలి

## పట్టణాలలో రోడ్ల పక్కన అవెన్యూ ప్లాంటేషన్ క్రింద ఎత్తైన మొక్కలు నాటాలి

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, జూలై 02 (మనం ప్రతినిధి):** వర్షాకాలం పారిశుధ్య నిర్వహణ పట్ల పట్టణాలలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీ లు పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణాలలో చేపట్టిన అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, త్రాగు నీటి సరఫరా, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ వసూలు, వన్ మహోత్సవం సంబంధిత అంశాల పై కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,. పట్టణాలలో టి.యు.ఎఫ్.ఐ.డి.సి ద్వారా చేపట్టిన అంతర్గత రోడ్డు, డ్రైయిన్ నిర్మాణ పనులను నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సుల్తానాబాద్ పట్టణంలో ప్రతి రోజూ త్రాగు నీటి సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. పట్టణాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి వార్డు పరిధిలో పారిశుధ్య నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ కు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. పారిశుధ్య పనులను రెగ్యులర్ గా మానిటరింగ్ చేయాలని, రోడ్డు మీద చెత్త, ప్లాస్టిక్ ఉండటానికి వీలు లేదని అన్నారు. ప్రతి రోజూ ఉదయం పారిశుధ్య కార్మికుల పని తీరు మున్సిపల్ అధికారులు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జూలై నెలాఖరు వరకు సుల్తానాబాద్ పట్టణంలో డంప్ యార్డ్ సమస్య పరిష్కారం చేయాలని అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలో పని చేయని పారిశుధ్య కాంట్రాక్టర్ లను తొలగించాలని అన్నారు. రోడ్ల పై చిత్త వేయకుండా వాణిజ్య వ్యాపారులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. జూలై 15 నాటికి రోడ్డు పై ఎక్కడా చెత్త, ప్లాస్టిక్ ఉండకూడదని అన్నారు. పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రంగా మేయింటేన్ చేయాలని అన్నారు. మార్కెట్, పెట్రోల్ బంక్ వద్ద పబ్లిక్ టాయిలెట్స్ ఉండాలని అన్నారు. పబ్లిక్ ప్రదేశాలో చెత్త వేస్తే భారీ జరిమానా విధించాలని కలెక్టర్ సూచించారు. రోడ్ల పై నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, గుంతలను పూర్తి స్థాయిలో పూడ్చివేయాలని అన్నారు. వన మహోత్సవం కార్యక్రమం క్రింద పట్టణాలలో గ్రీనరి పెంచాలని, అవెన్యూ ప్లాంటేషన్ క్రింద 2 మీటర్ల కంటే ఎత్తైన మొక్కలు నాటి, వాటి సంరక్షణకు ట్రీ గార్డ్ కర్ర మొదలైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. పెద్దపల్లి పట్టణంలో చేపట్టిన సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. మురికి కాల్వలో చెత్త వేసే వారిని గుర్తించేందుకు వార్డు అధికారులు చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ యంత్రాంగంతో సహకరించకుండా అపరిశుభ్రత వ్యాప్తి చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అన్నారు. పట్టణాలలో ఎక్కడా అక్రమ నిర్మాణాలు జర్గడానికి వీలు లేదని, మన అనుమతులకు లోబడి నిర్మాణాలు జరుగుతున్నాయో లేదో రెగ్యులర్ గా చెక్ చేయాలని అన్నారు. పట్టణాలలోని రెసిడెన్షియల్ హాస్టల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనవసరమైన చెత్త ఉండకుండా చూడాలని అన్నారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం పై విస్తృత ప్రచారం కల్పించి పట్టణంలో 300 ఇండ్లలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు లక్ష్యంగా పని చేయాలని అన్నారు. పాఠశాలలు, హస్టల్స్ లో కూడా సోలార్ ప్యానెల్ ఏర్పాటు ప్రతిపాదనలు అందించాలని అన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అభ్యసన సామర్థ్యాల సాధన దిశగా విద్యాబోధన సాగాలి

- జిల్లా విద్యాధికారి శ్రీరాం మొండయ్య



**కరీంనగర్, జూలై 02 ( మనం బ్యూరో):** నగరంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సప్తగిరి కాలనీ పాఠశాలను జిల్లా విద్యాధికారి శ్రీరాం మొండయ్య సందర్శించారు.వారు ప్రార్థన సమయంలోనే పాఠశాల హాజరై పాఠశాలలో జరుగుతున్న ప్రార్థనను, ఇతర కార్యక్రమాలను పరిశీలించడం జరిగింది. అంతేకాకుండా 9వ,మరియు 10వ,తరగతులలో జరుగుతున్న జీవశాస్త్ర మరియు గణిత శాస్త్ర బోధనాభ్యాసన ప్రక్రియలను పూర్తిస్థాయిలో పీరియడ్ అయిపోయేంత వరకు కూర్చుని తరగతి గది బోధనలను పరిశీలించడం జరిగింది. విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి ఒక్కరికి జీవిత ఆశయం ఉండాలని జీవిత ఆశయం, వృత్తి వేర్వేరు అంశాలని వృత్తే జీవిత ఆశయం కాదని, జీవిత ఆశయం అనేది సమాజ హితము దేశహితంగా సాగాలని వారు సూచించారు. జీవిత ఆశయ సాధనకు చేపట్టే వృత్తిని మార్గంగా ఎంచుకోవాలని మార్గదర్శనం చేశారు. తదనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమైబోధన అభ్యసన సామర్థ్యాల సాధన దిశగా విద్యాబోధన సాగాలని, ప్రతి పీరియడ్ నిత్య నూతనంగా ఉండే విధంగా ఉపాధ్యాయులు తయారు కావాలని, విద్యార్థులకు బోధించే ముందు మనం బాగా ప్రాక్టీస్ చేసుకోవాలని అప్పుడే పూర్తిస్థాయిలో అనుకున్న విద్యా లక్ష్యాలు సాధిస్తామని వారు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరం విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం పాటుపడాలని ఆ దిశగానే మన ఆలోచనలు సాగాలని వారు సూచించారు. బోధన అనేది బాధతోనో, బాధ్యతతోనో కాకుండా సంతోషంగా, ఆనందిస్తూ ఆస్వాదిస్తూ బోధనను అందించాలని అప్పుడే పాఠశాల వాతావరణం అహ్లాదకరంగా తీర్చిదిద్దబడుతుందని వారు పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల సంఖ్య పెంపు కోసం ప్రతి ఒక్కరం కృషి చేయాలనీ సూచించారు. జిల్లా విద్యాధికారి వెంట జిల్లా విద్యాశాఖ ప్రణాళిక సమన్వయకర్త మిల్కూరి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యాలయాల్లో పిల్లలకు గుణాత్మక మైన బోధన అందించాలి

- దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం సైకిల్స్ ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ఎలిగేడు, జూలై 02 (మనం న్యూస్):** విద్యాలయాల్లో పిల్లలకు గుణాత్మకమైన బోధన అందించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఎలిగేడు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సుల్తాన్ పూర్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తాన్ పూర్ గ్రామం మాజీ సర్పంచ్ కీ.శే .తానిపర్తి కాంతారావు జ్ఞాపకార్థం వారి 6 కుమారులు పాఠశాలకు అందించిన దాదాపు 5 లక్షల రూపాయల విలువ గల ఎలెక్ట్రిక్ ఆటో ను, 19977-78 సంవత్సర 7వ తరగతి విద్యార్థులు అందించిన 2 లక్షల 16 వేల రూపాయల విలువ గల డైనింగ్ టేబుల్ సెట్ లను ప్రారంభించారు. సుల్తాన్ పూర్ జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా 9 లక్షల రూపాయలతో శిథిలావస్థలో ఉన్న డైనింగ్ హాల్ రిన్నోవేషన్ పనులు, 5 లక్షల రూపాయలతో చేపట్టిన అంతర్గత రోడ్డు, గేటు ఏర్పాటు పనులను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలోని విద్యార్థులకు అవసరమైన షూస్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు సైకిల్స్ అందించేందుకు ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలకు దాతలు అందించిన కిచెన్ షెడ్డు కు అవసరమైన 9 డైనింగ్ టేబుల్స్, 18 బెంచీలను కలెక్టర్ పంపిణీ చేశారు.విద్యాలయాల్లో విద్యార్థులకు సరైన బోధన అందించేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఎలిగేడు తహసీల్దార్ యాకన్న, ఎంపిడిఓ భాస్కర్ రావు, మండల విద్యాశాఖ అధికారి పాఠశాల హెడ్మాస్టర్ నరేంద్ర చారి, సంతోష్ రెడ్డి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పాఠశాల వార్షిక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి

- పాఠశాల ప్రాంగణం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- పాఠశాల వివరాలను ఎప్పటికప్పుడు యూ.డి.ఐ.ఎస్.ఈలో అప్ డేట్ చేయాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, జూలై 02 (మనం ప్రతినిధి):** ప్రతి పాఠశాల వార్షిక ప్రణాళికను సిద్ధం చేసుకోని, వాటి సాధన దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మంథని మండలంలోని ప్రభుత్వ పాఠశాల నిర్వహణ పై హెడ్ మాస్టర్ లతో పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మంథని మండలంలో 59 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, ప్రతి రోజు పాఠశాలలో ఫేషియల్ రికగ్నైంట్ సిస్టం ద్వారా ఉపాధ్యాయుల హాజరు నమోదు చేయాలని అన్నారు. టీచర్లకు సెలవులు మంజూరు విషయంలో నిబంధనలు పాటించాలని, ఒకేసారి టీచర్లు అంతా సెలవులు పెట్టకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ కోసం స్కావెంజర్స్ నిధులను ప్రభుత్వం ముందుగానే విడుదల చేస్తుందని, పాఠశాల ప్రాంగణం, పరిసరాలను క్లీన్ గా మెయింటైన్ చేయాలని అన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను ప్రతిరోజు పరిశీలించాలని కలెక్టర్ హెడ్ మాస్టర్ లకు సూచించారు. పాఠశాలలోనే త్రాగునీటి సరఫరా పైప్ లైన్ సరిగ్గా ఉందో లేదో పరిశీలించాలని అన్నారు. టీచర్లు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాల సంబంధించి వివరాలను ఎప్పటికప్పుడు యూ.డి.ఐ.ఎస్.ఈ లో అప్ డేట్ చేయాలని అన్నారు. ప్రతి పాఠశాల వార్షిక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పిల్లలకు కనీస విద్యా ప్రమాణాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాబోయే 10 నెలల పాటు సాధించాల్సిన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు ఉపాధ్యాయులు ప్రణళికాబద్ధంగా పనిచేసేలా చూడాలని అన్నారు. ప్రతి నెలా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు బోధన ఎలా ఉంటుంది, విద్యా ప్రమాణాలు పెంచడానికి ఇంకా ఏ చర్యలు తీసుకోవాలి ఇలాంటి అంశాల పై రివ్యూ సమావేశాలు నిర్వహించుకోవాలని కలెక్టర్ తెలిపారు. హెడ్ మాస్టర్లు, ఉపాధ్యాయులు సంయుక్తంగా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కాంప్లెక్స్ పరిధిలో ఉన్న సమస్యలను అక్కడే పరిష్కరించుకోవాలని అన్నారు. హై స్కూల్ విద్యార్థులకు పాఠ్యాంశాల అర్థమయ్యేలా బోధించాలని అన్నారు. పేరెంట్ టీచర్స్ మీటింగ్ సమావేశాలు ప్రతి నెలా జరగాలని, వీటికి కనీసం 60 శాతం తల్లిదండ్రులు హాజరు అయ్యేలా చూడాలని అన్నారు. కాంప్లెక్స్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక వస్తువులు కల్పనకు ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ సూచించారు. వన మహోత్సవం క్రింద మొక్కల పెంపకం లక్ష్యాలు సాధించాలని, పెట్టిన మొక్కల జియో ట్యాగింగ్ వేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి తరలింపు ద్వారా 2 కోట్ల 47 లక్షల99 వేల 500 ఆదాయం

- 5మండలాలో 2 కోట్ల 44 లక్షలతో 23 అభివృద్ధి పనులు
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



| Sl.no. | Name of the Mandal | No. of Works given | Amounts in Lakhs | Remarks |
|---|---|---|---|---|
| 1 | Manthani | 4 | 10 | Repairs towards Schools and CC Roads |
| 2 | Odela | 8 | 70 | |
| 3 | Peddapalli | 3 | 123 | |
| 4 | Srirampur | 6 | 21 | |
| 5 | Sulthanabad | 2 | 20 | Additional Accommodation to KGBV |
| | Total | 23 | 244 | |

Two crore 44 lakhs

**పెద్దపల్లి, జూలై 02 (మనం ప్రతినిధి):** మట్టి తరలింపు ద్వారా 2 కోట్ల 47 లక్షల 99 వేల500 ఆదాయం సంపాదించి సంబంధిత మండలాల్లో రోడ్లు పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని చెరువులలో నుంచి ఇప్పటి వరకు 9 వేల 185 ట్రాక్టర్ ట్రిప్పుల మట్టి తరలింపు ద్వారా 2 కోట్ల 47 లక్షల 99 వేల 500 రూపాయల ఆదాయం లభించిందని అన్నారు. పెద్దపల్లి మండలంలోని చేతికుంట చెరువు, కల్వా చెరువు ద్వారా 330 ట్రాక్టర్ ట్రిప్పులు, సుల్తానాబాద్ మండలంలోని నారాయణపూర్ గ్రామం షాంగై కుంట ద్వారా 71 ట్రాక్టర్ ట్రిప్పులు, శ్రీరాంపూర్ మండలంలోని పందిళ్ళ గ్రామ చెరువు ద్వారా 1575 ట్రాక్టర్ ట్రిప్పులు, ఓదెల మండలం లోని కొలనూరు గ్రామంలోని అప్పమాయ చెరువు ద్వారా 2125 ట్రాక్టర్ ట్రిప్పులు, అలిమయ చెరువు ద్వారా 3713 ట్రాక్టర్ ట్రిప్పులు, పెందుర్తి గ్రామంలోని ఊర చెరువు ద్వారా 1191 ట్రాక్టర్ ట్రిప్పులు, మద్దని మండలం సూరాయిపల్లి గ్రామంలోని రెడ్డి చెరువు ద్వారా 180 ట్రాక్టర్ ట్రిప్పులు మొత్తం 9185 ట్రాక్టర్ ట్రిప్పులు మట్టి తరలించమని అన్నారు. మట్టి తరలింపు ద్వారా లభించిన ఆదాయంలో 2 కోట్ల 44 లక్షల రూపాయలతో మంథని, ఓదెల, పెద్దపల్లి, శ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలంలో అంతర్గత సిసి రోడ్లు, ప్రభుత్వ పాఠశాల మరమ్మత్తు పనులకు, కేజీబీవీ లో అదనపు సౌకర్యం కల్పనకు వినియోగించడం జరిగిందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ప్రభుత్వ విప్



**వేములవాడ, జూలై 2(మనం న్యూస్):** వేములవాడ పట్టణంలోని 24, 25, 26, 27వ వార్డుల్లో బుధవారం చేపట్టిన సిసి రోడ్లు, సైడ్ డ్రెన్, పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.గత పదేళ్లలో నిలిచిపోయిన పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. పలు వార్డుల్లో పేరుకుపోయిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేదల సంక్షేమం, అభివృద్ధి ఒకే దారిలో నడుస్తున్నాయని చెప్పారు.పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సన్న బియ్యం పంపిణీ పథకం దేశంలో తొలి సారి అమలవుతోందని వివరించారు. రైతన్నలు, నేతన్నల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. గతంలో రైతులకు రుణమాఫీ చేసిన విధంగా, చేనేత కార్మికుల ఋణాలు కూడా మాఫీ చేశామని తెలిపారు.వేములవాడ పట్టణం చేనేత క్లస్టర్గా మారిందని, నేతన్నలు ఎదురుచూసిన యారన్ డిపోను మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం 90 శాతం సబ్సిడీపై యారన్ పంపిణీ జరుగుతో oదని వివరించారు. రాజన్న ఆలయ అభివృద్ధి, ప్రధాన రోడ్ల వెడల్పు, గుడి చెరువు రక్షణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నా మన్నారు.గతంలో సీఎం, ఎనిమిది మంది మంత్రుల సమక్షంలో వేములవాడకు రూ.1000 కోట్ల అభివృద్ధి ప్యాకేజీకు శంకుస్థాపన జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రజల సూచనలు, సలహాలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నామని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని ప్రజల ను కోరారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మ న్ రోండి రాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంద్ర గిరి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎక్కడ చట్ట పరిధి దాట లేదు

### ఆరోపణలు అన్ని అవాస్తవం

### సెస్ చైర్మన్ చిక్కాల రామారావు




**రాజన్న సిరిసిల్ల, జులై 2 ( మనం ప్రతినిధి):** సెస్ చైర్మన్ చిక్కాల రామారావు సెస్ ఆఫీస్ లో జరిగిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతు నాపై కొన్ని పత్రికల్లో వచ్చిన ఆరోపణలు అవాస్తవం అని ఖండించారు బ్లాక్ లిస్ట్ లో వున్నా కాంట్రాక్టర్ కి కోట్లు కోళ్లగొట్టే వ్యూహంకి సంబంధించి బ్లాక్ లిస్ట్ కాలపరిమితి ముగియడంతో ఈ టెండర్ లో మళ్ళీ అప్లై చేసుకున్నారని వివరణ ఇచ్చారు చైర్మన్ గారికి లక్ష సంబంధించి ప్రభుత్వ జీవో ప్రకారం తీసుకున్నానని ఎక్కడ ఒక్క రూపాయి అదనంగా తీసుకోలేదన్నారు టోల్ టాక్స్ కి సంబంధించి ఎక్కడ దుర్వినియోగం చేయలేదని ఫస్టాగ్ ద్వారా మాత్రమీ టోల్ చెల్లిపులు చేశామని తెలిపారు ఆఫీస్ పని నిమిత్తం హైదరాబాద్ సెక్రటేరియట్ వివిధ ప్రభుత్వ ఆఫీస్ ల కు వెళ్లి సందర్భం లో ప్రోటోకాల్ ప్రభుత్వ వాహనం ను వాడానని చెప్పారు రిటైర్ ఉద్యోగులకు చట్ట ప్రకారమే మెడికల్ బిల్లు ల నిలిపివేయడం జరిగిందన్నారు ఈ పి ఫ్ స్కీం లో ఉంది రిటైర్ అయినా ఉద్యోగులకి మెడికల్ రియింబర్స్ బిల్లులు చెల్లించడం లేదన్నారు జి పి ఫ్ స్కీం లోఉన్న ఉద్యోగులకు వారి ఫండింగ్ నుంచే మెడికల్ బిల్లు ల చెల్లెస్తున్నామని ఇట్టి విషయం లో రిటైర్డ్ ఉద్యోగుల ఆరోపణలు అవాస్తవం అని అన్నారు ట్రాన్స్ఫార్మర్ కు సంబంధించి సగటున 16 ట్రాన్స్ఫర్మర్లు ప్రతి సంవత్సరం కాలిపోతున్నాయి దీనివల్ల రైతులకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుంది మా సంస్థ కు ప్రతి సంవత్సరం నాలుగు కోట్లు రిపేరింగ్ ఖర్చులు అవుతున్నాయి తెలంగాణ నియంత్రణ మండలి ఆదేశాల ప్రకారం ట్రాన్స్ఫర్ ఫెయిల్యూర్ తగ్గించి రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా కోసం 15 సంవత్సరాల పైబడిన అధిక లోడ్ తగ్గించారు కొత్త డీటీఆర్ లను కొనుగోలు చేసి వ్యవసాయదారులకు విద్యుత్ సరఫరా చేస్తున్నాము కొత్త డిటిఆర్ల ద్వారా సంస్థకు మెయింటెనెన్స్ ఖర్చులు మిగులుతున్నాయి అలాగే సీసీ కెమెరాలు అమర్చడం వల్ల సిబ్బందిలో క్రమశిక్షణ సమయపాలన పెంపొందించగలిగాము తద్వారా వినియోగదారులకు సమర్థవంతమైన సేవలు అందించగలుగుతున్నాము అయినప్పటికీ ఇంకా కొంతమంది ఉద్యోగులు తమ ప్రవర్తన మార్చుకోవడం లేదు . ఈ సందర్భంగా వారికి చివరి అవకాశం ఇస్తున్నాము అలాగే మా పాలకవర్గం ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి ఇప్పటివరకు నెలవారీ విద్యు త్ అమ్మకం ద్వారా 14 75 కోట్ల ప్రస్తుతము దాని విలువ 22 కోట్లకు పెరిగింది అంటే సంస్థ నష్టాలను ఎనిమిది కోట్లకు తగ్గించాము విద్యుత్ బకాయిల విషయంలో సంబంధిత గౌరవ తెలంగాణ పెద్దల ఆదేశాల మేరకు ప్రభుత్వం వినియోగదారులకు అవకాశం ఇవ్వడం జరిగింది ఎస్ఎస్ఐ యూనిట్లు వినియోగదారులు వారి వారి బకాయిలను సకాలంలో చెల్లించి సంస్థ పురోభివృద్ధికి సహకరించాలని కోరారు.

## కాళేశ్వరం జోన్ స్థాయి తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ మీట్

- పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా




**మంచిర్యాల,జూలై 2( మనం న్యూస్):** పోలీసు వృత్తిలో మరింత నైపుణ్యం, సామర్థ్యం, ప్రతిభ పెంపొందించుకునేందుకు 'పోలీసు డ్యూటీ మీట్' నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్ జూలై నెలలో వరంగల్ లో నిర్వహించడం జరుగుతుందని, దానిలో భాగంగా డిజిపి ఆదేశాల మేరకు కాళేశ్వరం జోన్ పరిధిలోని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి మంచిర్యాల్ జోన్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లా పరిధిలో ఉన్న పోలీస్ అధికారులకు , సిబ్బందికి రామగుండం పోలీస్ కమిష నరేట్ లో కాళేశ్వరం జోన్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించడం జరిగింద న్నారు .రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై పోలీస్ డ్యూటీ మీట్ ను ప్రారంభించారు . ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ, విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేర దర్యాప్తులో మరింత శాస్త్రీయత సాధించే దిశగా అవ గాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో నేర విచారణకు ఎదురయ్యే అంశాలకు సంబంధించి విధులపై ప్రదర్శన చేయడం ద్వారా మెలకువలు నేర్చుకునే అవకాశం ఉంటుంద న్నారు. తెలంగాణ రాష్ట్ర రెండవ తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ నిర్వహించడం జరుగు తుందని ఈరోజు కాళేశ్వరం జోన్ పరిధిలోని అధికారులకు, సిబ్బందికి 1. సైంటిఫిక్ అయిడ్స్ టూ ఇన్వెస్టిగేషన్ ఈవెంట్ లో ఫొరెన్సిక్ సైన్స్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, క్రిమినల్ లా, వ్రాత పరీక్ష, మెడికో లీగల్ టెస్ట్ ఓరల్ టెస్ట్ లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఆఫ్ ఎక్స్ బిట్స్ ప్రాక్టికల్ టెస్ట్, ఫింగర్ ప్రింట్ సైన్స్ ప్రాక్టికల్ అండ్ ఓరల్ టెస్ట్, క్రైమ్ సీన్ ఫోటోగ్రఫీ ప్రాక్టికల్, పోలీస్ పోర్ట్రైట్ ప్రాక్టికల్ అండ్ రిటన్ టెస్ట్, అబ్జర్వేషన్ టెస్ట్ ప్రాక్టికల్ అండ్ రిటన్ టెస్ట్ 2.యాంటి సబాటేజ్ చెక్ ఈవెంట్ లో వెహికల్ సెర్చ్, గ్రౌండ్ సర్చ్, రూమ్ సెర్చ్, యాక్సిస్ కంట్రోల్, 3. కంప్యూటర్ అవేర్నెస్ కాంపిటీషన్ ఈవెంట్ లో కంప్యూటర్ అవేర్నెస్ ఆఫీస్ ఆటోమేషన్, ప్రోగ్రామింగ్ ఎబిలిటీ, 4. డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్ ఈవెంట్ లో ట్రాకింగ్, ఎక్స్ప్లోజివ్ , నార్కోటిక్స్, సెర్చ్ , పోలీస్ ఫోటోగ్రఫీ కాంపిటీషన్, పోలీస్ వీడియోగ్రఫీ కాంపిటీషన్ ఈవెంట్స్ నిర్వహించడం జరుగుతుందన్నారు . ఇందులో ప్రతిభ కనబరిచిన వారు ఈ నెలలో వరంగల్ లో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ కి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్, ఫింగర్ ప్రింట్ ఇన్వెస్టిగేషన్ కోసం సాంకేతిక పరిజ్ఞానం, కేసుల దర్యాప్తులో మెళకువలు నేర్చుకునేందుకు అదేవిధంగా పోలీసు నైపుణ్యాలను ప్రదర్శించడానికి, సంక్లిష్టమైన కేసులు పరిష్కరించడానికి, ఆలోచనలను మార్పిడి పోలీసుల చేసుకోవడానికి, వృత్తిపరమైన పనితీరు యొక్క సామర్థ్యం మరియు మెరుగుదలకు పోలీస్ డ్యూటీ మీట్ దోహదపడుతుందన్నారు. ప్రతిభ చూపిన వారికి రాష్ట్రా, జాతీయ స్థాయిలో జరిగే పోలీస్ డ్యూటీ మీట్ కు వివిధ ప్రాంతాల నుంఛి పోలీసు అధికారుల మధ్య మరింత సహకారం, ప్రోత్సాహం లభిస్తుందని, పోలీస్ డ్యూటీ మీట్లో పాల్గొనే వారందరూ తమ అత్యుత్తమ ప్రదర్శనను అందించాలని ఇక్కడ ఎంపికై కాళేశ్వరం జోన్ తరపున, రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించి రామగుండం కమిషనరేట్ కు, కాళేశ్వరం జోన్ కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, గోదావరిఖని ఏసిపి రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ ఏ ఆర్ ఏసీపీలు ప్రతాప్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ బాబురావు, సిసిఆర్ బి ఇన్స్పెక్టర్ సతీష్, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, ఆర్ ఐ లు దామోదర్, వామనమూర్తి, మల్లేశం, శ్రీనివాస్ లు, కమీషనరేట్ పరిధి, కొమురంభీమ్ ఆసిఫాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లా ల పోలీసు అధికారులు, సిబ్బంది, బీడి టీం, డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిగాచి పరిశ్రమలో కొనసాగుతున్న రిస్క్యూ ఆపరేషన్, సహాయక చర్యలు

- జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య





**సంగారెడ్డి, జూలై 2 (మనం ప్రతినిధి) :** ఇస్నాపూర్ మండలం పాశం మైలారంలోని సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరిగినప్పటి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ కు చేరుకొని సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఘటనా స్థలాన్ని వారు తరచూ సందర్శించి సహాయక బృందాలకు మార్గదర్శనం చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఐల కార్యాలయంలో ప్రత్యేక సహాయక కేంద్రం ఏర్పాటు చేసామన్నారు. వారి కుటుంబ సభ్యులకు భోజనం, తాత్కాలిక నివాసం, రవాణా వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. బాధిత కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. బాధితులు వారి వారి స్వగ్రామాలకు వెళ్లేందుకు అవసరమైన రవాణా ఏర్పాట్లు చేసామన్నారు. ఒడిశా, బీహార్ రాష్ట్రాల అధికారులు కూడా సహాయక చర్యలు అందిస్తున్నారు . సిగాచి ఫార్మా పరిశ్రమ ప్రమాద తాజా పరిస్థితులను కలెక్టర్ వివరించారు. సిగాచి పరిశ్రమ అధికారికంగా అందిన వివరాల ప్రకారం వివరాలు ఈ విధంగా అందించారు.మొత్తం 143 మంది ఉద్యోగులు వివరాలు అందించారు.సురక్షితంగా ఉన్నవారు 60,గాయపడి చికిత్స పొందుతున్నవారు 35,గుర్తించబడిన మృతుల సంఖ్య 18, గుర్తించలేని మృతదేహాలు 20 , గల్లంతైనవారు 10, మంది ఉన్నారు. కుటుంబాలకు అప్పగించిన మృతదేహాలు 18, ప్రయోగశాలలో డీఎన్ఏ ఫలితాల కోసం పెండింగ్లో 18 నమూనాలు ఉనాయి. ఇంకా సేకరించాల్సిన మృతదేహాల నమూనాలు 2, పరీక్షించాల్సిన కుటుంబ సభ్యుల రక్త నమూనాలు 25, ఇంకా 5 కుటుంబాల నుండి సేకరించాల్సి ఉంది.గుర్తించలేని కుటుంబాల సంఖ్య 3, డీఎన్ఏ ద్వారా మ్యాచ్ అయిన నమూనాలు 5,పూర్తయిన పోస్టుమార్టం 36 మృతుల కుటుంబాలకు రూ.1,00,000 చొప్పున మంజూరు, చేసిన కుటుంబాల సంఖ్య: 18, గాయపడిన వారికి రూ.50,000 చొప్పున మంజూరైనవారు 34, తాత్కాలిక ఆర్థిక సహాయంకింద 18 మృతుల కుటుంబాలకు రూ.1,00,000 చొప్పున,గాయపడిన 34 మంది కి రూ.50,000 చొప్పున చెల్లించిన తాత్కాలిక సహాయం, మిస్సింగ్ అయిన 10 కార్మికుల కుటుంబాలకు రూ.10,000 చొప్పున తాత్కాలిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. బాధిత కుటుంబాలు లేదా వారి బంధువులు సమాచారం కోసం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్లైన్ నంబర్ 08455-276155 ను సంప్రదించాలన్నారు. ఈ హెల్ప్డెస్క్ ద్వారా వారి అవసరాలపై సత్వర స్పందించడానికి సిబ్బంది కార్యాలయ పని వేళల్లో అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు.




# విద్యార్థి దశ ఎంతో కీలకం

- చట్టాల పై అవగాహన కలిగి ఉండాలి
- హుస్నాబాద్ ఏసీపీ సౌదారపు సదానందం

**కోహెడ,జూలై 2,(మనం న్యూస్) :** విద్యార్థి దశ ఎంతో కీలకమని, చెడు అలవాట్లకు గురి కావద్దని హుస్నాబాద్ ఏసీపీ సౌదారపు సదానందం అన్నారు. మండలంలోని నాగసముద్రాల తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాలు, ఈవిటీజింగ్, నూతన చట్టాల పై అవగాహన కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హుస్నాబాద్ ఏసీపీ సదానందం హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరికి విద్యార్థి దశ ఎంతో విలువైందన్నారు. గొప్ప లక్ష్యంతో కష్టపడి చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. ఈ విద్యార్థి దశలో చెడు అలవాట్లకు గురైతే భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి అన్నారు. తల్లిదండ్రులను, విద్య నేర్పిన గురువులను జీవితంలో ఎప్పుడూ మర్చిపోవద్దు అన్నారు. డ్రగ్స్ వాడుతున్నట్లు గుర్తిస్తే, ర్యాగింగ్ జరిగిన వెంటనే డయల్ 100 కు, సిద్దిపేట షీ టీమ్ నెంబర్ 8712667434 కాల్ చేసి సమాచారం అందించాలని అన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోహెడ ఎస్.ఐ.పుల్ల అభిలాష్, ప్రిన్సిపల్ నరసింహులు, వైస్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, అధ్యాపకులు, హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య, హెడ్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుల్ స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుళ్లు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన పూర్తి చేయాలి

- అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్





**తొగుట, జులై 2(మనం న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. బుధవారం అడిషనల్ కలెక్టర్ తొగుట మండలంలో మండల ప్రత్యేక అధికారి దుబ్బాక ఏడీఏ కే.మల్లయ్య, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మార్వో శ్రీకాంత్, హౌసింగ్ పిడి లతో కలిసి తొగుట మండలంలో పర్యటించి మొదటగా ఎల్లారెడ్డి పేట గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఇండ్లను పరిశీలించారు. ఇండ్లు మంజూరు అయి ఇప్పటివరకు నిర్మాణం మొదలు పెట్టని వారు త్వరగా ప్రారంభించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లకు అవసమైన ఇసుకను కూడవెల్లి వాగు నుండి తెచ్చుకొనేలా చూడాలని అధికారులకు సూచించారు. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇటుక, కాంక్రీట్, స్టీల్ ను షాపు యజమానులతో మాట్లాడి ఇందిరమ్మ లబ్ధిదారులకు కొంత మేర తక్కువ ధరను నిర్ణయించాలని కోరతామని తెలిపారు. లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించాలని కోరారు. అనంతరం తొగుట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ఆరోగ్య కేంద్రంలో రికార్డును పరిశీలించారు. ఆస్పత్రిలోని ల్యాబ్, ఫార్మసీ, ఓపి రికార్డులను పరిశీలించి, ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకోన్నారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు పెరిగేలా చూడాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాధాకిషన్, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో గల కస్తూర్బా పాఠశాలను అడిషనల్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ సందర్శించి పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడిన అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చదువులో బాగా రాణించి ఆర్థిక స్వాతంత్రం సాధించే దిశగా ఆలోచించాలని, చదువు పట్ల శ్రద్ధ వహించి చిన్నతనం నుండే ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని ముందుకు వెళ్లాలని, పదవ తరగతి విద్యార్థులు భాగా కష్టపడి చదివి మంచి ఫలితాలు తీసుకొని రావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి వైద్యాధికారి డాక్టర్ నారాయణ, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రేవతి, స్థానిక మండల వైద్యాధికారి డాక్టర్ రాధాకిషన్, మండల విద్యాధికారి ఏ.నర్సయ్య, కస్తూరిబా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ జి.భాగ్యలక్ష్మి, ఆర్.ఐ అశోక్ రాజు, హౌసింగ్ ఏఈ, మాజీ ఎంపిపి, ఇన్చార్జి ఎంపీడీఓ, ఐకెపి ఏపిఎం, ఘంటా రేణుకా రవీందర్, మాజీ సర్పంచ్ అనిత నర్సింలు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేవనూరు పోచయ్య, ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ఇందిర ఇండ్ల లబ్ధిదారులు, ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ ప్రాంతాన్ని కరీంనగర్ జిల్లాలో కలపాలి

- మంత్రి పొన్నం స్పందించకుంటే ఉద్యమానికి శ్రీకారం
- మీరిచ్చిన హామీలు నెరవేర్చండి
- బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం



**కోహెడ,జూలై 2,(మనం న్యూస్) :** హుస్నాబాద్ ప్రాంతాన్ని కరీంనగర్ జిల్లాలో కలపాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు జాలిగం రమేష్ అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తలచుకొంటే రాత్రికి రాత్రే హుస్నాబాద్ ప్రాంతాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో కలిపేందుకు జి.ఓ.తీసుకురావచ్చు అన్నారు.

నాడు హుస్నాబాద్ ప్రాంతాన్ని కరీంనగర్ జిల్లాలో ఉండాలని ఆందోళనలో పాల్గొన్న మంత్రి పొన్నం అధికారంలోకి వచ్చి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రిగా ఉన్నప్పటికీ ఈ విషయాన్ని ఎందుకు మరిచిపోతున్నారు అర్థం కావడం లేదన్నారు. హుస్నాబాద్ ప్రాంత వాసులు ఉమ్మడి జిల్లాలో జరిగే పనులు కొన్నింటికి సంగారెడ్డి మరికొన్నింటికి కరీంనగర్ జిల్లాకు పోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.

సిద్దిపేట జిల్లాలో ఏ ప్రభుత్వ కార్యాలయానికి పోయిన మమ్మల్ని ద్వితీయ శ్రేణి పౌరులుగా వెలకట్టే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి జిల్లాలోని మండలాలు, గ్రామాల భౌగోళిక సరిహద్దులు పంపించే లోపుగానే కరీంనగర్ జిల్లాలో హుస్నాబాద్ ప్రాంతాన్ని కలిపితేనే కరీంనగర్ గడ్డ ఈ ప్రాంతానికి దక్కుతుందన్నారు. లేదంటే హుస్నాబాద్ ప్రాంతం శాశ్వతంగా కరీంనగర్ దూరం అయ్యే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల వెంటనే కరీంనగర్ జిల్లాలో కలిపేందుకు మంత్రి పొన్నం చొరవ తీసుకోవాలని కోరారు. హుస్నాబాద్ ప్రాంతానికి పీసీసీ చీఫ్ గా వచ్చిన సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు పరిచేందుకు కృషి చేయాలనీ డిమాండ్ చేశారు. లేని యెడల బిజెపి మండల శాఖ నేతృత్వంలో మరోసారి ఉద్యమానికి కార్యాచరణ తీసుకొని శ్రీకారం చుడతామని హెచ్చరించారు. పిల్లి నర్సయ్య గౌడ్, మ్యాకల చంద్రశేఖర్ రెడ్డి, గుగ్గిళ్ల శ్రీనివాస్, బండ జగన్ యాదవ్, బొమ్మగాని శివ కుమార్ గౌడ్, రామంచ రాంచంద్రారెడ్డి, పెర్యాల సాగర్ రావు, ఎడమల రాజిరెడ్డి, చిగురు సంజీవరెడ్డి, జాలిగం అనిల్, ఉల్లెంగుల సాయి కిషోర్, ఎడ్ల వెంకటేష్, టి. రవి, తదితరులున్నారు.

# కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో ముద్రించాలి

- ప్రధానికి లక్ష పోస్ట్ కార్డులు పంపిస్తాం
- డా జేరిపోతుల పరశురామ్




**కొమురవెల్లి, జూలై 2 (మనం న్యూస్) :** ఆర్బీఐ భారత స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫోటో కరెన్సీపై ముద్రించాలని అంబేద్కర్ సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ అన్నారు. దేశవ్యాప్త లక్ష పోస్ట్ కార్డ్ ఉద్యమాన్ని ఈనెల 23న ఉస్మానియా యూనివర్సిటి ఆరట్స్ కళాశాల నుండి ప్రారంభమై బుధవారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో డా బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుంది. దళిత బహుజన సంఘాల నాయకులు స్వాగతం పలికి అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో ముద్రించాలని కోరారు. అనంతరం సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ మాట్లాడుతూ 1921లో ఇంపిరియల్ బ్యాంకు కుప్పకూలినప్పుడు డా. బి.ఆర్. అంబేద్కర్ రూపాయి, దాని సమస్య పరిష్కార మార్గం అనే పుస్తకాన్ని వ్రాసి హిల్టాన్ యాంగ్ కమిషన్, రాయల్ కమిషన్,సైమన్ కమిషన్ బ్రిటిష్ ప్రభుత్వానికి ఇవ్వడం వల్ల ఇది వాస్తవం అని గ్రహించి 1935 ఏప్రిల్ 1 రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా ఏర్పడ్డది అంటే నాడు అంబేద్కర్ లేకుంటే నేడు ఆర్బీఐ లేదు అని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 500 మందితో పోస్ట్ కారడ్స్ పోస్ట్ బస్సులో వెయ్యడం జరిగిందన్నారు. జాతీయ జెండా రూపకల్పన కమిటీ ఏర్పడ్డరోజు జాతీయ జెండాలో అశోక చక్రం పెట్టిన రోజు జూన్ 23 నుండి 26 జనవరి 2026 వరకు దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి లక్ష మందితో పోస్ట్ కార్డ్ ఉద్యమం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కవి గాయకులు పిస్నింటి రత్నం బిఆర్ యస్ వి రాష్ట్ర నాయకులు ఎర్రుల మహేష్ మాజీ యం పి టి సి లింగంపల్లి కనుకరాజు ఎమ్మార్పిస్ రాష్ట్ర నాయకులు గడిపే బాలనర్సయ్య మాదిగ దర్శనం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# పప్పు దినుసుల పంటలు అధికంగా సాగు చేయాలి




**మహబూబ్ నగర్, జులై 2(మనం బ్యూరో) :** రైతులు పప్పు దినుసుల పంటలు అధికంగా సాగు చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఏ.డి.లు, మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో జాతీయ ఆహార భద్రత పథకం సహకారంతో అంధించిన కంది పంట విత్తనాల మినికిట్స్ ను రైతులకు జిల్లా కలెక్టర్ ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ అదికారి బి.వెంకటేష్ మాట్లాడుతూ పప్పు దినుసుల పంటలు అధికంగా సాగుచేయాలని, విస్తీర్ణం పెంచుట వలన గిట్టుబాటు ధర లభిస్తుందని అన్నారు. ప్రతి రైతు మార్కెట్లో పంటలు విక్రయించి అధిక లాభాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమౌలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, ఎన్ ఎఫ్ ఎస్ ఎం డీసీ, ఏఈఓ లు, పాల్గొన్నారు.

# రజకులను ఎస్సీలలో చేర్చాలి

**సిద్దిపేట అర్బన్, జూలై 02, మనం న్యూస్:** చాకలి కమ్యూనిటీని ఎస్సీ జాబితాలో చేరుస్తామని అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపాలని రాష్ట్ర చాకలి ఎస్సీ సాధన సమితి సిద్దిపేట జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి ఎ.మల్లేశం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ వర్గం అనేక శతాబ్దాలుగా అన్యాయానికి గురైందని, రాజకీయంగా నిర్లక్ష్యం చేయబడిందన్నారు. అధికారంలో ఉన్న వారు ఈ వర్గాన్ని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే భావించారన్నారు. ఫలితంగా తమ సమాజం తీవ్రమైన దారిద్ర్యం, అక్షరాస్యత లేని స్థితి,



నిరుద్యోగం వంటి సమస్యలలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో తమ జనాభా 26 లక్షల పైగా ఉన్నప్పటికీ, తగిన ప్రాతినిధ్యం లభించలేదన్నారు. రజక సామాజిక వర్గం దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలలో ఎస్సీ వర్గంగా గుర్తింపు పొందిందని, ఇతర రాష్ట్రాల్లో లభించిన విధంగా తమకు ఎస్సీ గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర చాకలి ఎస్సీ సాధన సమితి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్,జిల్లా కార్యదర్శి కనకరాజు, సిద్దిపేట పట్టణ అధ్యక్షులు లింగస్వామి, ఉపాధ్యక్షులు శ్యామ్, సహాయక కార్యదర్శులు నరేష్,రమేష్, డైరెక్టర్లు చంద్రం,అశోక్, కార్యవర్గ సభ్యులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఖర్గే సభను విజయవంతం చేయాలి

- ప్రతి కాంగ్రెస్ కార్యకర్త తరలిరావాలి
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అసదుద్దీన్




**సిద్దిపేట, జూలై 2(మనం ప్రతినిధి) :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించే ఖర్గే సభకు సిద్దిపేట నియోజవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అసదుద్దీన్, సిద్దిపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో కార్యకర్తల, నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి అసదుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటలకు సభ ప్రారంభం అవుతుందని, కావున సిద్దిపేట నియోజవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్యాంపు కార్యాలయం నుంచి భారీ ఎత్తున వాహనాల్లో హైదరాబాద్ ఎల్బీ స్టేడియానికి తరలుదామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంక్షేమ పథకాలను గడప గడపకు వివరించాలని, సమయం తక్కువగా ఉన్నందున స్వచ్ఛందంగా ప్రజలు తరలి వచ్చేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మల యాదగిరి, ముద్దం లక్ష్మి, రియాజుద్దీన్, కలిముద్దీన్, ఆనంద్, కా, హర్షద్ వహీద్ ఖాన్, సాయి, ప్రతాప్ గోపికృష్ణ తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాన్గల్ లో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ



**తొగుట, జులై 2(మనం న్యూస్) :** ఇండ్లు లేని పేదలకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లకు తొగుట మండలం కాన్గల్ గ్రామంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులతో కలిసి బుదవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను ప్రతి లబ్ధిదారుడు నిర్మించుకొని సొంతింటి కలను నేరవేర్చుకోవాలని, నిరుపేదల పక్షాన కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా ప్రయోజన కార్యక్రమాలు బాగున్నాయని కొనియాడారు.

ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్న కాంగ్రెస్ పార్టీకి, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఇందిరమ్మ కమిటీ సభ్యులు పిట్ల సత్తయ్య, స్వామి యాదవ్, భూపాల్ రెడ్డి, మాదారం లక్ష్మి, బత్తుల బాల్ లక్ష్మి , ఆత్మా కమిటీ డైరెక్టర్ బ్రహ్మానందరెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బషీరొద్దీన్, గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, కారోబార్ మహేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యంచారి, బిక్షపతి, కనకయ్య, కొండల్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే వినియోగంలోకి డి.ఆర్.సి.సి. సెంటర్

- మున్సిపల్ కమీషనర్ రమేష్ కుమార్



**దుబ్బాక, జూలై 02, మనం న్యూస్ :** దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని డంపు యార్డ్, డీఆర్సీసీ సెంటర్ అతి త్వరలో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ కే.రమేష్ కుమార్ తెలిపారు. బుధవారం డంపు యార్డు, డిఆర్సిసి సెంటర్ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డంపు యార్డులోని తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ చేసేందుకు, వాటి నుంచి ఎరువుల తయారీకి రెండు రోజుల్లో ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులను నియమించనున్నట్లు తెలిపారు. దానితోపాటు మరో వారం రోజుల్లో డీఆర్సీసీ సెంటర్లో విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసి, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియను చేపడతామన్నారు. డంప్ యార్డ్ కేంద్రంలోకి అపరిచితులు, చెత్త ఏరుకునేవారు రాకుండా దాని చుట్టూ మెష్ కేజ్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేసి, చెత్త సేకరణ వాహనాల్లో మాత్రమే వేయాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని కోరారు. అనంతరం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో ఏఈగా పనిచేస్తూ, బదిలీపై వెళ్తున్న శ్రీకాంత్ కు శాలువా కప్పి వీడ్కోలు పలికారు. నూతన ఏఈగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనాథ్ కు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, సీనియర్ అకౌంటెంట్ అనిల్ రెడ్డి, సిబ్బంది శ్రీకాంత్, మధుసూదన్, కల్పన మేఘమాల, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# 42 శాతం బిసి రిజర్వేషన్ బిల్లు మంజూరుకు 17న రైల్ రోకో

- ఎంఎల్సీ కల్వకుంట్ల కవిత

ఖమ్మం, జూలై 2(మనం బ్యూరో): 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు మంజూరుకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 17న రాష్ట్రవ్యాప్తంగా రైల్ రోకో కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. వైరా మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ కుటుంబాన్ని పరామర్శించడానికి బుధవారం ఆమె ఖమ్మం నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మీడియాతో మాట్లాడుతూ మదన్ లాల్ మరణం బిఆర్ఎస్ పార్టీకి, జిల్లాకు తీరని లోటని అన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని, రైతులకు రైతు భరోసా ఇచ్చామని ప్రభుత్వం చెప్పుకుంటోందని



కొంతమంది మాత్రం అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామా ఆడిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ ఇస్తామని అనేక సభల్లో హామీ ఇచ్చారు. 42% బి సి రిజర్వేషన్ నమోదు అయిన తర్వాత మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 17 న రైలు రోకో పిలుపునిచ్చినట్లు తెలిపారు. బిసి రిజర్వేషన్‌పై కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత నూతనంగా నూతనంగా ఎన్నిక కాబడిన బిజెపి అధ్యక్షుడిదేనన్నారు. వైరా నియోజకవర్గ బిఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారు. బనకచర్ల నీళ్ల విషయంలో జిల్లా ముగ్గురు మంత్రులు మాట్లాడాలి. ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ఆలోచించండి అక్రమ కేసుల గురించి కాదు హితవు పలికారు. ఖమ్మం జిల్లా అంటేనే ఉద్యమాల ఖిల్లా. ఈ నెలల 17న జరిగే రైల్ రోకోలో ఖమ్మం జిల్లా ప్రజలు అత్యధిక మంది పాల్గొని, మద్దతు ఇవ్వాలని కోరారు. 17 తారీకు జరిగే రైలు రోకోలో ప్రతి బీసీ బిడ్డ పాల్గొనాలని పిలుపునిచ్చారు.



# మహిళా పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

ఖమ్మం, జూలై 2(మనం న్యూస్): పోలీసు స్టేషన్ ఆశ్రయించే మహిళల ఫిర్యాదుల పట్ల తక్షణమే చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. బుధవారం మహిళా పోలీస్ స్టేషన్ను పోలీస్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ, పెండింగ్లో ఉన్న కేసులు, దర్యాప్తు, చార్జిషిట్ రికార్డులు, సీడీ ఫైళ్లను పరిశీలించి అధికారులు పలు సూచనలు చేశారు. ఆనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ..మహిళల భద్రతకు మరింత ప్రాధాన్యత కల్పించాలని, వారు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వారి రక్షణకై చర్యలు చేపట్టాలని అన్నారు. మహిళల సమస్య పరిష్కారంలో భాగంగా మహిళా పోలీసు స్టేషన్ ఆశ్రయించే మహిళలు, వారు చేసే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు స్టేషన్లకు వచ్చే మహిళలతో మర్యాదగా మాట్లాడాలని, వారు చెప్పే విషయాలను శ్రద్ధగా వినాలని, ఫిర్యాదులవట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా విధిగా కళాశాలలు, పాఠశాలలను, మహిళలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను మహిళా పోలీసు సిబ్బంది సందర్శించి, వారికి రక్షణగా నిలిచే చట్టాలు పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఆపద సమయంలో పోలీసుల సహాయం పొందే విధానం పట్ల అవగాహన కల్పించాలని అన్నారు.



# బస్టాండ్లో పెట్రోల్ బంక్ నిర్మాణం

- ఆపకపోతే ప్రజా ఉద్యమం చేపడతాం
- దమ్మపేట మండల టీడీపీ నాయకులు

దమ్మపేట, జూలై 2(మనం న్యూస్): దమ్మపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చేపడుతున్న పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని దమ్మపేట మండల టీడీపీ అధ్యక్షులు ఎండి వలి పాషా, సొసైటి వైస్ చైర్మన్ కట్టం ఎర్రప్ప తెలుగు రైతు అధ్యక్షులు గడ్డిపాటి సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. బస్టాండ్ ప్రాంతాన్ని కేవలం బస్సుల రాకపోకల కోసమే ఉపయోగించాలని, ఆ ప్రదేశంలో పెట్రోల్ బంక్ నిర్మాణం అనవసరమని టిడిపి నేతలు స్పష్టం చేశారు. ఈ బస్టాండ్ నిర్మాణం ప్రజా రవాణా సౌకర్యార్థమే ఉపయోగించాలని, అదే ప్రాంతంలో పెట్రోల్ బంక్ నిర్మిస్తే బస్టాండ్ ఉద్దేశం నిర్వర్థకమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్ బంక్ కోసం ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని, ప్రజల ప్రయాణ సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని తగిన నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు, త్వరితగతిన అధికారులు చర్యలు తీసుకుని బస్టాండ్లో అక్రమంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకు నిర్మాణం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎడతెరిపి లేకుండా కురుస్తున్న

- వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 2 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎడతెరిపి లేకుండా విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా నదులు, వాగులు, చెరువులు పొంగిపొర్లే అవకాశం ఉంది. రోడ్లపైకి నీరు చేరే పరిస్థితులు ఏర్పడవచ్చు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, బయటకు రావాల్సి వస్తే అప్రమత్తంగా ఉండాలని, అదేవిధంగా అధికారులు మరియు సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. సెల్ఫీలు తీసుకోవడానికి పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లి ప్రమాదాలకు లోనుకావద్దని ఆయన సూచించారు. విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రజలు తక్షణమే జిల్లా కలెక్టరేట్లో, లేదా ఆర్డీవో కార్యాలయాల్లో , ఏర్పాటు చేసిన హెల్ప్లైన్



నంబర్లకు, లేదా తమ మండల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు కాల్ చేసి సమాచారం అందించి సహాయం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు మరియు అన్ని మండల అధికారులు అప్రమత్తంగా ఉండి, వర్షాల కారణంగా ఏర్పడే పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సందర్భంలో సంబంధిత రెవెన్యూ, పోలీసు, రోడ్లు, మున్సిపల్ మరియు పంచాయతీ శాఖలతో సమన్వయం చేసుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం పడుతున్న వర్షాల సందర్భంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండటాన్ని అలవాటుగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమయంలో వర్షాలకు తీసుకునే ముందు జాగ్రత్తలు, అప్రమత్తత చర్యలు రాబోయే గోదావరి వరదల సమయంలో కూడా ఉపయోగపడతాయని, ఎప్పుడైనా వచ్చే వరదలకు సకాలంలో స్పందించడానికి అధికారులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే విధంగా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించడానికి అధికారులు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వరదలకు సంభందించి విపత్కర పరిస్థితుల్లో కొత్తగూడెం కలెక్టరేట్ 08744 -241950 , కలెక్టర్ కార్యాలయ వాట్సాప్ 9392919747, భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం 08743 - 232444, భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయ వాట్సాప్ 9347910737 నెంబర్లను సంప్రదించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రజలకు సూచించారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి



- 50 మందికి రూ. 11.24లక్షల మేరకు లబ్ధి

ఖమ్మం, జూలై 2 (మనంప్రతినిధి): ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటళ్లలో అత్యవసర వైద్య చికిత్స పొందిన పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు తన సిఫారసుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి(సీ ఎంఆర్ ఎఫ్) చెక్కులను ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి బుధవారం గట్టయ్య సెంటర్ లో గల క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తో కలిసి పంపిణీ చేశారు. ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 50 మందికి రూ.11.24 లక్షల మేరకు లబ్ధి చేకూరింది. ఈ సందర్భంగా ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసానిస్తూ.. వేగంగా చెక్కులు మంజూరు చేస్తోందని చెప్పారు. అర్హులందరికీ లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. ఇప్పటివరకు తన సిఫారసుతో అర్హులైన 1100మంది పేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, పదుల సంఖ్యలో ఎల్ఓసీ పత్రాలు మంజూరైనట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో.. కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు
- అత్యవసరమైతే డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలు పొందండి
- ఎస్పీ రోహిత్ రాజు

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 2 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎడతెరిపి లేకుండా విస్తారంగా కురుస్తున్న వర్షాల వలన జిల్లాలోని నదులు,వాగులు,వంకలు,చెరువులు పొంగి ఉధృతంగా ప్రవహిస్తూ రోడ్లపైకి నీరు చేరే అవకాశం ఉన్నది.కావున కాలి నడకన మరియు వాహనాలతో



ప్రజలు రోడ్లు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. సెల్ఫీల కోసం ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రదేశాలకు వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దని తెలిపారు.జిల్లా పోలీసు యంత్రాంగం ఇతర శాఖలతో కలిసి ఇప్పటికే వర్షాల కారణంగా ప్రమాదకరంగా మారుతున్న రహదారులు మరియు చెరువులు, వాగులు, నదుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలియజేసారు.వరదల్లో చిక్కుకుని ఆపదలో ఉన్న వారిని రక్షించడానికి జిల్లా పోలీస్ శాఖ తరపున 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా డిడిఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచడం జరిగిందని తెలిపారు. ప్రజలు ఎవరైనా విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లయితే వెంటనే డయల్ 100 కి ఫోన్ చేసి సమాచారం అందించి పోలీసు వారి సేవలను పొందాలని కోరారు.ప్రమాదాలు వాటిల్లకుండా పోలీసు వారు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# దొంతుకుంట చెరువు స్వాహా...!

- చెరువును ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేపించిన ఘనులు ?
- ప్రైవేట్ బ్యాంకుల్లో కుంభక్కై లోన్లు మంజూరు !
- బఫర్ జోన్ పరిధిలో రిజిస్ట్రేషన్ ఎలా అంటూ విమర్శలు !?
- యదేచ్ఛగా చెరువుల్లో కన్వర్షన్ చేయించిన కేటుగాళ్లు



అశ్వారావుపేట, జూలై 2(మనం న్యూస్): తెలంగాణలో ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు కబ్జాలు అన్నట్లుగా ఉంది పరిస్థితి భూముల రేట్లు అమాంతం పెరగటంతో చెరువులను సైతం వదలకుండా యదేచ్ఛగా రిజిస్ట్రేషన్లు జరిపి ప్రైవేటు బ్యాంకుల్లో తాకట్టు పెట్టి లక్షల రూపాయల లోన్ మంజూరు చేయించుకొని దర్జాగా దండుకుంటున్నారు అంతేకాకుండా చెరువులోని బాఫర్ జోన్ ప్రదేశాన్ని సైతం కన్వర్షన్ చేయటం పలు విమర్శలకు దారి తీస్తుంది. ప్రస్తుతం ఓ ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి మరలా రిజిస్ట్రేషన్ జరిపించుకుంటున్నారంటూ పట్టణంలో భారీ స్థాయిలో ప్రచారాలు కొనసాగిస్తున్నారు ఇటువంటి చెరువుల పూర్తి విస్తరణ మరల తీసుకురావాలంటూ ప్రజలు సైతం మొరపెట్టుకున్న వినే నాథుడు కరువయ్యాడని తెలుస్తుంది అశ్వారావుపేట రెవెన్యూ పోలీస్ ఇరిటేషన్ వంటి శాఖలు కేవలం ధనికులకు తప్ప పేదోడికి న్యాయం జరిగే పరిస్థితి లేదని బడాబాబులు చెరువులను సైతం కబ్జాలు చేస్తుంటే స్పందించాల్సిన శాఖల సైతం మౌనంగా ఉండటం ఏమిటో అని ఇటువంటి మౌనానికి సమాధానం చెప్పవలసిన యంత్రాంగం ఎందుకు స్పందించటం లేదో తెలియదని ప్రజానీకం ప్రశ్నిస్తుంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణంలోని దొంతుకుంట చెరువు రోజు రోజుకు కబ్జాలకు గురికావడమే కాకుండా అంతరించే స్థాయికి చేరుకుందని దీని విస్తరణ 32 ఎకరాల భూమి కలిగి ఉండటంతో ఇప్పటికే బఫర్ జోన్ లో పదుల సంఖ్యలో భూమి కబ్జా గురి అయ్యి బహుళ అంతస్తులు సైతం నిర్మాణాలు కొనసాగించడం జరిగింది. అంతేకాకుండా ప్రవేట్ సెక్టార్ అయిన శ్రీరామ్ ప్రవేట్ ఫైనాన్స్ కంపెనీ నరసాపురం బ్రాంచ్ వారికి తాకట్టు పెట్టడంతో సిబ్బంది సైతం సంఘటన స్థలంలో నోటీసు బోర్డులను సైతం ఏర్పాటు చేయటం పట్టణంలో సంచలన సృష్టిస్తుంది.

## చెరువు మధ్య భాగంలో కన్వర్షన్లు !

తెలంగాణ రాష్ట్రం చెరువులను కాపాడేందుకు హైడ్రా వంటి శాఖలను ప్రవేశపెట్టి బహుళ అంతస్తులను సైతం నేలమట్ట చేస్తున్న చెరువులను ఆక్రమించుకునే విధానం కబ్జారాయుడు మానుకోవడం లేదని స్పష్టంగా కనిపిస్తుంది అశ్వారావుపేట పట్టణం సమీపంలో ఉన్న దొంతుగుంట చెరువు సర్వే నెంబర్ 1349 లో చెరువు విస్తరణ 32 .12 కుంటలు భూమి ఉన్నట్లు 1936 సంవత్సరం సర్వే చెబుతున్నప్పటికీ నేటికీ కబ్జాలు గురి అయ్యి 18 ఎకరాలు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు అధికారులు లెక్కలు తేలుతున్నాయి. ఇదిలా ఉండగా ఆంధ్ర జిల్లాకు చెందిన ఓ బడా బాబు 1134 నెంబర్ లో 1.39 కుంటల భూమిని 2018- 19 సంవత్సరం మధ్యలో తమ పేరు మీద రిజిస్ట్రేషన్ జరిపించుకొని అట్టి భూమిని శ్రీరామ్ గ్రూప్ నరసాపురం బ్రాంచ్ 60 లక్షల రూపాయలకు తాకట్టు పెట్టి రిజిస్ట్రేషన్ జరిపించినట్లు విశ్వసనీయ సమాచారం అంతేకాకుండా తాకట్టు పెట్టిన ప్రైవేట్ సెక్టార్ కు తిరిగి చెల్లించకపోవడంతో సదరు సిబ్బంది రిజిస్ట్రేషన్ జరిపించబడిన స్థలంలో స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్నామని నోటీసు బోర్డులు సైతం ఏర్పాటు చేయటం సంచలనం సృష్టిస్తుంది. అంతేకాకుండా చెరువు మధ్య భాగంలో కన్వర్షన్ సైతం చేయించినట్లు అక్రమార్కుడి తెలుపుతున్నారు.



## ఎమ్మెల్యే స్థాయి వ్యక్తికి రిజిస్ట్రేషన్ అంటూ ప్రచారం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సర్వే నెంబర్లు తేడాలు ఉండటంతో సబ్ రిజిస్ట్రార్లు సైతం భూములను అదేచగా రిజిస్ట్రేషన్ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు 1349 సర్వే నెంబరు ఉండ చెరువు మధ్య భాగంలో 13 34 నెంబరు ఎలా వచ్చిందో ఎవరికి అంతు పట్టని విషయంగా మారింది ఇటువంటి నెంబర్లు తేడా ఉండటంతో సబ్ రిజిస్ట్రార్ సైతం యదేచిగా రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు ఇటువంటి తేడా గల సర్వే నెంబర్ లపై కన్వర్షన్లు సైతం జరిపించి చెరువులో నిర్మాణాలు కొనసాగించేందుకు పంచాయతీ అనుమతులు సైతం తీసుకోవడం ఓ సంచలనమే ఏది ఏమైనా నియోజకవర్గానికి చెందిన ఓ ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి దొంతుకుంటా మధ్య భాగంలో 13 34 సర్వే నెంబర్ పై మరల రిజిస్ట్రేషన్ జరిపించుకునే కార్యక్రమానికి పనులు చక చకా జరుగుతున్నాయని ప్రజల్లో భారీ స్థాయిలో ప్రచారాలు కొనసాగుతున్నాయి సర్వే నెంబర్లు ఒకచోట భూములు మరోచోట ఉండటంతో ఇలాంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని అనుభవజ్ఞులు సైతం హెచ్చరిస్తున్నారు ఏది ఏమైనా భూములకు సంబంధించిన మ్యాపులు తెలంగాణలో ఏర్పడితే కానీ ఇటువంటి వాటికి చెక్ పెట్టే విధంగా ఉంటుందని లేకుంటే రాబోయే కాలంలో తెలంగాణలో చెరువులు కుంటలు కాలువలు సైతం మాయమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఇటువంటి వాటికి మంగళం పలికితేనే తప్ప భారీ ప్రమాదాలు పొంచి ఉంటాయని పట్టణం వాసులు అధికారులు తీరును తప్పుపడుతున్నారు.

# ప్రతి నాయకునికి క్రమశిక్షణ ఎంతో ముఖ్యం

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖర్గే పర్యటన విజయవంతం పై కాంగ్రెస్ శ్రేణులకు దిశా నిర్దేశం



ఖమ్మం, జూలై 2(మనం బ్యూరో): రాజకీయాల్లో ఉండాలనుకున్న ప్రతి నాయకునికి, ప్రతి కార్యకర్త కు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ అధ్యక్షతన పట్టణ,మండల,గ్రామ బూత్ స్థాయి అధ్యక్షులతో మల్లిఖార్జున ఖర్గే హైదరాబాద్ పర్యటన విజయవంతం పై దిశా నిర్దేశ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో పాటు పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామి రెడ్డి, ఖమ్మం జిల్లా ఇన్చార్జులు టిపిసిసి మాజీ అధ్యక్షులు డాక్టర్ శ్రవణ్ కుమార్ రెడ్డి, శ్రీ చక్కిలం రాజేశ్వర్ రావు, దైద రవీందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ..... ఏ స్థాయి నాయకుడైన ప్రజాభిమానం పొందాలంటే ముందుగా క్రమశిక్షణ అలవర్చుకోవాలని క్రమశిక్షణ లేకుండా ఏ వ్యవస్థలోనైనా రాణించడం కష్టమని తెలిపారు. జై భీం, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఈ నెల 4వ తేదీన హైదరాబాద్ రానున్నారని తెలియజేశారు.ఖమ్మం జిల్లా నుండి అన్ని నియోజక వర్గాల్లో పట్టణ స్థాయి నుండి బూత్ స్థాయి అధ్యక్షులు వరకూ ఒకరికి ఒకరు సమన్వయ పరచుకొని జిల్లా నుండి భారీగా తరలి ఖర్గే పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. రాజ్యాంగ ఆవశ్యకతను మారుమూల గ్రామాల్లోకి చేరవేయడమే లక్ష్యంగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ జై భీమ్, జై బాపు జై సంవిధాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. ఇందులో భాగంగానే పార్టీలో కొత్తగా కార్యవర్గ కమిటీలను కూడా నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా నుండి బస్సులను ఏర్పాటు చేస్తున్నామని అత్యధిక మంది కార్యకర్తలు హాజరయ్యే విధంగా డివిజన్ బూత్ స్థాయి అధ్యక్షులు కృషి చేయాలని తెలిపారు. అంతేకాకుండా నేడు రాష్ట్రంలో బీఆర్ఎస్ తన మనుగడను కాపాడుకునే ప్రయత్నం చేస్తుందని అందుకు కోసం కాంగ్రెస్ పై తప్పుడు ఆరోపణలు దిగిందని విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోలవరం బనకచర్ల ప్రాజెక్ట్ లపై బీర్ఎస్ చేసే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని సెంటిమెంట్ తో మరో మారు రాష్ట్రంలో అలజడి సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నేడు తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని అన్నారు. అనంతరం ఎంపీ రఘురామిరెడ్డి, టీపీసీసి మాజీ అధ్యక్షులు శ్రావణ్ కుమార్ రెడ్డి, శ్రీ చక్కిలం రాజేశ్వర్ రావు, దైద రవీందర్ లు మాట్లాడుతూ.... ఖమ్మం అంటేనే కాంగ్రెస్ అని రాష్ట్రంలో ఏ జిల్లా లో రాని మెజారిటీ ఖమ్మం జిల్లా నుండే వచ్చిందని అదే ఉత్సాహంతో 4వ తేదీన హైదరాబాద్ లో జరిగే ఖర్గే పర్యటన విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావు, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ లు మాట్లాడుతూ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అనే కార్యక్రమం ద్వారా ఈ దేశానికి ఒక గొప్ప సందేశాన్ని ఇవ్వబోతున్నామని దాన్లో భాగంగానే అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హైదరాబాదులో పర్యటించనున్నారని అన్నారు. పట్టణ,డివిజన్, మండల, గ్రామ బూతు స్థాయి అధ్యక్షులు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు మాజి శాసనమండలి సభ్యులు బాలసాని లక్ష్మీనారాయణ, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్ చౌదరి, మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారి. క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుమ్మూరు దయాకర్ రెడ్డి, ఖమ్మం బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, జిల్లా అనుబంధ సంఘ అద్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, సయ్యద్ గౌస్, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి సంతోష్,మిక్కిలినేని నరేంద్ర, సాధు రమేష్ రెడ్డి,నగర ఓబీసీ, ఐ యన్ టి యు సి, మైనారిటీ అద్యక్షులు బాణాల లక్ష్మణ్, నరాల నరేష్,షేక్ అబ్బాస్, జిల్లా లోని అన్ని మండలాల నుండి విచ్చేసిన బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అద్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ లక్ష్యాన్ని సాధించే దిశగా చర్యలు

- ఆయిల్ పామ్ సాగుపై జిల్లా కలెక్టర్ సమీక్ష



**మహబూబ్ నగర్, జూలై 2(మనం బ్యూరో):** 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాకు ఆయిల్ పామ్ సాగుకై నిర్దేశించిన 1500 ఎకరాల లక్ష్యాన్ని ఉద్యాన శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల సమన్వయంతో రైతులను గుర్తించి లక్ష్యాన్ని సాదించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉద్యాన శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఆయిల్ పామ్ సాగుపై జిల్లా కల్లెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు నిర్దిశించబడిన 1500 ఎకరాల లక్ష్యం కు గాను, ఇప్పటి వరకు 438.50 ఎకరాలకు, పరిపాలన మంజూరి చేసి 55 ఎకరాలలో ఆయిల్ పామ్ తోటలను నాటడము జరిగిందని తెలిపారు. ఆయిల్ పామ్ తోటల సాగు పై రాష్ట్ర ప్రభుత్వం అత్యదిక ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులు సమిక్షిస్తునట్లు ఆమె తెలిపారు. ఉద్యాన శాఖలో ఫీల్ సిబ్బంది లేకపోవడముతో మండల వ్యవసాయ అధికారులు, క్లస్టర్ లెవెల్ అఉ ల సహాయముతో ఆయిల్ పామ్ రైతుల గుర్తింపు చేపట్టేందుకు సమావేశంలో చర్చించి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఎకరాకు సుమారుగా 50 వేల రూపాయల వరకు, మొక్కలపైనా, డ్రిప్ పైన, 4 సంవత్సరాల వరకు అంతర పంట మెయింటెనెన్స్ కు సబ్సిడీ రూపేణా ప్రభుత్వం నుండి సహాయం లభిస్తుందని తెలిపారు. రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ పై అవగాహనా కల్గించి పంట మార్పిడిగా ఆయిల్ పామ్ సాగు ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ప్రీ యూనిక్యూ ఆయిల్ పామ్ కంపెనీ, జోనల్ మేనేజర్ , ఏరియా మేనేజర్ , ఫీల్ సిబ్బంది , లక్ష్యం సాధించే విధంగా కష్టపడి పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా లో 2021 సంవత్సరం లో నాటిన ఆయిల్ పామ్ తోటల నుండి, ఆయిల్ పామ్ తాజా గెలల దిగుబడులు మొదలయ్యాయని ఉద్యాన శాఖ అధికారులు వివరించారు. ఇప్పటి వరకు 250 ఎకరాలలో 37 మంది రైతుల నుండి 410 టన్నుల గెలలను ఆయిల్ పామ్ కంపెనీ వారు, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేశారని వివరించారు. ప్రభుత్వం ప్రతి నెల ఒక ఫార్ములా ప్రకారా అంతర్జాతీయ క్రూడ్ పామ్ ఆయిల్ ధరలను అనుసరించి రైతుల వద్ద నుండి ఆయిల్ పామ్ గెలలను కొనుగోలు చేయాల్సిన ధరలను నిర్ణయిస్తుందని అన్నారు. ఉపాధి హామీ పథకం లో కూడా పని దినాలు, కొంత నగదు సబ్సిడీ తో ఆయిల్ పామ్ తోటలు నాటుటకు ప్రొత్సాహకా కల్పిస్తునట్లు తెలిపారు. ఉద్యాన శాఖ పథకం అనుసంధానా తో మొక్కల సరఫరా, మొదటి 4 సొంవత్సరాల వరకు అంతర పంటలకు, రసాయన ఎరువులకు సబ్సిడీ ఉంటుందని ఆమె తెలిపారు. వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి వారానికి మూడు రోజుల చొప్పున రైతు వేదికలలో సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మొక్కలు, డ్రిప్ కొరకు రైతు వాటా డిమాండ్ డ్రాఫ్ట్ రూపేణా కట్టించి, జిల్లా కు కేటాయించిన లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో ఉద్యాన శాఖ సంయుక్త సంచాలకులు రామ లక్ష్మి, జిల్లా ఉద్యాన అధికారి కె.వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేష్, డి.ఆర్.డి.ఓ. నరసింహులు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, డివిజన్ ఉద్యాన అధికారులు, ప్రీ యూనిక్యూ ఆయిల్ పామ్ కంపెనీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



## మైనింగ్ శాఖ అధికారులతో మంత్రి డా. వివేక్ రివ్యూ

**మంచిర్యాల, జూలై 2(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర సెక్రటేరియట్లో బుధవారం నిర్వహించిన మైనింగ్ శాఖ సమీక్ష సమావేశంలో రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి గారు శాఖల పనితీరును సమీక్షించారు . నియమాలు పాటిస్తూ మైనింగ్ కార్యకలాపాలు సాగాలని, భద్రత ప్రమాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, అలాగే రాష్ట్ర ఆదాయాన్ని పెంపొందించే దిశగా మైనింగ్ రంగాన్ని మరింత మెరుగుపరిచే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో మైనింగ్ శాఖ అధికారులతో పాటు వివిధ జిల్లాల మైనింగ్ విభాగాలు, సాంకేతిక నిపుణులు కూడా పాల్గొన్నారు.

### మారుపాక సబ్ సెంటర్‌ను తనిఖీ చేసిన

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి

**వేములవాడ, జూలై 2(మనం న్యూస్):** వేములవాడ అర్బన్ మండలంలోని మారుపాక సబ్సెంటర్ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రజిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, వ్యాధి నిరోధక టీకాల అమలు, శుభ్రత తదితర అంశాలను ఆమె పరిశీలించారు. చిన్నపిల్లలకు సమయానికి టీకాలు వేయడం ఎంత ముఖ్యమో సూచించిన డాక్టర్ రజిత, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు సరైన అవగాహన కలిగించాల్సిన బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య కార్యకలాపాలు మరింత సమర్థంగా నిర్వహించాలన్నదే లక్ష్యంగా ఈ తనిఖీలు జరుగుతున్నాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సంపత్ కుమార్, పిఒ ఎం సి హెచ్ డాక్టర్ అంజలీనా, ఎన్ సి డి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ, స్థానిక ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

# 11వ శతాబ్దంలోనే పరమ శివుడు భూమి మీదకొచ్చాడు

- భూమి మీదకు తీసుకొచ్చిన ఘనత మడేలేశ్వర స్వామిది
- రజక సంఘం బోనాల ఉత్సవాల్లో జిల్లా అధ్యక్షులు పెండ్యాల మహేష్
- జిల్లా గౌరవ అధ్యక్షులు నాగేల్లి సాంబయ్య



**రామగిరి, జూలై 2(మనం న్యూస్):** 11వ శతాబ్దంలో పరమశివుని భూమ్మీదికి తీసుకురావడానికి పరమ భక్తుడైన మడేలేశ్వర స్వామి దీక్ష చేపట్టారని తెలిపారు. రామగిరి మండలంలోని సెంటనరీ కాలనీలో రజకుల ఆరాధ్య దైవం మర్యాద ఈశ్వర స్వామి బోనాలు జరుపగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పెద్దపల్లి జిల్లా రజక సంఘం అధ్యక్షులు పెండ్యాల మహేష్, జిల్లా గౌరవ అధ్యక్షులు నాగేల్లి సాంబయ్య మాట్లాడుతూ.. పరమశివుడు మడేలేశ్వర స్వామి భక్తికి మెచ్చి ఈయన నా ప్రియ భక్తుడు అని అన్నారని, అదేవిధంగా తెలుగు రాష్ట్రాల్లో ఆషాడ మాసంలో ఆనవాయితీగా వస్తున్నటువంటి బోనాల పండుగ పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. అదేవిధంగా ఈ బోనాల పండుగ జాతర సెంటనరీ కాలనీలోని జెండా చౌరస్తా నుండి కాలనీలోని పురవీధుల గుండా భారీ భక్తజనం తోటి ఊరేగింపుగా.. డిజె సౌండ్ లతో రామ్ నగర్ లోని మడేలేశ్వర స్వామి గుడికి చేరుకున్నారని ఆయన అన్నారు. అదేవిధంగా ఇక్కడ గతంలో ఉన్నటువంటి మడేలేశ్వర స్వామి ఆలయాన్ని అదేవిధంగా ఇక్కడున్న ధోబిఘట్లను కొంతమంది కూల్చివేశారని, అప్పుడు కూడా ఈ ధోబి ఘాట్ల నిర్మాణానికి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రిగా ఉన్న శ్రీధర్ బాబే ఇప్పించారని, మళ్లీ కూల్చివేసిన స్థలంలోనే రజకులకు దోబిఘట్లతోపాటు, మడేలేశ్వరాలయం, రజక కమ్యూనిటీ హాలు, నిర్మాణానికి తమవంతుగా తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సహకారంతో పునర్నిర్మిస్తామని వారురజక సంఘం నాయకులకు హామీ ఇచ్చారన్నారు.

మండల కేంద్రంలోని సెంటినరీ కాలనీలో రజక సంఘం నాయకులు పున్నం సమ్మయ్య, బండి మొండయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ బోనాల ఉత్సవాలు ఎంతో ఆకట్టుకున్నాయని. రజకుల కుల దైవం ఈశ్వర అంశ అయిన మడేలేశ్వర స్వామికి ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో బోనాలు, ఉత్సవాలు నిర్వహించి వన భోజనాలు నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు. కార్యక్రమం అనంతరం రజక సంఘం నాయకులైన పెండ్యాల మహేష్ ను, నాగేల్లి సాంబయ్యను, ధర్మల రాజయ్యను, నల్లూరి లింగయ్యను, రజక సంఘం నాయకులు ఘనంగా శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం, జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా కార్యదర్శిలు నల్లూరి లింగయ్య, కొత్తపల్లి రాయమల్లు, పెదపల్లి జిల్లా రజక విద్యార్థి విభాగం అధ్యక్షులు బండి రంజిత్ కుమార్, మండల అధ్యక్షులు దర్మల రాజయ్య, సెంటినరీ కాలనీ పట్టణ ప్రధాన కార్యదర్శి బండి మొండయ్య, దురిసెట్టి రవి,చెలికట్ల మల్లేష్, కొదురుపాక భీమయ్య,ఉల్లంగుల రాజయ్య, పున్నం మణి, మిన్నపురం ఓదెలు, కొత్తపల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# మీతో కలిసి పని చేయడానికి సిద్ధం

- ఎన్నికల్లో నిలిచే వారికి శిక్షణ తరగతులు
- బహిరంగ సభను విజయవంతం చేయండి
- కాంగ్రెస్ నాయకులు ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



**కరీంనగర్, జూలై 2 (మనం బ్యూరో):** మీతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో గెలిచేవారికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తానని ఎల్ బి స్టేడియంలో జులై 4న నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి బుధవారం నగరంలోని హోటల్ వి. పార్క్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సోదరుడిగా మీతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు తరలి వెళ్లే వారికి నా వంతు పూర్తి సహకారం అందిస్తానన్నారు. మనమంటే ఏమిటో ఈ బహిరంగ సభతో ప్రతిపక్షాలకు చూపించాలన్నారు.

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు ప్రతికార్యకర్త తరలి రావాలన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయ ఢంకా మోగించడానికి బహిరంగ సభ నాంది పలుకుతుందన్నారు. బారి సంఖ్యలో పార్టీ కార్యకర్తలను క్షేత్ర స్థాయిలో తరలించే విధంగా నాయకులు కృషి చేయాలి అని అన్నారు. ఈ సన్నాహక సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేక క్యాంపులు



**మహబూబ్ నగర్, జూన్ 2(మనం న్యూస్):** గిరిజనుల వికాసానికి, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి అమలు చేస్తున్న పీఎం ధర్తి ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద జిల్లాలో గుర్తించిన 25 గిరిజన ఆవాసాలలో ఈ నెల 25 నుంచి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె.జనార్దన్ తెలిపారు. ఈ సదస్సులలో భాగంగా గురువారము మహ్మదాబాద్ మండలంలోని సంగయ పల్లి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని, జిల్లా గిరిజన మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వము ద్వారా ప్రకటించబడిన ప్రధాన మంత్రి జన జాతీయ ఆదివాసి న్యాయ మహా అభియాన్ మరియు దర్తి ఆభా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకముల పై అవగాహన కల్పించారు. అలాగే, కార్యక్రమము క్రింద ఆధార్ కార్డు, ఆహార భద్రతా కార్డు, ఆయుష్మాన్ భారత్ కార్డు, కులం సర్టిఫికెట్లు, కిసాన్ క్రెడిట్ కార్డు, జన్ ధన్ బ్యాంక్ అకౌంట్ మొదలగునవి లేని వారి పేర్లు గుర్తించి, వారందరికి ఆయా సేవలు అందజేయుటకు దరఖాస్తులు స్వీకరించారు. సమావేశంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె.జనార్ధన్, ఎల్‌డీఎం కాల్వ భాస్కర్, ఎస్‌బీహెచ్, మహ్మదాబాద్, మేనేజర్, రవీందర్, పంచాయతీ కార్యదర్శి కీర్తి, అధికారులు, గ్రామ పెద్దలు, లబ్దిదారులు, వివిధ శాఖల అధికారులు, వివిధ శాఖలకు సంబంధించిన అనధికారులు, ఇంకా సిబ్బంది పాల్గొన్నారు.

# వృద్ధులు, దివ్యాంగుల అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి




**మహబూబ్ నగర్, జూలై 2(మనం బ్యూరో):** వృద్ధులు, దివ్యాంగుల ప్రత్యేక ప్రజావాణిలో అందిన అర్జీలు సంబంధిత అధికారులు సత్వరం పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. ప్రతినెలా మొదటి బుధవారం స్థానిక అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో వయో వృద్ధులకు, దివ్యాంగులకు నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొని వృద్ధులు, దివ్యాంగుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. బుధవారం నిర్వహించిన ప్రజా వాణిలో వృద్ధులు,దివ్యాంగుల నుండి 19 అర్జీలు అందినట్లు తెలిపారు. గత నెల ప్రజావాణి సందర్భంగా వచ్చిన సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు.గత ప్రజావాణి కార్యక్రమం లో వచ్చిన అర్జీలు పై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు వృద్ధులు, దివ్యాంగుల ప్రత్యేక ప్రజావాణి లో వచ్చిన అర్జీల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. పెండింగ్ దరఖాస్తులు ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కారం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిణి జరీనా బేగం గతంలో వచ్చిన ఫిర్యాదులపై సమగ్రంగా నివేదికను వివరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమాచార, సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రెండు వైపులా బస్ షెల్టర్ నిర్మించాలని, స్థానిక పద్మావతీ కాలనీ ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయం ఇరుకుగా ఉందని, అక్కడి నుండి మార్చాలని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, డిఆర్డీవో నర్సింహులు, అర్బన్ తహశీల్దార్ ఘాన్సీరాం, ఆర్టీసీ డీఎం సుజాత, సీనియర్ సిటిజన్ ఫోరం ఉపాధ్యక్షుడు రాజసింహుడు, ప్రధాన కార్యదర్శి నస్కంటి నాగభూషణం, బాలయ్య, మనోహర్ రావు, కోటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారుల ముఖ ధ్రువీకరణ తప్పనిసరి



- జగిత్యాల సీడీపీఓ మమత

**జగిత్యాల, జూలై 1(మనం ప్రతినిధి):** ఈ నెల నుండి అంగన్వాడి సెంటర్లలో లబ్ధిదారుల ముఖ ధృవీకరణ తప్పనిసరి అని జగిత్యాల సిడిపిఓ మమత అన్నారు. బుధవారం జగిత్యాల ప్రాజెక్ట్ పరిధిలోని జగిత్యాల అర్బన్‌లోని అంగన్వాడి సెంటర్ లను సిడిపిఓ మమత సందర్శించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ ఈ నెల నుంచి పోషణ ట్రాక్టర్‌లో లబ్ధిదారుల ఈ కేవైసి, ముఖ ధృవీకరణ తప్పనిసరి చేస్తూ పై అధికారులు ఆదేశాలు జారీ చేయడం జరిగింది అని అన్నారు. దీనిని అనుస రించి పట్టణంలోని అంగన్వాడి కేంద్రాలను సిడిపిఓ మమత గా సందర్శించి లబ్ధిదారుల ఫేస్ క్యాప్చర్ చేసినారు. ఈ సందర్శనలో పోషణ అభియాన్ జిల్లా కోర్డినేటర్ మధు పాల్గొని కొంత మంది లబ్ధిదారుల ఫేస్ క్యాప్చర్ చేసి కేవైసి చెయ్యడం జరిగింది. గర్భిణిలు, బాలింతలు, 6నెలల నుండి 5సంవత్సరాల పిల్లలకు ఈ నెల నుండి ఫేస్ క్యాప్చర్, ఈ కేవైసి చేయించుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, ఆయాలు, లబ్ధిదారులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్



**రామగుండం, జూలై 02(మనం న్యూస్):** జంఘాల పల్లిలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్దిదారులకు అన్ని రకాల మౌళిక వసతులు త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని రామగుండం శాసన సభ్యుడు ఎంఎస్ రాజ్ ఠాకూర్ అన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇళ్లకు రూ.3 కోట్ల 50 లక్షల అంచనా వ్యయంతో సెప్టిక్ ట్యాంక్, సీవరేజ్ పైప్ లైన్ తో పాటు మరో రూ.3 కోట్ల 10 లక్షల అంచనా వ్యయంతో మంచి నీటి పైప్ లైన్ నిర్మాణ పనులకు జంఘాల పల్లిలో బుధవారం ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జంఘాల పల్లిలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్ల మౌళిక వసతుల కొరతతో నివాసయోగ్యంగా లేవని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళిన వెంటనే ఆయన స్పందించి వసతులు కల్పించడానికి రూ.10 కోట్లు మంజూరు చేశారని అన్నారు. ఈ నిధులతో ప్రదాన రహదారి నుండి డబల్ బెడ్ రూమ్ కాలనీకి చేరుకోవడానికి అనుసంధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు, మంచినీటి సౌకర్యం, విద్యుత్, వీధి దీపాలు, డ్రైనేజ్ తదితర అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. పేద వారికి అన్యాయం జరగవద్దనే కాంక్షతో గత ప్రభుత్వ హయాంలో ఎంపిక చేసిన లబ్దిదారులను మార్చకుండా వారికే ఈ ఇండ్లను డ్రా ద్వారా కేటాయించడం జరిగిందని అన్నారు. అభివృద్ధి పనులు పూర్తయిన వెంటనే సంబంధిత మంత్రులను ఆహ్వానించి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అందరం కలిసి పండుగలా జరుపుకుందామని అన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె అరుణ శ్రీ, సూపరింటెండింగ్ ఇంజనీర్ శివానంద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్, గృహ నిర్మాణ విభాగం అధికారులు, తాజా మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్ఎంసీలో రెవెన్యూ మేళా

వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బుధవారం పలు డివిజన్లలో వివిధ కార్యక్రమాలు చేపట్టారు. విలేజ్ రామగుండంలో శిధిలమైన భవనాన్ని కూల్చివేశారు. కల్యాణ్ నగర్ లోని వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్ లపై అవగాహన కల్పించారు. ఎఫ్ సి ఐ రోడ్డులో ఖాజీపల్లి వద్ద రహదారి ప్రక్కన మెరిగిన ముళ్ళ పొదలు, తుప్పలు తొలగించారు. సంజయ్ గాంధీ నగర్ లో రోడ్డుపై గుంతలను పూడ్చారు. కూరగాయల మార్కెట్ లో చిరువ్యాపారులకు పిఎం స్వనిధి తదితర పథకాలపై అవగాహన కల్పించారు. ఆస్తి పన్ను సమస్యల పరిష్కారానికై నగర పాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ మేళా నిర్వహించారు. రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి ఆయా కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించగా సంబందిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారుల ధ్రువీకరణ తప్పనిసరి

- జగిత్యాల సీడీపీఓ మమత

**జగిత్యాల, జూలై 1(మనం ప్రతినిధి):** ఈ నెల నుండి అంగన్వాడి సెంటర్లలో లబ్ధిదారుల ముఖ ధృవీకరణ తప్పనిసరి అని జగిత్యాల సిడిపిఓ మమత అన్నారు. బుధవారంజగిత్యాల ప్రాజెక్ట్ పరిధిలోని జగిత్యాల అర్బన్‌లోనీ అంగన్వాడి సెంటర్‌లను సిడిపిఓ మమత సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ ఈ నెల నుండి పోషణ ట్రాకర్ లో లబ్ధిదారుల ఈ కేవైసి, ముఖ ధృవీకరణ తప్పనిసరి చేస్తూ పై అధికారులు ఆదేశాలు జారీ చేయడం జరిగింది అని అన్నారు.దీనిని అనుసరించి పట్టణంలోని అంగన్వాడి కేంద్రాలను సిడిపిఓ మమత గా సందర్శించి లబ్ధిదారుల ఫేస్ క్యాప్చర్ చేసినారు. ఈ సందర్శనలో పోషణ అభియాన్ జిల్లా కోర్డినేటర్ మధు పాల్గొని కొంత మంది లబ్ధిదారుల ఫేస్ క్యాప్చర్ చేసి కేవైసి చెయ్యడం జరిగింది. గర్భిణిలు, బాలింతలు, ఆరు నెలల నుండి 5సంవత్సరాల పిల్లలకు ఈ నెల నుండి ఫేస్ క్యాప్చర్, ఈ కేవైసి చేయించుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, ఆయాలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.





# ఉప్పల శ్రీనివాస్ గుప్తకు సన్మానం

**కామారెడ్డి, జూలై 2(మనం ప్రతినిధి):** జహీరాబాద్ పార్లమెంట్ ఇన్చార్జిగా ఇటీవల నియామకమైన ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా కామారెడ్డి పర్యటన కు వచ్చిన సందర్భంగా కల్కి మానవ సేవా సమితి, కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) ల సంయుక్త ఆధ్వర్యంలో కల్కి ఆలయంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ వి ఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు మాట్లాడుతూ., భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను ఆకాంక్షించాలని, ఆర్యవైశ్యుల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని విజ్ఞప్తి చేశారు,ఆలయానికి విచ్చేసిన పిసిసి జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావును సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ గంప ప్రసాద్, ఆలయ సేవకులు ఎర్రం విజయ్, ఎర్రం సూర్యకాంతం, నాయకులు గోనె శ్రీనివాస్, కిరణ్, సర్వర్ లు పాల్గొన్నారు.

# ప్రశాంత్ రెడ్డి రైతులకు చేసిందేమీ లేదు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్

**నిజామాబాద్, జూలై 02(మనం బ్యూరో):** పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ప్రశాంత్‌రెడ్డి రైతులకు చేసిందేమీ లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు బోర్డును పదేపదే అవహేళన చేస్తూ మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు ప్రశాంత్ రెడ్డి, జీవన్ రెడ్డి, కవితలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో 176 మంది పసుపు రైతులు ఎన్నికల్లో పోటీ చేసి కేసీఆర్ బిడ్డ కవితను ఓడగొట్టారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఏం మాట్లాడుతున్నారో వాళ్లకే తెలియడం లేదన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ఇప్పటికీ లెటర్ ప్యాడ్ లేదని ఎద్దేవా చేశారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి క్యాంప్ కార్యాలయం ఎక్కడుందో కార్యకర్తలకే తెలియదన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏర్పడిన జాతీయ బోర్డులకు జిల్లా నుంచి ఒక్క చైర్మన్‌ను అయినా నియమించారా అని ప్రశ్నించారు. రూరల్ క్యాంపు కార్యాలయం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారితే ప్రజలకు ఉపయోగపడే విధంగా బీజేపీ చేసిందని స్పష్టం చేశారు.



# ఇందిరమ్మ గృహాలను త్వరగా నిర్మించుకోవాలి

- లబ్ధిదారులకు సూచించిన కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్
- టేక్రియాల్‌లో ఇద్దరికి ఇండ్ల ప్రొసీడింగ్స్ అందించిన కలెక్టర్



**కామారెడ్డి, జూలై 2(మనం ప్రతినిధి):** ఇందిరమ్మ గృహాలను త్వరగా నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ లబ్ధిదారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కామరెడ్డి పట్టణ పరిధిలోని 13వ వార్డు టేక్రీయల్‌లో ఇద్దరు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ అందించి ఇండ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ., నిరుపేదవారు కూడా గౌరవంగా సొంత ఇంటిలో నివసించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని గృహనిర్మాణ శాఖ అధికారుల సూచనల మేరకు నాణ్యతగా త్వరగా ఇండ్లు నిర్మించుకోవాలని సూచించారు. అలాగే ఎప్పటికప్పుడు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు త్వరగా నిర్మించుకొనుటకు లబ్ధిదారులకు సహకారం అందించాలని హోసింగ్ పీడీ విజయ్ పాల్ రెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ రాజేందర్, గృహ నిర్మాణ, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పోలీసులు పనితీరును మెరుగుపర్చుకోవాలి




- సీపీ సాయి చైతన్య

**నిజామాబాద్, జూలై 2(మనం బ్యూరో):** మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసులు తమ పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నగరంలోని సీపీ కార్యాలయంలో జోన్-2 బాసర లెవల్ పోలీస్ డ్యూటీ మీట్-2025ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సైన్స్‌ను ఇన్వెస్టిగేషన్ టూల్స్‌గా మార్చుకునేందుకు పోలీసులు తమను తాము మెరుగుపర్చుకోవాలని సూచించారు. పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించడం ద్వారా పనిలో పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఇన్వెస్టిగేషన్ స్థాయిలు పెరుగుతాయన్నారు. పోలీస్ డ్యూటీ మీట్-2025లో నిజామాబాద్, జగిత్యాల్, నిర్మల్, ఆదిలాబాద్ పోలీసు అధికారులకు సిబ్బందికి పోటీలు నిర్వహించారు. సైంటిఫిక్, ఫింగర్ ప్రింట్, ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్, కంప్యూటర్స్, డాగ్ స్క్వాడ్స్, ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీ, ఎక్స్‌ప్లోజివ్స్, నార్కోటిక్, ఫోరెన్సిక్ మెడిసిన్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ ఎంపికలు మూడు రోజులపాటు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభకనబర్చిన వారికి రాష్ట్రస్థాయిలో జరిగే డ్యూటీ మీట్‌కు పంపుతామని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డీసీపీ(అడ్మిన్) బస్వారెడ్డి, అదనపు డీసీపీ (ఏఆర్) రామ్ చందర్ రావు, సీసీఎస్ ఏసీపీ నాగవేంద్ర చారి, జగిత్యాల, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మున్నూరు కాపు యువత నూతన కార్యవర్గం



**నిజామాబాద్, జూలై 2(మనం బ్యూరో):** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపు ఫంక్షన్ హాల్‌లో బుధువారం మున్నూరుకాపు సంఘం తెలంగాణ, మున్నూరు కాపు యువత, మున్నూరు కాపు సోషల్ మీడియా సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వనవల ప్రవీణ్ కుమార్, మున్నూరుకాపు యువత రాష్ట్ర అధ్యక్షులు బండి సంజీవ్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్, మున్నూరు కాపు సంఘం సోషల్ మీడియా రాష్ట్ర ఇంచార్జ్ ఎర్రం సంజీవ్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇమ్మిశెట్టి మోహన్, యువత రాష్ట్ర కార్యదర్శిలు డోంగ్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ కార్యవర్గ సమావేశంలో నిజామాబాద్ జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షులుగా కలికోట ప్రశాంత్, మున్నూరుకాపు యువత నిజామాబాద్ జిల్లా అధ్యక్షులుగా యెడల సతీష్, మున్నూరుకాపు యువత కామారెడ్డి జిల్లా అధ్యక్షులుగా బండి వార్ దత్తు, నిజామాబాద్ జిల్లా యువత ఉపాధ్యక్షులుగా సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సాయినాథ్, జిల్లా కార్యదర్శిగా గంగరాజు, కామారెడ్డి జిల్లా మున్నూరు కాపు యువత ఉపాధ్యక్షులుగా పెరిక శ్రీనివాస్, ఆకుల స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుండా మొగులయ్య, జిల్లా కార్యదర్శిగా పూరం గంగారం, బోనాల సంజీవ్, జిల్లా కోశాధికారిగా సూదం విటల్, నిజామాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం సోషల్ మీడియా ఇన్‌చార్జిగా సూర శివకుమార్, కామారెడ్డి జిల్లా సోషల్ మీడియా ఇంచార్జిగా జీ.సుధీర్ కుమార్, బోధన్ నియోజకవర్గ మున్నూరుకాపు యువత ఇన్‌చార్జిగా ఉషికే మారి శ్రీనివాస్‌లను నియమించడం జరిగింది. అనంతరం వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం బలోపేతం కోసం ప్రతి ఒక్కరం కలిసికట్టుగా పని చేస్తామని కార్యవర్గ సమావేశంలో నియమించిన ప్రతి ఒక్కరు దైవ సాక్షిగా ప్రమాణం చేశారు. ఈ కార్యవర్గ సమావేశం అనంతరం నిజామాబాద్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కీర్తిశేషులు ధర్మపురి శ్రీనివాస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది.

# దలైలామా ఎంపిక నిర్ణయం

- గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్‌ది మాత్రమే
- మరెవరికి అధికారం లేదన్న దలైలామా
- దలైలామా వారసుడికి బీజింగ్ ఆమోదం ఉండాలి: చైనా



**టిబెట్, జూలై 2 :** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా తాజాగా చైనాకు షాక్ ఇచ్చారు. 15వ దలైలామా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని.. దానిని నిర్వహించే అధికారం గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్కు మాత్రమే ఉందని తేల్చిచెప్పారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. 2011 సెప్టెంబర్ 24నే తాను టిబెట్ బౌద్ధ మత పెద్దలు, నాయకులు, ఇతర సంస్థలతో భేటీ నిర్వహించి.. తన వారసుడి ఎంపిక కొనసాగించాలా..? అనే అంశంపై అభిప్రాయాలు కోరినట్లు పేర్కొన్నారు. దీనికి అన్నివర్గాల నుంచి సానుకూల స్పందనలు వచ్చాయన్నారు. స్పందించిన వారిలో టిబెట్ మతపెద్దలు, చైనాలోని వారు కూడా ఉన్నట్లు వెల్లడించారు. తన వారసత్వం భవిష్యత్తులో కొనసాగాలని వారంతా కోరుకున్నట్లు తెలిపారు.

తన వారసత్వం కొనసాగాలా, వద్దా అనే విషయాన్ని ప్రజలే నిర్ణయిస్తారని తాను 1969లోనే వెల్లడించినట్లు దలైలామా పేర్కొన్నారు. తాజా అభిప్రాయాల ఆధారంగా గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్ మాత్రమే దలైలామా పునర్జన్మను నిర్ణయిస్తుందని.. ఈ ప్రక్రియలో మరెవరికీ జోక్యం చేసుకొనే అధికారం లేదని తేల్చిచెప్పారు. చాలా ఏళ్ల క్రితం దలైలామా ఒక దశలో తనతోనే ఈ సంప్రదాయం ముగిసిపోతుందని ఆందోళన చెందారు. కానీ, ఆ తర్వాత తన పునర్జన్మ టిబెట్ బయట జరగొచ్చని చెప్పారు. టిబెట్‌ను గుప్పిట పెట్టుకోవడానికి తమ చెప్పుచేతల్లో ఉండే కీలుబొమ్మను దలైలామా వారసుడిగా ఎంపిక చేయాలని చైనా ఎప్పటినుంచో ఉబలాటపడుతోంది. ఆ ప్రాంతాన్ని 1950లో ఆక్రమించిన చైనా- ఆ తరవాత దాన్ని తన భూభాగంలోకి మార్చేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసింది. ముఖ్యంగా చైనీస్ మూలాలున్న హన్ జాతి ప్రజలు ఇబ్బడిముబ్బడిగా టిబెట్‌లో స్థిరపడేలా చేసింది. ఆక్రమణ తరవాత లక్షల సంఖ్యలో అక్కడి చిన్నారులను దూర ప్రాంతాలకు తరలించి వారికి బ్రెయిన్ వాష్ చేసింది. అక్కడి పీఠభూమిలో విస్తారంగా బొగ్గు, రాగి, క్రోమియం, లిథియం, జింక్, సీసం, బోరాన్ నిక్షేపాలు ఉండడంతో వాటిపైనా చైనా కన్నేసింది. టిబెట్‌పై పట్టు కోసం భవిష్యత్తులో దలైలామా స్థానాన్ని కబ్జా చేయాలని చైనా భావించింది. ఆ స్థానం ఎంపికలో పంచయిన్ లామా పాత్ర చాలా కీలకం. టిబెట్లోనే ఉండిపోయిన పంచయిన్ లామా 1989లో అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయనపై విష ప్రయోగం చేశారంటారు. పంచయిన్ లామా వారసుడిగా ఎంపికైన బాలుడిని తన అధీనంలో ఉంచుకొన్నట్లు కొన్నేళ్ల కిందట బీజింగ్ ప్రకటించింది. ఈ ఎత్తుగడలను గ్రహించిన దలైలామా తన పునర్జన్మ టిబెట్ బయట కూడా జరగొచ్చని ప్రకటించారు. దీంతోపాటు వారసుడిని ఎంపిక చేసే ప్రక్రియ కూడా తమదేనని తేల్చిచెప్పారు. దలైలామా వారసుడికి కచ్చితంగా తమ ఆమోదముద్ర ఉండాల్సిందేనని చైనా బుధవారం ప్రకటించింది. ఈమేరకు ఆ దేశ విదేశాంగశాఖ ప్రతినిధి మావోనింగ్ ప్రకటన విడుదల చేశారు. పైగా వారసుడి గుర్తింపు కార్యక్రమాన్ని చైనాలోనే పురాతన విధానాలను అనుసరించి నిర్వహించాలన్నారు. వారసుడి ఎంపికలో బయటవారి జోక్యం ఉండదని దలైలామా పేర్కొన్న గంటల్లోనే బీజింగ్ నుంచి స్పందన వెలువడటం గమనార్హం. ప్రస్తుతం దలైలామాకు 90 ఏళ్లు నిండటంతో వారసుడి ఎంపిక ప్రక్రియ వేగవంతమైంది.

# 11వ తరగతి విద్యార్థిపై లైంగిక వేధింపులు

- పోక్సో చట్టం కింద మహిళా టీచర్ అరెస్టు

ముంబయి, జూలై 2 : ముంబయి లోని ప్రముఖ పాఠశాలలో 11వ తరగతి చదువుతున్న విద్యార్థిపై ఓ మహిళా టీచర్ లైంగిక వేధింపులకు పాల్పడింది. దీంతో ఆమెను పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్టు చేశారు. టీచర్ ప్రవర్తనపై బాధిత విద్యార్థి తల్లిదండ్రులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. 2023లో పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా గ్రూప్ డ్యాన్స్ కోసం సిద్ధం చేస్తున్న సమయంలో బాధిత విద్యార్థితో ఆ టీచర్ పరిచయం పెంచుకున్నట్లు సమాచారం. ఆ తర్వాత అతడిని ఆమె పలు ఫైవ్‌స్టార్ హోటళ్లకు తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. తొలుత ఆ విద్యార్థి నిరాకరించినప్పటికీ.. మరో మహిళ సాయంతో ఆ బాలుడిని టీచర్ ఒప్పించినట్లు సమాచారం. టీచర్లు-విద్యార్థుల మధ్య ఇలాంటివి సహజమేనని ఆమె చెప్పి బాలుడిని ఒప్పించింది. దీంతో అతడు టీచర్‌ను కలిసేందుకు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఆ మహిళపై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

ఆ తర్వాత టీచర్.. ఆ విద్యార్థిని కారులో నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లిందని పోలీసులు చెప్పారు. అతడితో మద్యం కూడా తాగించేదని పేర్కొన్నారు. ఆ తర్వాత కొన్ని రోజులకు ఆ విద్యార్థి తీవ్ర ఆందోళనకు గురయ్యేవాడని.. ఆందోళన తగ్గేందుకు టీచర్ మందులు కూడా ఇచ్చేదని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం.

ఆ తర్వాత తమ కుమారుడి ప్రవర్తనలో మార్పును గమనించి తల్లిదండ్రులు ఆరాతీశారు. దీంతో జరిగిన విషయాన్ని అతడు తల్లిదండ్రులకు వివరించాడు. అయితే.. మొదట్లో దీనిపై ఫిర్యాదు చేయకూడదని తల్లిదండ్రులు నిర్ణయించుకున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మైక్రోసాఫ్ట్‌లో భారీగా లేఆఫ్‌లు.. 9 వేల మందికి నోటీసులు!

**వాషింగ్టన్, జూలై 2 :** టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైంది. వేలాది మందికి లేఆఫ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. కొన్ని నెలల వ్యవధిలోనే ఈ స్థాయి లేఆఫ్‌లు ప్రకటించడం ఇది రెండోసారి. అయితే, ఈసారి ఎంతమందిపై వేటు పడనుందనే విషయాన్ని స్పష్టంగా చెప్పనప్పటికీ.. దాదాపు నాలుగు శాతం కంటే తక్కువ ఉద్యోగులపై ప్రభావం చూపనుందని తెలిపింది. కొన్ని మీడియా కథనాల ప్రకారం దాదాపు 9 వేల మందికి లేఆఫ్లు ఇచ్చినట్లు సమాచారం. జూన్ 2024 నాటికి 2.28 లక్షల మంది ఉద్యోగులు మైక్రోసాఫ్ట్లో పనిచేస్తున్నారు. భారీ సంఖ్యలో ఉద్యోగుల తొలగింపులను మొదలుపెట్టిన టెక్ దిగ్గజం.. ఈ ఏడాది మే నెలలో 6 వేల మందికి లేఆఫ్‌లు ప్రకటించింది. తాజాగా మరోసారి పెద్దఎత్తున తొలగింపునకు సిద్ధమైంది. తాజా నిర్ణయంతో మొత్తం సిబ్బందిలో నాలుగు శాతం.. అంటే దాదాపు 9100 మంది ఉద్యోగులపై ప్రభావం పడనున్నట్లు అంచనా.




## నాకు ఇంకో దారి లేదు: 'సీఎం పదవి'పై డీకే ఆసక్తికర వ్యాఖ్యలు

**బెంగళూరు,జూలై 2 :** కర్ణాటకలో నాయకత్వ మార్పు అంశంపై కొన్ని రోజులుగా వినిపిస్తోన్న వ్యాఖ్యలకు చెక్ పడింది. ఐదేళ్లు తానే కర్ణాటక ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టంచేశారు. 'నేను సీఎంగా కొనసాగుతా. మీకెందుకు అలాంటి అనుమానాలు ఉన్నాయి..?' అని బుధవారం పాత్రికేయులకు వెల్లడించారు. సీఎం మార్పు గురించి విపక్ష పార్టీలు బీజేపీ, జేడీఎస్ చేస్తోన్న వ్యాఖ్యలను కొట్టిపారేశారు. వారేమైనా కాంగ్రెస్ అధిష్ఠానమా అని ప్రశ్నించారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ..' ఆయన(సీఎం)కు అండగా ఉండటం తప్ప నాకు ఇంకో ఆప్షన్ లేదు. నేను ఆయనకు మద్దతు ఇవ్వాలి. అధిష్ఠానం ఏం చెబితే అది చేయాలి'' అని మాట్లాడారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్లు రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా అంగీకారానికి వచ్చారనే వార్తలూ వచ్చాయి. పలు కేసుల్లో సిద్ధరామయ్య పేరు బయటకు రావడంతో సీఎంగా ఆయనను తొలగించాలన్న డిమాండ్లు తెర పైకి వస్తున్నాయి. శివకుమార్ కూడా ఎప్పటికైనా ముఖ్యమంత్రి పదవిని స్వీకరిస్తాననే బహిరంగంగానే చెబుతున్నారు. ఆ నేపథ్యమూ ఈ చర్చకు దారితీసింది. అయితే వ్యాఖ్యలను డీకే శివకుమార్, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రణదీప్ సూర్జేవాలా ఇప్పటికే ఖండించిన సంగతి తెలిసిందే. 'నా తరఫున ఎమ్మెల్యేలు మాట్లాడాలని కోరుకోవడం లేదు. 2028లో రాష్ట్రంలో జరిగే ఎన్నికల పైనే నేతల దృష్టి ఉండాలి. నేను తొలుత పార్టీ కార్యకర్తను. అన్నింటికంటే పార్టీనే ముఖ్యం' అని డీకే స్పష్టంచేశారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పు లేదని సూర్జేవాలా వెల్లడించారు.

జాతీయం- అంతర్జాతీయం

# బ్రిక్స్ సదస్సుకు జిన్పింగ్ దూరం

**బ్రెసిలియా, జూలై 2 :** బ్రెజిల్లో ఈ వారం జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు చైనా అధ్యక్షుడు జిన్పింగ్ హాజరుకావడం లేదు. ప్రీమియర్ (ప్రధాని) లీ కియాంగ్ ఈ సదస్సుకు హాజరుకానున్నట్లు చైనా అధికారికంగా వెల్లడించింది. జిన్‌పింగ్ అధికారం చేపట్టిన 12 ఏళ్లలో తొలిసారి ఈ సదస్సుకు దూరంగా ఉండటం గమనార్హం. మరోవైపు అధ్యక్షుడు ఇటీవల కొంతకాలం అదృశ్యమయ్యారన్న వార్తల వేళ ఈ కీలక ప్రకటన వెలువడింది.

బ్రెజిల్లోని రియోడి జనీరోలో జులై 5 నుంచి 8 వరకు బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. భారత ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఈ సదస్సుకు హాజరుకానున్నారు. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలతో ఏర్పడిన ఈ కూటమిలో ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈలు ఆ తర్వాత చేరిన సంగతి



తెలిసిందే. రష్యాలోని కజాన్లో గతేడాది జరిగిన సదస్సులో భారత ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు భేటీ అయ్యారు.

ఇరుదేశాల మధ్య సరిహద్దు వివాదం నెలకొన్న ఆ సమయంలో నాలుగేళ్ల విరామం తర్వాత ఇద్దరు నేతలు సమావేశం కావడం అప్పట్లో ప్రాధాన్యం సంతరించుకుంది. అంతేకాకుండా పలు ద్వైపాక్షిక అంశాలపైనా ఓ అంగీకారానికి రావడంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు కాస్త మెరుగుపడ్డాయి. తాజాగా ఇదే సదస్సుకు జిన్‌పింగ్ దూరమవుతున్న నేపథ్యంలో తదుపరి వీరిద్దరు ఈ ఏడాది చివరలో చైనాలో జరిగే ఎస్సీవో సదస్సులోనే భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

మరోవైపు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్.. మే 21 నుంచి జూన్ 5 వరకూ అదృశ్యమయ్యారన్న వార్త ఇటీవల కలకలం రేపింది. అధ్యక్ష మార్పునకు ఇది సంకేతమంటూ కొన్ని నిఘా సంస్థలు అంచనా వేసినట్లు వార్తలు వచ్చాయి. సంస్కరణాభిలాషి, టెక్నోక్రాట్ అయిన వాంగ్ యాంగ్ తదుపరి అధ్యక్షుడు కావొచ్చంటూ ఊహాగానాలు వినిపించాయి. అయితే జిన్‌పింగ్ ఇలా అదృశ్యం కావడం సాధారణమేనని, సమయం వస్తే అధినేతలనైనా చైనా కమ్యూనిస్టు పార్టీ పక్కనబెట్టడం రివాజేనని నిఘా సంస్థలు పేర్కొన్నాయి.

# డోజ్ రాక్షసి లాంటిది.. మస్క్‌ను తినేస్తుంది: ట్రంప్

వాషింగ్టన్, జూలై 2: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ట్రంప్ కలల బిల్లు 'బిగ్ బ్యూటిఫుల్'ను మస్క్ మొదటి నుంచి వ్యతిరేకిస్తుండటంతో మరోసారి వీరి మధ్య విభేదాలు మొదలైన విషయం తెలిసిందే.

ప్రపంచంలోని ఏ వ్యక్తికి దక్కనన్ని సబ్సిడీలు మస్కుకు దక్కుతున్నాయని.. ఈ సబ్సిడీలు లేకపోతే ఆయన దుకాణం మూసేసుకుని వెళ్లిపోవాల్సిందేనని ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు. రాకెట్ ప్రయోగాలు, శాటిలైట్లు, విద్యుత్తు కార్ల ఉత్పత్తి లేకపోతే దేశానికి ఎంతో మిగులుతుందని, దీనిపై చర్యలు తీసుకోవడానికి డోజ్ ఉందన్నారు. ''డోజ్ మస్క్ వైపు చూస్తుందని నేను అనుకుంటున్నాను. ఒకవేళ డోజ్ మస్క్ వైపు చూస్తే.. మనం చాలా డబ్బు ఆదా చేసుకోవచ్చు'' అని ఫ్లోరిడా పర్యటనలో ట్రంప్ అన్నారు. 'మస్క్‌పై డోజ్‌ను ప్రయోగించాల్సి రావొచ్చు. డోజ్ అంటే ఏమిటో మీకు తెలుసు కదా..? డోజ్ రాక్షసి లాంటిది. అది తిరిగి వెళ్లి ఎలాన్ మస్కును తింటుంది. అది ఎంతో భయంకరమైనది'' అని ట్రంప్ మీడియాతో పేర్కొన్నారు. ఇక 'బిగ్ బ్యూటిఫుల్'బిల్లు ఇటీవల సెనెట్లో ఆమోదం పొందింది. దీనిపై మరోసారి సెనెట్లో ఓటింగ్ జరగనుండగా మస్క్ వరుస పోస్టులతో విరుచుకుపడ్డారు. ఆ బిల్లుకు ఓటు వేసే కాంగ్రెస్ సభ్యుల సీట్లకు వచ్చే ఏడాది ఎసరు పెట్టేందుకు పని చేస్తానని హెచ్చరించారు. ప్రభుత్వ వ్యయాలు తగ్గిస్తామని చెప్పి.. ఇప్పుడు ఓటు వేస్తే తలవంచుకొని సిగ్గు పడాల్సి వస్తోందన్నారు. తన కొత్త పార్టీ గురించి కూడా ఆయన ప్రస్తావించారు. ఈ క్రమంలోనే మస్కును దేశం నుంచి బహిష్కరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు.

# భారత్ 'బఫరింగ్ శకం' కాంగ్రెస్‌తోనే ముగిసింది

## ఖర్గేకు కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా కౌంటర్

**ఢిల్లీ, జూలై 2 :** ప్రధాని నరేంద్రమోదీ హయాంలో డిజిటల్ ఇండియా అంటే నెరవేర్చని హామీలేనని కాంగ్రెస్ చేసిన విమర్శలను కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాధిత్య సింధియా తిప్పికొట్టారు. భారత్‌లో 'బఫరింగ్ యుగం' కాంగ్రెస్‌తోనే ముగిసిపోయిందని.. ప్రధాని మోడీ పాలనలో దేశం 5జీ వేగంతో వెళ్తోందని అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడికి జ్ఞానోదయం కలిగించే మరో అవకాశం తమకు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కాంగ్రెస్ నేతలు తమను ప్రశ్నించిన ప్రతిసారీ తగిన ఆధారాలతో జవాబు చెప్పామని పేర్కొన్నారు. దేశ ప్రజలకు కాంగ్రెస్ డయల్-అప్ సౌకర్యం కూడా అందించలేక పోయిందన్నారు. కానీ తమ ప్రభుత్వం ప్రపంచస్థాయి టెలికాం నెట్‌వర్క్, యూపీఐ, భారత్ నెట్ వంటి సేవలను దేశ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు.

దాదాపు 18 ఏళ్ల తర్వాత ప్రభుత్వరంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ వరుసగా లాభాలు ఆర్జించడం, రెండు లక్షలకు పైగా గ్రామ పంచాయతీలను బ్రాడ్‌బ్యాండ్‌తో అనుసంధానించడం వంటి విషయాలను సింధియా ఉదహరించారు. యూపీఐ వంటి వేదికల వల్ల ప్రపంచ డిజిటల్ లావాదేవీల్లో సగం మన దేశంలోనే జరుగుతున్నాయని.. వ్యాపారాల్లో దళారుల ప్రమేయాన్ని తొలగించి ప్రత్యక్ష నగదు బదిలీ చేయడం వల్ల రూ.3.48 లక్షల కోట్ల డబ్బు ఆదా అవుతోందని అన్నారు.

'డిజిటల్ ఇండియా' కార్యక్రమం చేపట్టి మంగళవారానికి సరిగ్గా పదేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. తమ పాలనలో దేశాన్ని సాంకేతికత వైపు నడుపుతున్నామని అన్నారు. భారతీయులు సాంకేతికతను వాడగలరా, లేదా అనే సందేహంతోనే దశాబ్దాలు గడిచిపోయాయని.. తమ ప్రభుత్వం వచ్చాక ఈ ధోరణిని మార్చిందని అన్నారు. ప్రస్తుతం దేశంలో 97 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. దీనిపై ఖర్గే స్పందిస్తూ.. ప్రభుత్వం ఎన్ని గొప్పలు చెప్పినా అవన్నీ శుష్క వాగ్దానాలుగానే మిగిలాయని 65% గ్రామాలకు ఇంకా బ్రాడ్‌బ్యాండ్ అందుబాటులోకి రాలేదని, ప్రభుత్వరంగ టెలికాం కంపెనీల రుణభారం పెరిగిపోతోందని, సైబర్ నేరాలకు అంతే లేదని పేర్కొన్నారు.

# 12వేల కోట్ల రూపాయలతో హ్యామ్ విధానంలో డబుల్ రోడ్ల నిర్మాణం

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి




నల్గొండ, జులై 2 ( మనం ప్రతినిధి)ః రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రాలకు 12000 కోట్ల రూపాయలతో హ్యామ్ విధానంలో డబుల్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ రహదారి పనులకు ఆగస్టు మొదటి వారంలో టెండర్లను పిలువనున్నట్లు ఆయన వెల్లడించారు.బుధవారం మంత్రి ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్ష అనంతరం 6 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన ఆర్ అండ్ బి ఎస్ ఈ కార్యాలయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ తో కలిసి ప్రారంభించారు.అనంతరం మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ హ్యామ్ విధానంలో మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రాల డబుల్ రోడ్డు నిర్మాణానికి గాను గత క్యాబినెట్లో ఆమోదం పొందడం జరిగిందని, ఇందులో భాగంగా కాంట్రాక్టర్ 40%, బ్యాంకు ద్వారా 60 శాతం రుణం తీసుకుని రోడ్ల నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. ఈ విషయంపై గురువారం ఎర్రమంజిల్ లోని ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నామని, ముందుగా 10 ప్యాకేజీలకు సంబంధించి 3000 కోట్ల రూపాయలతో పనులకు టెండర్లు పిలువనున్నామని , మొదటి దశలో 5190 కోట్లతో, రెండవ దశలో 7000 కోట్లతో పనులు చేపట్టనున్నామని తెలిపారు. హ్యామ్ విధానం 7 రాష్ట్రాల్లో అమల్లో ఉందని, మన రాష్ట్రంలో పంచాయతీరాజ్ ద్వారా కూడా 15 వేల కోట్ల రూపాయలతో, మొత్తం 29 వేల కోట్ల రూపాయలతో హ్యామ్ రోడ్లు నిర్మించనున్నామని చెప్పారు. ఆర్ అండ్ బి శాఖలో ఖాళీగా ఉన్న 150 ఏఈఈల నియామకానికి టీజీపీఎస్సీకి నివేదించినట్లు చెప్పారు. నల్గొండ జిల్లాకు ఆర్ అండ్ బి ద్వారా 12000 కోట్ల రూపాయల పైనే నిధులు ఇవ్వడం జరిగిందని, రహదారులపై ఏ ఒక్క ప్రమాదం జరగకుండా అరికట్టాలన్నదే తమ లక్ష్యమని మంత్రి వెల్లడించారు.ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ, మైనార్టీ శాఖ ల మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో విద్య , ఇరిగేషన్ ప్రాజెక్టులు, రైతుల సంక్షేమతో పాటు జిల్లా అభివృద్ధి చర్యలు తీసుకుంటామని, సంక్షేమంలో భాగంగా ఎస్సీ ,ఎస్టీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు రాబోయే రోజుల్లో వారి కాళ్లపై వారు నిలబడే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ , దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, అండ్ బి ఎస్ ఈ వెంకటేశ్వరరావు ఈ ఈ లు,డి ఈ లు,అసిస్టెంట్ ఇంజనీర్లు ,తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి యాదవులకు ఇవ్వాలి

యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు బెల్లి నాగరాజు యాదవ్



నల్లగొండ, జులై 2( మనం న్యూస్ )ః నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి యాదవులకు ఇవ్వాలని జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి, రోడ్డు భవనాల శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి,నల్లగొండ పార్లమెంటు సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి,నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి గార్లకు నల్లగొండ జిల్లా అధ్యక్ష పదవి యాదవులకు ఇవ్వాలని యాదవ విద్యావంతుల వేదిక నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బెల్లి నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని రెవెన్యూ అతిథి గృహంలో కలిసి వినతి పత్రాలు వేరు వేరుగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బెల్లి నాగరాజు యాదవ్ మాట్లాడుతూ ఈసారి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి జిల్లాలో అత్యధిక జనాభా కలిగిన యాదవ సామాజిక వర్గానికి ఇవ్వాలని కోరుతున్నామన్నారు. నల్లగొండ జిల్లాకు గతంలో ఉన్న ప్రభుత్వం రెండు ఎమ్మెల్యేలు, ఒక రాజ్యసభ, ఒక కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చి ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లాలో యాదవులకు ప్రాధాన్యత లేదన్నారు. కావున సామాజిక న్యాయానికి పెద్ద పీట వేస్తున్న ఈ ప్రభుత్వంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి గతంలో యువజన కాంగ్రెస్ లో పని చేసి పార్టీకి విధేయుడుగా ఉన్న యువ నాయకులకు ఇస్తే బాగుంటుందన్నారు. జిల్లా అధ్యక్ష పదవి యాదవులకు ఇస్తే భవిష్యత్తులో జరిగే ఎన్నికలలో అండగా ఉంటామని లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఈ వినతి పత్రం సమర్పించిన వారిలో యాదవ విద్యావంతుల వేదిక అసోసియేట్ అధ్యక్షులు చల్లా కోటేష్ యాదవ్, జిల్లా ప్రచార కార్యదర్శి కుంటిగొర్ల లింగయ్య యాదవ్, డివిజన్ అధ్యక్షుడు గుండెబోయిన సురేష్ యాదవ్, పట్టణ ఉపాధ్యక్షుడు నడ్డి శంకర్ యాదవ్, పట్టణ ప్రచార కార్యదర్శి జానాపాటి శంకర్ యాదవ్, పట్టణ కోశాధికారి మోదాల రాంబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకుల కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదు



- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

చండూరు, జూలై 2 (మనం న్యూస్)ః బీఆర్ఎస్ పార్టీ నాయకుల కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని మునుగోడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. చండూరు పట్టణ కేంద్రంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. తమ పార్టీకి చెందిన మాజీ ఎంపీపీ తోకల వెంకన్నకు చెందిన భవనాన్ని సమాచారం ఇవ్వకుండా కూల్చివేయడం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పతనానికి నాంది అన్నారు., బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి మంత్రులు కేటీఆర్, జగదీశ్వర్ రెడ్డి,సహకారంతో చండూరు మున్సిపాలిటీకి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కానీ ఇప్పటి ఎమ్మెల్యే రాజగోపాలరెడ్డి ఉన్న నిధులను సద్వినియోగం చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పరిపాలనను పక్కకు పెట్టి తుగ్లక్ అరాచకాలకు తెరలేపుతున్నాడని, ఇకనుంచి ఆయనను తుగ్లక్ రాజగోపాల్ రెడ్డిగా పిలవాలన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహుని సేవలో మంత్రి, ప్రభుత్వ విఫ్ మంత్రి, ప్రభుత్వం బీర్ల అయిలయ్య

ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారుడి గృహప్రవేశం పాల్గొన్న మంత్రి

ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇల్లు యజమానికి యాట(పొట్టేలు)ను బహుమతిగా ఇచ్చిన ప్రభుత్వ విప్





యాదగిరిగుట్ట, జూలై 2 (మనం న్యూస్)ః యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని బుధవారం రాష్ట్ర ఎస్సి, ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖ, ఉమ్మడి నల్లగొండ ఇంచార్జి మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ , ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయనకు జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు,ఆలయ అధికారులు,అర్చకులు స్వాగతం పలికారు.దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి దర్శనానంతరం మంత్రికి ప్రభుత్వ విప్ కు స్వామి వారి చిత్ర పటం,లడ్డు ప్రసాదాన్ని ఆలయ ఈఓ వెంకట్రావు అందజేశారు.

**ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడి గృహ ప్రవేశం...**

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానంతరం యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు ఎగ్గిడి స్వప్న బాల మల్లేశ్ యొక్క గృహ ప్రవేశంలో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ,ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేశారు.ఆ తర్వాత ఆ ఇంట్లో పాలు పొంగించి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున పట్టువస్త్రాలను ప్రభుత్వం బీర్ల ఐలయ్య ఆ కుటుంబానికి అందజేశారు.

**కుటుంబ యజమానికి యాట(పొట్టేలు) ను అందజేత...**

అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ సమయంలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇచ్చిన మాట ప్రకారం గ్రామంలో మొట్ట మొదటిగా ఇల్లు పూర్తి చేస్తే ఒక యాట ను బహుమతి గా ఇస్తా అని చెప్పిన ప్రకారం యాటను కుటుంబానికి అందజేసారు.

**సైదాపూర్ వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు...**

యాదగిరిగుట్ట మండలం సైదాపూర్ గ్రామంలో శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య .ప్రత్యేక పూజలు నిర్వహించారు..

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సూర్యాపేట, జూలై 02 (మనం ప్రతినిధి)ః వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంతరెడ్డి సూచించారు. బుధవారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలోని 28వ వార్డులో నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి లోని చెత్తను తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అప్పగించాలని, వీధుల్లో సంచరించే కుక్కలకు బెల్టులు వేసి, అవసరమైన టీకాలు వేయించుకోవాలని తెలిపారు. అలాగే వార్డులో మున్సిపాల్టీ సరఫరా చేస్తున్న తాగు నీటిని పరీక్షించి, శుద్ధమైన నీరు అందిస్తున్నట్టు చెప్పారు. నిరుపేద మహిళలకు స్వయం సహాయక సంఘాలపై అవగాహన కల్పించడం జరిగిందని, చిరు వ్యాపారులను గుర్తించి స్ట్రీట్ వెండర్ సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. వ్యాపార సంస్థల నుండి ట్రేడ్ లైసెన్స్ వసూలు చేస్తున్నామని, రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని శిథిలావస్థలో ఉన్న భవనాల యజమా నులకు నోటీసులు జారీ చేసినట్టు కమిషనర్ హనుమంతరెడ్డి తెలిపారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, మాజీ కౌన్సిలర్ రాపర్తి శ్రీను మున్సిపల్ డీ.ఇ సత్య రావు, సానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏ.ఇ తిరుమలయ్య, టీఎంసీ శ్వేత,ఆర్.ఐ లు నాగయ్య, శ్రీను, గౌసుద్దీన్,ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, సయ్యద్ సమ్మి,వార్డు అధికారి నుస్రత్ పాతిమా, హెల్త్ అస్సిటెంట్ వేణు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలి




చిలుకూరు, జులై 2 (మనం న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులకు వచ్చి 18 నెలలు అవుతున్న నేటికి పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చందర్ రావు, పిడిఎస్యు డివిజన్ ప్రధాన కార్యదర్శి పులి రాఖీ అన్నారు. బుధవారం పి డి ఎస్ యు ఆధ్వర్యంలో చిలుకూరు మండల పరిధిలోని ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీలో నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులోకి వచ్చే ముందు వారి మేనిఫెస్టోలో విద్యార్థులకు న్యాయం చేస్తానని చెప్పి పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేస్తామని చెప్పినటువంటి రేవంత్ రెడ్డి నేటికీ 18 నెలలు గడుస్తున్నప్పటికీ విద్యార్థులకు రావాల్సిన 7200 కోట్ల రూపాయలు విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహించడం అంటే పేద విద్యార్థుల పట్ల ఏ విధమైన ప్రేమ ఉందో అర్థం అవుతుందని వారన్నారు. విద్యార్థుల హక్కు అయినటువంటి ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టినటువంటి ఫీజు రియంబర్స్ మెంట్ ఎత్తివేయాలని కుట్రలో భాగంగానే ఈ విధంగా చేస్తున్నారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. విద్యార్థులకు రావాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ ను వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశల వారి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## మున్సిపల్ కార్యాలయం ముందు డబ్బా కోట్లు తొలగించవద్దంటూ ఆందోళన

- డబ్బా కోట్లు తొలగిస్తే మా కుటుంబాలు రోడ్డున పడతాయి
- షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి తమకు కేటా ఇస్తామని రాతపూర్వకంగా హామీ ఇస్తేనే ఖాళీ చేస్తాం



కోదాడ, జూలై 02(మనం న్యూస్): పట్టణ పరిధిలోని మున్సిపల్ కార్యాలయం చుట్టూ ఉన్న డబ్బా కొట్లు, మండపం ఏరియా లో ఉన్న డబ్బా కోట్లను తొలగించి తమను రోడ్డున పడవేయ్యా వద్దు అంటూ చిరు వ్యాపారలు మున్సిపల్ కార్యాలయం ముందు బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిరు వ్యాపారస్తులు మాట్లాడుతూ తాము గత 30 సంవత్సరాలుగా చిన్న చిన్న డబ్బా కోట్లు ఏర్పాటు చేసుకొని కుట్టుమిషన్లు, చిరు వ్యాపారాలు చేసుకుంటూ బ్రతుకుతున్నామని ఇప్పటికిప్పుడు తమన ఖాళీ చేస్తే తాము ఎలా బతకాలని ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్ రాతపూర్వకంగా నూతనంగా నిర్మించే షాపింగ్ కాంప్లెక్స్ లో తమకు షాపులు కేటాయిస్తామని హామీ ఇస్తే సహకరించి ఖాళీ చేస్తామన్నారు. లేని పక్షాన బలవంతంగా ఖాళీ చేయించాలని చూస్తే అందరం కలిసి అడ్డుకుంటామన్నారు.

## రుణమేళాను సద్వినియోగం చేసుకోవాలి

- 16 రకాల రుణాల మంజూరు
- నిబంధన ప్రకారం తక్షణమే రుణం మంజూరు
- ఎండీ పెద్దిరెడ్డి గణేష్



సూర్యాపేట, జూన్ 2 (మనం ప్రతినిధి)ః సుధా బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుణమేళాను సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సుధాబ్యాంక్ ఎండీ పెద్దిరెడ్డి గణేష్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని బ్యాంకు నిర్వహిస్తున్న రుణమేళాల కౌంటర్ వద్ద మాట్లాడుతూ...సుధా బ్యాంక్ ఆధ్వర్యంలో 16 రకాల రుణాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ రుణమేళాలో వివిధ రకాల రుణాలను సులభంగా పొందేందుకు బ్యాంకు మేనేజర్, సిబ్బందిని కలిస్తే వారి అవసరాల మేరకు కాలయాపన చేయకుండా రుణాలను మంజూరు చేస్తారని పేర్కొన్నారు. రుణాల కోసం వివిధ బ్యాంకులకు వెళితే అప్లికేషన్ తీసుకొని పలు రకాల కారణాలతో నెలల తరబడి తిప్పుతున్న సందర్భాలు ఇటీవల చూస్తూ వస్తున్నామని..స్థానికంగా ఉన్న సుధా బ్యాంక్ ప్రజల అవసరాలను తీర్చేందుకు ప్రజలతో సత్సంబంధాలు ఉండటంతో వారంలో రుణాలు మంజూరుచేస్తామన్నారు.అత్యవసరమైతే రెండు మూడు రోజుల్లో కూడా రుణాల మంజూరుకు సహకరిస్తామన్నారు. ఇంటి మరమ్మత్తులకు, విస్తరణకు, చిరు వ్యాపారాలకు, దుకాణదారులకు, చేతి పనివృత్తిదారులకు 12 శాతం వడ్డీతో రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. టర్మ్ లోన్లు, వాహన రుణాలు, వర్కింగ్ క్యాపిటల్ రుణాలు, గిడ్డంగి సర్టిఫికెట్ రుణాలు, బంగారు ఆభరణాలపై కూడా రుణాలు ఇస్తామన్నారు.ఈ రుణామేళాను సద్వినియోగం చేసుకొని ప్రజలు, ఖాతాదారులు వారి అభివృద్ధితో పాటు బ్యాంకు అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ పఠాని సైదులు, ఫీల్ ఆఫీసర్ మేకల కేశవులు, సిబ్బంది మారినేని నవీన్, ప్రజలు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఖబడ్దార్ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

### కక్ష సాధింపు చర్యలకు పాల్పడే నైజం నీది, మీ బిఆర్ఎస్‌ది



చండూరు, జూలై 2 (మనం న్యూస్)ః గతంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని చండూరు మున్సిపల్ మాజీ చైర్మన్ తోకల వెంకన్న గ్రామకంఠం భూమిని అక్రమంగా కబ్జా చేసి నిర్మించిన భవనాన్ని కోర్టు ఆదేశాల మేరకు అధికారులు తొలగించడంతో దానిని రాజకీయం చేస్తూ ఈరోజు చండూరు పట్టణంలో ఒక హైడ్రామా సృష్టించి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పై అవాకులు చవాకులు అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికి గట్టి కౌంటర్ ఇచ్చారు బుధవారం చండూరు మండల పట్టణ కాంగ్రెస్ నాయకులు... విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ కక్ష సాధింపు చర్యకు పాల్పడే చరిత్ర కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిదని అన్నారు కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంటసత్యం. మాట్లాడుతూ. బి ఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేవలం రాజగోపాల్ రెడ్డి అభిమానిని అని తన ఉద్యోగం తీసేసారని కానీ ఏరోజు కూడా మీరు కచ్చితంగా మీరు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మేము చెప్పలేదని అన్నారు..ఈ రోడ్లన్ని మేము అధికారంలో ఉన్నప్పుడు మంజూరు చేయించి తీసుకొచ్చినవేనని గొప్పలు చెప్పుకుంటున్న కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఇదే రోడ్డు పనులు చేసిన కాంట్రాక్టర్ ప్రభాకర్ రెడ్డి కి బిల్లులు ఇవ్వలేని స్థితికి తీసుకొచ్చారని రాజగోపాల్ రెడ్డి వచ్చాక బి ఆర్ఎస్ కు చెందిన మనిషి అయిన కాంట్రాక్టర్ ప్రభాకర్ రెడ్డికి సుమారు 15 కోట్ల బిల్లులు ఇప్పించి అభివృద్ధిని ఆగకుండా ముందుకు తీసుకెళ్తున్నాడని అన్నారు .అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమంగా కబ్జా చేయడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించుకున్న భవనాన్ని కోర్టు ఆదేశాల మేరకు అధికారులు తొలగిస్తే బీసీని కాబట్టే నా పైన కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మాజీ చైర్మన్ తోకల వెంకన్న అనడం విడ్డూరంగా ఉందన్నారు చండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓంకారం మాట్లాడుతూ.ఇదే బీసీ వర్గానికి చెందిన నిన్ను ఆరోజు మున్సిపల్ చైర్మన్ ను చేసిన ఘనత రాజగోపాల్ రెడ్డి గారిదేనన్నారు.. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎక్కడ లేని విధంగా మునుగోడు నియోజకవర్గం లో మండల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు వివిధ ముఖ్య పదవులు ఎక్కువ శాతం బీసీలకు కేటాయించిన ఘనత రాజగోపాల్ రెడ్డి గారిదన్నారు రాజగోపాల్ రెడ్డి దమ్ముంటే రా చూసుకుందాం అని కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అంటున్నారని.. నీకు సమాధానం చెప్పడానికి రాజగోపాల్ రెడ్డి అవసరం లేదు.. మేము చాలు సమాధానం చెప్పడానికి అని ఆయన అన్నారు చండూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అనంత చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ రాజగోపాల్ రెడ్డి పేరు పలికే అర్హత కూడా కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కి లేదన్నారు.. మేము నిజంగా కక్ష సాధింపు చర్యలకు పాలు పడితే బి ఆర్ఎస్ నాయకులు ఒక్కరు కూడా నియోజకవర్గంలో తిరగలేరని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంటసత్యం, చండూర్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ దోటి వెంకన్న, చండూరు పట్టణ అధ్యక్షులు అనంత చంద్రశేఖర్, చండూరు మండల అధ్యక్షుడు ఓంకారం తదితరులు పాల్గొన్నారు.

# శభాష్ బుడిగె సతీష్ గౌడ్



- కితాబిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్

**గూడూరు, జూలై 2(మనం న్యూస్):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బ్రాహ్మణ పెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు బుడిగే సతీష్ గౌడ్ హైదరాబాదులోని పిసిసి అధ్యక్షుని నివాసంలో సి ఏం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చర్చించుకున్నటువంటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేస్తూన్న ఫోటో ను బుధవారం అందజేశారు. కరుడుగట్టిన కాంగ్రెస్ వాదిగా పది సంవత్సరాలు అధికారంలో లేకపోయినా కష్టనష్టాలకు ఓర్చుకొని, గత రెండు సంవత్సరాల క్రితం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదులో మహబూబాబాద్ జిల్లాకు చెందిన బుడిగే సతీష్ గౌడ్ రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. ప్రజల కష్ట సుఖాలను తెలుసుకొని పార్టీ కార్యకర్తలకు ఆర్థిక సహాయం చేసే మనసున్న మారాజు బుడిడిగే సతీష్ అని మండల కాంగ్రెస్ కార్యకర్తలు అంటుంటారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్న ఆయన సేవా దృక్పథాలు చూసి రాష్ట్రస్థాయిలో గాని, ఇళ్ల స్థాయిలో గాని నామినేటెడ్ పోస్ట్ ఇవ్వాలని మండల ప్రజలు, బాధితులు కోరుకుంటున్నారు.

# ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు



**ములుగు, జూలై 2(మనం ప్రతినిధి):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో 'జాతీయ డాక్టర్స్ డే' వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, ఆర్‌బిఎస్ కే టీం వైద్యులు, పల్లె దావకాన వైద్యులు, ఎంసి హెచ్ వైద్యాధికారులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావుని సన్మానించారు. అనంతరం, డి.ఎం. అండ్ హెచ్ .ఓ డాక్టర్. గోపాల్ రావు వైద్యులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఆరోగ్య సంరక్షణ కృషికి, అంకితభావానికి గుర్తించి గౌరవించే రోజే, ఈ డాక్టర్స్-డే అని,సమాజంలో వైద్య వృత్తికి ఎంతో గౌరవం ఉందని, ఆ గౌరవాన్ని ఇంకా పెంచాలని వైద్యులను కోరుతూ జిల్లాలోని మారుమూల గ్రామాలలో నివసిస్తున్న పేద ప్రజానీకానికి మెరుగైన వైద్య సేవలు అందించి వైద్య వృత్తికి న్యాయం చేయాలని, వర్షాకాలంలో వచ్చే డెంగు, మలేరియా నియంత్రణ లో వైద్యులు అవగాహన కార్యక్రమాలతో పాటు మెడికల్ క్యాంపులు నిర్వర్తించి, డెంగు- మలేరియా వ్యాధులను అదుపులోకి తేవాలని డాక్టర్లను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్. శ్రీకాంత్ డాక్టర్ .పవన్ కుమార్ డాక్టర్. చంద్రకాంత్ డాక్టర్ .రణధీర్ , రాయినిగూడెం డాక్టర్ నాగన్వేష్, ఆర్ బి ఎస్ కే ప్రోగ్రాం డాక్టర్స్ శ్రీనివాస్, నరహరి ,మల్లికార్జున్, శ్రీలత ,వెల్నెస్ సెంటర్ డాక్టర్స్ ప్రణీత్ ,విజయ్, నందకిషోర్ మరియు ఎంసిఎచ్ ప్రోగ్రాం డాక్టర్స్ పాల్గొన్నారు.

# గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి



- యూత్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కుంజ సూర్య

**ములుగు, జూలై 2(మనం ప్రతినిధి):** జగ్గన్నపేట గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని యూత్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కుంజ సూర్య అన్నారు. గ్రామంలో బుధవారం పర్యటించిన సూర్య గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్లు తొందరగా కట్టుకోవాలని సూచించారు. గ్రామంలో రోడ్లు గాని, గుడి నిర్మాణానికి గానీ, ఇతర సమస్యలు ఏమున్నా పరిష్కరిస్తామన్నారు. గ్రామ ప్రజలందరూ గ్రామ అభివృద్ధిలో పాల్గొని అధికారులకు, నాయకులకు ప్రభుత్వానికి సహకరించాలని రాబోయే స్థానిక ఎన్నికలలో కలసికట్టుగా ఉండి ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని చెప్పారు. వర్షా కాలం మొదలయ్యింది కాబట్టి గ్రామ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జ్వరాలు రాకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ ములుగు మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా కిసాన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి నూనెటి శ్యామ్ ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్ కుమార్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సదానందం గ్రామస్తులు ,యూత్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రేగొండలో సబ్ డివిజన్ మంజూరు చేయాలి



**రేగొండ, జూలై 2(మనం న్యూస్):** జిల్లా కేంద్రంలో పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయంతో పాటు రేగొండలో సబ్ డివిజన్ మంజూరు చేయాలని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. బుధవారం ఉదయం హైదరాబాద్ ఎర్రమంజిల్ లోని రాష్ట్ర పంచాయతీ రాజ్ ఈఎన్సీ కార్యాలయంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఈఎన్సీ కనకరత్నం, ఎస్ఈ చక్రవర్తి, ఈఈ వెంకటేశ్వర్లు, పలువురు డీఈలు, ఏఈలతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమీక్షా సమావేశంలో భూపాలపల్లి నియోజకర్గంలో పలు గ్రామాలల్లో జరుగుతున్న రోడ్ల అభివృద్ధి పనులు, పెండింగ్ పనుల పురోగతి, త్వరలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన గుత్తేదారులతో నాణ్యతతో పూర్తి చేయించాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే రేగొండ-మొగుళ్లపల్లి మండలాల ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు రంగాపురం - రేపాకపల్లి గ్రామాల మధ్య కొత్తగా హైలెవల్ వంతెన అవసరం ఉందని ఈఎన్సీకి సూచించారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారుచేయాలని ఈఈ ని కోరారు. వెలుతుర్లపల్లి నుండి గుర్రంపేట వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. భూపాలపల్లిలో పంచాయతీ రాజ్ డివిజన్ కార్యాలయంతో పాటు రేగొండలో సబ్ డివిజన్ కార్యాలయం మంజూరు చేయాలని కోరారు.

# మంత్రి సీతక్కపై తప్పుడు ప్రచారం తగదు

- ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు గుమ్మడి సోమయ్య



**మంగపేట, జూలై 2(మనం న్యూస్):** మంగపేట మండలం కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య పాల్గొని తప్పుడు వార్తలతో అసత్య ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ సొంత పత్రిక నమస్తే తెలంగాణ పత్రికలను కాల్చారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రెండు మూడు రోజులుగా బీఆర్ఎస్ పార్టీ సొంత పత్రిక నమస్తే తెలంగాణ పత్రికలో ప్రచురిస్తున్నటువంటి తప్పుడు వార్తలను మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం. అదే విధంగా మా నాయకుడు నిత్యం అనుక్షణం ప్రజాహితమై ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యలపై ప్రతిక్షణం రాష్ట్ర మంత్రివర్యులు సీతక్క దృష్టికి తీసుకెళ్తూ ప్రజా సమస్యల పరిష్కారానికై కృషి చేస్తూ, గత శాసనసభ ఎన్నికలలో పార్లమెంట్ ఎన్నికలలో ఎమ్మెల్సీ ఎన్నికలను తన బుజస్కందాలపై వేసుకొని అత్యధిక మెజారిటీతో అభ్యర్థులను గెలిపించి నిత్యం ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీని బలోపితానికి కృషి చేస్తున్న మా నాయకుడిపై ఎవరో ఆకాశ రామన్న (నాగన్న) పేరుతో ఇష్టం వచ్చిన రీతిలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పై తప్పుడు వార్తలు రాసిన నమస్తే తెలంగాణ పేపర్ యాజమాన్యం తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ బిజెపి బీఆర్ఎస్ ప్రతిపక్ష పాత్ర వహించాలి (ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి సూచన చేసే విధంగా ఉండాలి తప్పు) ప్రజా నాయకుల పైన బురద జల్లలి అనే చిల్లరా రాజకీయాలు మానుకొని ప్రజల మధ్యలో ఉండి ప్రజలకు సేవ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్ బాబు, అధికార ప్రతినిధి అయ్యోరి యణయ్య, జిల్లా కార్యదర్శి తుడి భగవాన్ రెడ్డి, బీసీ సెల్ ఉపాధ్యక్షులు పెద్ది నరసింహారావ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు టీవీ హీదాయతుల్లా, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు చాద మల్లయ్య, ఐఎన్‌టియూసి మండల అధ్యక్షులు తిరుపతి, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, గ్రామ అధ్యక్షులు సయ్యద్ హుసేన్, మండల సీనియర్ నాయకులు కాకర్ల శ్రీనివాస్, ఎర్రంగారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు అన్నదానం



**ములుగు, జూలై 2(మనం ప్రతినిధి):** ములుగు పట్టణ కేంద్రానికి చెందిన పైడిమల్ల సునీల్ కుమార్ కవితల కుమారుడు పైడిమల్ల రమణ్ కుమార్ గౌడ్ గత సంవత్సరం అనారోగ్య కారణంగా మరణించారు. రమణ్ కుమార్ జన్మదినం సందర్భంగా రమణ్ కుమార్ గౌడ్ జ్ఞాపకార్థం ములుగు ఏరియా ఆసుపత్రిలో రోగులకు అన్నదానం మరియు పండ్ల పంపిణీ చేయగా ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి సీతక్క తనయుడు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, తదితరులు పాల్గొన్నారు.

# మేడారం జాతర తేదీల ప్రకటనపై మంత్రి సీతక్క హర్షం

- పూజారుల సంఘానికి ధన్యవాదాలు తెలిపిన మంత్రి


పూజారుల (వడ్డెలు) సంఘం
శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర, మేడారం
శ్రీ సమ్మక్క - సారలమ్మ (తాడ్వాయి) మండలం, ములుగు జిల్లా, తెలంగాణ రాష్ట్రం,
రిజిష్టర్ నెం:22

సిద్దబోయిన జగ్గారావు, అధ్యక్షులు (పూజారుల సంఘం), సెల్:94410 02258
చందా గోపాల్‌రావు, కార్యదర్శి (పూజారుల సంఘం), సెల్:94947 52076

తేది: 01-07-2025

శ్రీయుత కార్యనిర్వహణాధికారి, శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర, మేడారం గ్రా., ఎస్.ఎస్.తాడ్వాయి మం., ములుగు జిల్లా గారికి.

అర్యా,

విషయము:- శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర, మేడారం - 2026 జాతర తేదీలు నిర్ణయించిన విషయము గురించి.

-o-

పై విషయములో తమతో మనవి చేయునది ఏమనగా, శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర, మేడారం గ్రామము, ఎస్.ఎస్. తాడ్వాయి మం., ములుగు జిల్లా యొక్క జాతర తేదీలను ఈ క్రింద తెలిపినదాని ప్రకారంగా నిర్ణయించడం జరిగినది.

| | | |
|---|---|---|
| 28-01-2026 | బుధవారము | సాయంత్రం 6 గం॥ లకు శ్రీ సారలమ్మ అమ్మవారు గద్దెకు వచ్చుట మరియు శ్రీ గోవింద రాజు, పగిడిద్ద రాజులు గద్దెలకు వచ్చుట |
| 29-01-2026 | గురువారము | సాయంత్రం 6 గం॥ లకు శ్రీ సమ్మక్క అమ్మవారు గద్దెకు వచ్చుట |
| 30-01-2026 | శుక్రవారము | మొక్కుబడులు సమర్పించుకొనుట |
| 31-01-2026 | శనివారము | సాయంత్రం 6 గం॥లకు తిరిగి శ్రీ సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లు మరియు శ్రీ గోవింద రాజు, పగిడిద్ద రాజులు, వనప్రవేశం చేయుట. |

పై విధముగా పూజారుల సంఘం అందరం కలిసి నిర్ణయించడం జరిగినది.

తమ విధేయులు
(సిద్దబోయిన జగ్గారావు)
పూజారి సంఘం అధ్యక్షులు
శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర, మేడారం

**ములుగు, జూలై 2(మనం ప్రతినిధి):** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిన మేడారం మహా జాతర తేదీలను పూజారుల సంఘం అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు. శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర తేదిలను ప్రకటించిన పూజారుల సంఘానికి ధన్యవాదాలు తెలిపారు. కోట్ల మంది భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలుగ కుండా విస్తృ త ఏర్పాట్లు చేస్తున్నట్టు మంత్రి సీతక్క ప్రకటించారు. ఇప్పుడు మహజాతర తేదీలను ప్రకటించడంతో... పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. రూ.110 కోట్లతో మేడారం లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. 2026 జనవరి 28 నుంచి 31 వరకు జాతర జరగనుంది. 28న సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలకు వస్తారు. 29న సమ్మక్క తల్లి చిలకలగుట్ట నుంచి గద్దెలకు చేరుకుంటారు. 30న భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. 31న సాయంత్రం 6 గంటలకు అమ్మవార్ల వనప్రవేశం తో జాతర ముగుస్తుంది. ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం మేడారంలో జరిగే మహా జాతర ఏర్పాట్లను మంత్రి సీతక్క పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగంతో సమీక్షలు నిర్వహిస్తూ పనులను పరుగులు పెట్టిస్తున్నారు. మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో తెలిపారు.



## మొహర్రం ఉత్సవాలకు ఎస్ఆర్ఆర్ఎఫ్ ఆర్థిక సాయం

**రాయపర్తి, జూలై 2(మనం న్యూస్):** మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మొహర్రం పండుగ ఉత్సవాలకు ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10000 రూపాయల ఆర్థిక సహాయం సంస్థ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా పార్టీ నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఉత్సవ కమిటీ వినతి మేరకు అంద చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతాకుల రంగారెడ్డి బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు పార్టీ నాయకులు ఎలమంచి శ్రీనివాస్ రెడ్డి, లేతాకుల మధుకర్ రెడ్డి, చందు రామ్, గజవెల్లి ప్రసాద్, ఎండీ యూసుఫ్, అస్గర్, ఖాజా సంకినేని ఎల్ల స్వామి, ఉబ్బని సింహాద్రి ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతున్న బాధితునికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సాయం



**రాయపర్తి, జూలై 2(మనం న్యూస్):** రాయపర్తి మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు గడ్డం అనిల్ కుమారుడు రాజ్ కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి వరంగల్‌లో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఫౌండేషన్ సభ్యులు బాధితున్ని బుధవారం పరామర్శించారు. అనంతరం, ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా పార్టీ నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి రూ.5000లు బాధితునికి అందజేశారు. ఈ కార్యక్ర మంలో మండల పార్టీ అధ్యక్షులు నరసింహ నాయ క్, ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతాకుల రంగారె డ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు పార్టీ నాయ కులు గజవెల్లి ప్రసాద్, అశ్రఫ్ పాషా, సంకినేని ఎల్ల స్వామి, కుక్కల భాస్కర్, బెల్లి పెద్దాపురం, గజేందర్ రెడ్డి, ఎండీ. రంజాన్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలి: డా. అఖిల

**మంగపేట, జూలై 2(మనం న్యూస్):** విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సోమ అఖిల అన్నారు. మండల పరిధిలోని గిరిజన బాలురుల సంక్షేమ హాస్టల్ లో బుధవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి, చేతుల పరిశుభ్రత గురించి, తినేముందు తిన్న తర్వాత శుభ్రంగా కడుక్కోవాలని, హాస్టల్లో బట్టలు కానీ టవల్స్ కానీ తడి లేకుండా పొడిగా ఉంచుకోవాలని ఒక్కరివి ఇంకొకరు వాడకూడదు అని దీనివలన చర్మ సంబంధిత వ్యాధులు తగ్గించవచ్చని అవగాహన కల్పించడం జరిగింది. విద్యార్థులు అస్వస్థతకు గురైతే వెంటనే ఆస్పత్రికి తీసుకొని రావాలని వార్డెన్ కు సూచించారు.ఈ కార్యక్రమంలో తిమ్మంపేట పల్లె దవాఖాన వైద్యాధికారి డాక్టర్ చందా మనోజ్ కుమార్, హెల్త్ సూపర్వైజర్ పద్మ , సత్యమ్మ, ఆశా కార్యకర్తలు రజిత, సమ్మక్క లు పాల్గొన్నారు.

# విద్యాలయాల్లో విద్యార్థులకు సరైన బోధన అందించాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు

**రాజన్న సిరిసిల్ల, జూలై 2(మనం ప్రతినిధి):** విద్యాలయాల్లో విద్యార్థులకు సరైన బోధన అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు తంగళ్ళపల్లి మండలం పద్మనగర్ సమీపంలోని కేంద్రీయ విద్యాలయమును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు విద్యాలయం లోని ప్రతి తరగతి గదిని తిరిగి పరిశీలించి 9వ తరగతి విద్యార్థులకు సంస్కృతం, హిందీ పాఠాలు చదివించారు. ఇందులో కొంతమంది విద్యార్థులు సంస్కృత పాఠాలను చదవ లేకపోవడం గమనించారు. 10వ తరగతి విద్యార్థులకు మ్యాథ్స్ సబ్జెక్టులో లెక్కలు ఇచ్చి వారితో చేపించారు. 7వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్, 8వ తరగతి విద్యార్థులకు సోషల్ బోధించారు. ప్రశ్నలు అడిగి వారి నుండి సమాధానాలు రాబట్టారు. కేంద్రీయ విద్యాలయంలో విద్యాబోధన దేశం మొత్తం ఒకే విధంగా ఉంటుందని పోటీ పరీక్షలకు ఎక్కువ మంది విద్యార్థులు హాజరవుతున్నందున ప్రతి సబ్జెక్టులో విద్యార్థులు అత్యున్నతమైన విద్యాభ్యాసన చేయాలని సూచించారు. అదే విధంగా పిల్లలకు సరైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శేష ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం పని చేస్తా
- ప్రతి ఒక్కరికి రక్షకుడిగా ఉంటా
- నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలి
- రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్




**రామగుండం, జూలై 02 (మనం న్యూస్):** దళారీ వ్యవస్థ లేకుండా ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకలను అదే విధంగా పని చేయాలని అన్నారు రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్. ఈ మేరకు ఎన్టీపిసిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలో బుధవారం జరిగిన రామగుండం నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల, కార్యకర్తల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్, సంగీతం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ... దళారీ వ్యవస్థ లేకుండా ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకలను అదే విధంగా పని చేయాలని అన్నారు. నా గెలుపు కోసం పని చేసిన ప్రతి ఒక్కరిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఇందిరమ్మ ఇళ్లు లాంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, సన్న వడ్లకు రూ.500 బోనస్, రైతు భరోసా చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి అని కొనియాడారు. వడ్ల కట్టింగ్ లేకుండా తడిచిన, రంగు మారిన వడ్లను ప్రభుత్వం కొనుగోలు జరిగిందిని, డివిజన్ లో, గ్రామాలలో ఉండే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని, ఎన్నికలు ఎప్పుడూ వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పథకాలతో ధైర్యంగా వెళ్ళి ఓటు అడగాలిని, ఎమ్మెల్యేగా నేను గెలవడానికి ఎంత కష్టపడ్డారో అదేవిధంగా మీ గెలుపు కోసం నా శాయశక్తుల కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, మహిళా నాయకురాల్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నిరాశపరిచిన రాహుల్..

ఎడ్జ్ బాస్టన్ వేదికగా భారత్, ఇంగ్లండ్ మధ్య రెండో టెస్ట్ ప్రారంభమైంది. ఈ మ్యాచ్ లో ఇంగ్లండ్ టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్ కోసం భారత్ మూడు మార్పులు చేయగా.. ఇంగ్లండ్ తొలి టెస్ట్ లో ఆడిన జట్టునే యధాతథంగా కొనసాగించింది. భారత్ తరఫున బుమ్రా స్థానంలో ఆకాశ్ దీప్.. సాయి సుదర్శన్ స్థానంలో వాషింగ్టన్ సుందర్.. శార్దూల్ ఠాకూర్ స్థానంలో నితీశ్ కుమార్ రెడ్డి తుది జట్టులో చోటు దక్కించుకున్నారు. తొలుత బ్యాటింగ్ చేస్తున్న భారత్ కు ఆదిలోనే భారీ షాక్ తగిలింది. ఇన్ ఫామ్ బ్యాటర్ కేఎల్ రాహుల్ 2 పరుగులకే ఔటై నిరాశపరిచాడు. క్రిస్ వోక్స్ బౌలింగ్ లో రాహుల్ క్లీన్ బౌల్ అయ్యాడు. తొలి టెస్ట్ తొలి ఇన్నింగ్స్ లో 42, రెండో ఇన్నింగ్స్ లో సెంచరీ (137) చేసిన రాహుల్ స్వల్ప స్కోర్ కే ఔట్ కావడం టీమిండియా అభిమానులకు తీవ్రంగా నిరాశపరిచింది. విదేశాల్లో ఘనమైన ట్రాక్ రికార్డు కలిగిన రాహుల్ కు ఎడ్జ్ బాస్టన్ అచ్చిరాలేదు. గతంలోనూ అతను ఇక్కడ ఆడిన రెండు ఇన్నింగ్స్ ల్లో ఘోరంగా విఫలమయ్యాడు (13, 4).



## సౌతాఫ్రికాకు మరో కొత్త కెప్టెన్



వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ సౌతాఫ్రికాకు రోజుల వ్యవధిలో ముగ్గురు కెప్టెన్లు మారారు. గత నెలలో జరిగిన డబ్ల్యూటీసీ 2023-25 ఫైనల్లో సౌతాఫ్రికాకు సారథ్యం వహించిన టెంబా బవుమా.. జింబాబ్వే పర్యటనకు విశ్రాంతి తీసుకోగా, కేశవ్ మహారాజ్ ను తాత్కాలిక సారథిగా నియమించారు.

జింబాబ్వే పర్యటనలో తొలి టెస్ట్ లో అదరగొట్టిన కేశవ్ మహారాజ్ దురదృష్టవశాత్తు గాయపడటంతో, రెండో టెస్ట్ లో అతనికి ప్రత్యామ్నాయంగా మరో కొత్త కెప్టెన్ ను నియమించారు. కెరీర్ లో కేవలం 20 టెస్ట్ మ్యాచ్ లే ఆడిన వియాన్ ముల్డర్ ను దక్షిణాఫ్రికా నూతన సారథిగా ఎంపిక చేశారు.

జింబాబ్వేలో పర్యటిస్తున్న సౌతాఫ్రికా జట్టులో కేశవ్ మహారాజ్ తర్వాత ముల్డరే అత్యంత అనుభవజ్ఞుడు (కైల్ వెర్రిన్ (26) మినహా). మిగతా ఆటగాళ్లంతా 20కి మించి టెస్ట్ లు ఆడలేదు. తొలి టెస్ట్ తో ప్రిటోరియస్, బ్రెవిస్, కోడి యూసఫ్ అరంగేట్రం చేశారు.

డబ్ల్యూటీసీ ఫైనల్ అనంతరం సీనియర్ ఆటగాళ్లంతా విశ్రాంతి తీసుకోవడంతో సౌతాఫ్రికా మేనేజ్ మెంట్ జింబాబ్వే టూర్ కు యువ జట్టును పంపింది. ఈ యువ జట్టుకు అత్యంత సీనియర్ అయిన కేశవ్ మహారాజ్ ను కెప్టెన్ గా నియమించింది.

అయితే అతను తొలి టెస్ట్ సందర్భంగా గజ్జల్లో గాయానికి గురయ్యాడు. రెండో టెస్ట్ లో అతనికి ప్రత్నామ్నాయ ఆటగాడిగా సెనురన్ ముత్తుస్వామిని ఎంపిక చేశారు. జులై 6 నుంచి బులవాయోలో జరిగే రెండో టెస్ట్ లో వియాన్ ముల్డర్ దక్షిణాఫ్రికా సారథిగా వ్యవహరిస్తాడు. దీంతో సౌతాఫ్రికా మూడు వరుస టెస్ట్ మ్యాచ్ ల్లో ముగ్గురు వేర్వేరు కెప్టెన్లతో బరిలోకి దిగినట్లవుతుంది.

కొత్త కెప్టెన్ ముల్డర్ జింబాబ్వేతో జరిగిన తొలి టెస్ట్ లో అద్భుతంగా రాణించాడు. పేస్ బౌలింగ్ ఆల్ రౌండర్ అయిన అతను తొలి ఇన్నింగ్స్ లో 4 వికెట్లు తీసి, ఆతర్వాత బ్యాటింగ్ లో సెంచరీ (147) చేశాడు. తొలి టెస్ట్ లో సారథిగా వ్యవహరించిన కేశవ్ మహారాజ్ కూడా ఆల్ రౌండర్ గా రాణించాడు. బ్యాటింగ్ లో 21, 51 పరుగులు చేసి బౌలింగ్లో 3,1 వికెట్లు తీశాడు. గాయంతో బాధపడుతున్న కేశవ్ మహారాజ్ ను స్వదేశానికి పిలిపించిన సౌతాఫ్రికా యాజమాన్యం అతనితో పాటు సీనియర్ పేసర్ లుంగి ఎంగిడిని కూడా జట్టు నుంచి రిలీజ్ చేసింది. తొలి టెస్ట్ లో అద్భుతంగా రాణించిన యువ పేసర్లకు మరో అవకాశం ఇవ్వడం కోసం ఎంగిడిని స్వదేశానికి పిలిపించారు. తొలి టెస్ట్ లో పేసర్లు కోడి యూసఫ్, మఫాకా, బాష్, ముల్డర్ విశేషంగా రాణించారు. ఆ మ్యాచ్ లో కేశవ్ మహారాజ్ ఏకైక స్పిన్నర్ గా బరిలోకి దిగాడు. కాగా, జింబాబ్వేతో తాజాగా ముగిసిన టెస్ట్ మ్యాచ్ లో సౌతాఫ్రికా 328 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్ లో కార్బిన్ బాష్ (100, 5/43), డ్రి ప్రిటోరియస్ (153), వియాన్ ముల్డర్ (4/50, 147), కేశవ్ మహారాజ్ (3/70, 51), కోడి యూసఫ్ (3/42, 3/22) అద్భుత ప్రదర్శనలు చేసి సౌతాఫ్రికాను గెలిపించారు. ఈ గెలుపుతో సౌతాఫ్రికా చివరి 9 మ్యాచ్ ల్లో గెలిచిన జట్టుగా అరుదైన ఘనత సాధించింది. ప్రస్తుతం టెస్ట్ క్రికెట్ లో ఏ జట్టు ఈ ఘనత సాధించలేదు.



## లవ్లీనాకు స్వర్ణం.. నిఖత్‌కు రజతం



జాతీయ ఎలైట్ మహిళల బాక్సింగ్ టోర్నీలో తెలంగాణ స్టార్ క్రీడాకారిణి నిఖత్ జరీన్ రజత పతకంతో సరిపెట్టుకుంది. మంగళవారం సరూర్ నగర్ స్టేడియంలో జరిగిన మహిళల 51 కేజీల ఫైనల్లో జ్యోతి (ఆర్ఎస్పీబీ) చేతిలో నిఖత్ ఓడింది. ఒలింపిక్ పతక విజేత లవ్లీనా (టాప్స్) స్వర్ణంతో అదరగొట్టింది. 75 కేజీల ఫైనల్లో లాషు యాదవ్ (ఆర్ఎస్పీబీ)పై లవ్లీనా విజయం సాధించింది. 60 కేజీల విభాగంలో తెలంగాణ అమ్మాయి నిహారిక గోనెళ్ల కాంస్య పతకం గెలుచుకుంది. నాలుగు రోజుల పాటు అభిమానుల్ని అలరించిన బాక్సింగ్ టోర్నీ మంగళవారం ముగిసింది. రైల్వే స్పోరట్స్ ప్రమోషన్ బోర్డు (ఆర్ఎస్పీబీ) జట్టు ఓవరాల్ టీమ్ టైటిల్ కైవసం చేసుకుంది. 48 కేజీలలో నీతూ (హరియాణా), చంచల్ (సాయ్ ఎన్).. 54 కేజీలలో ప్రీతి (టాప్స్), ధాను (ఎస్ఎస్పీబీ).. 57 కేజీలో బబిరోజ్సనా చాను (ఆర్ఎస్పీబీ), కమల్ జీత్ కౌర్ గిల్ (ఏఐపీ).. 60 కేజీలో ప్రాచి (ఆర్ఎస్పీబీ), అంజలి (హరియాణా)..65 కేజీలలో అంకుషిత బోరో (టాప్స్), శశి (ఆర్ఎస్పీబీ).. 70 కేజీలో శివాని (ఢిల్లీ), గితిమొని గొగోయ్ (సాయ్ ఎన్).. 80 కేజీలలో స్వీటీ (సాయ్ ఎన్), అల్ఫియా (ఆర్ఎస్పీబీ).. 80+ కేజీలలో రితిక (సాయ్ ఎన్), శివాని తోమర్ (ఏఐపీ) వరుసగా స్వర్ణ, రజత పతకాలు సాధించారు.

## గ్లామర్ రోల్స్ కావాలంటున్న కన్నప్ప బ్యూటీ..

టాలీవుడ్ హీరో మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. కన్నప్ప జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఆ సినిమాకు ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. మోహన్ బాబు భారీ బడ్జెట్ తో నిర్మించగా.. కోలీవుడ్ అమ్మాయి ప్రీతి ముకుందన్ ఫిమేల్ లీడ్ రోల్ లో యాక్ట్ చేసింది.

ఈ సినిమాలో తన గ్లామర్ తో ఆకట్టుకుంది అమ్మడు. తాను పోషించిన రోల్ లో ధైర్యంగా కనిపించిన ప్రీతి.. పాత్రకు న్యాయం చేసిందనే చెప్పాలి. అలా హైలెట్ గా నిలిచి యూత్ ను తన అందచందాలతో బాగా అట్రాక్ట్ చేసింది అమ్మడు. అదే సమయంలో పలువురు టాలీవుడ్ మేకర్స్ దృష్టిలో కూడా ఆమె పడింది. ఇప్పుడు కొందరు మేకర్స్.. ఆమెను తమ సినిమాల్లోకి తీసుకోవాలని చూస్తున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే తన అప్ కమింగ్ సినిమాల్లో గ్లామరస్ రోల్స్ చేయాలని ప్రీతి ముకందన్ భావిస్తున్నట్లు సమాచారం. అందుకు అనుగుణంగా స్క్రిప్ట్ లను సెలెక్ట్ చేసుకుంటుందని టాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కాగా, కోలీవుడ్ కు చెందిన ప్రీతి.. టాలీవుడ్ మూవీతోనే తెరంగేట్రం చేసింది. ఆ సినిమా కన్నప్ప కాదు.. యంగ్ హీరో శ్రీవిష్ణు లీడ్ రోల్ లో నటించిన శ్రీ విష్ణు కామెడీ సినిమాతో ఓం భీమ్ బుష్ తో డెబ్యూ ఇచ్చింది. ఆ సినిమాతో అనుకున్నంత పేరు రాలేదు. ఆ తర్వాత కోలీవుడ్ లో స్టార్ అనే మూవీతో అరంగేట్రం చేసింది. ఇప్పుడు కన్నప్పతో సందడి చేయగా.. ప్రస్తుతం ఆమె లైనప్ లో రెండు సినిమాలు ఉన్నాయి. మలయాళంలో మైనే ప్యార్ కియా, తమిళంలో ఇదయం మురళి సినిమాల్లో యాక్ట్ చేస్తోంది. ప్రస్తుతం ఆ చిత్రాల షూటింగ్స్ శరవేగంగా జరుగుతున్నది.



## ఫాతిమాతో ఆన్ స్క్రీన్ రొమాన్స్.. అభ్యంతరం లేదన్న అమీర్ ఖాన్

ఆమిర్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్'. భారీ ప్రాజెక్ట్ గా రూపొందిన ఈ సినిమా 2018లో విడుదలై పరాజయాన్ని అందుకుంది. ఇప్పుడీ చిత్రాన్ని ఉద్దేశించి ఆమిర్ ఖాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ సినిమా చేదు ఫలితాన్నే ఇస్తుందని తనకు ముందే తెలుసన్నారు. చిత్రీకరణ సమయంలోనే రిజల్ట్ పై తనకొక క్లారిటీ వచ్చిందన్నారు. నటి ఫాతిమా సనాషేక్ తో స్క్రీన్ షేర్ చేసుకోవడంపైనా మాట్లాడారు. ఆమెకు ప్రియుడిగా నటించడం తనకి ఏమీ ఇబ్బందిగా అనిపించలేదన్నారు. ''ఈ సినిమాలో హీరో పాత్రకు ప్రియురాలిగా ఏ హీరోయిన్ నటిస్తే బాగుంటుందా? అని మేము ఎంతో చర్చించుకున్నాం. దీపికా పదుకొణె, శ్రద్ధాకపూర్, అలియాభట్ వంటి తారలను సంప్రదించాం. కానీ వారెవరూ అంగీకరించలేదు. స్క్రిప్ట్ నచ్చకపోవడంతో వారంతా తిరస్కరించి ఉండొచ్చు. చివరకు ఫాతిమా సనాషేక్ను ఆ రోల్ కోసం ఎంపిక చేశాం. నటించేందుకు ఆమె అంగీకరించింది. గతంలో మేమిద్దరం 'దంగల్' కోసం పనిచేసిన విషయం తెలిసిందే. అందులో తండ్రీకుమార్తెలుగా నటించాం.



ఆ చిత్రాన్ని దృష్టిలో ఉంచుకుని.. ''మీ పాత్రల మధ్య ఎలాంటి రొమాంటిక్ సన్నివేశాలను చిత్రీకరించాలనుకోవడం లేదు. ఎందుకంటే గతంలో మీరిద్దరూ తండ్రీకుమార్తెలుగా నటించారు. ఇప్పుడు ప్రేమికులుగా రొమాన్స్ చేస్తే ప్రేక్షకులు ఏమాత్రం అంగీకరించరు'' అని దర్శకుడు చెప్పారు. ఆ మాటలను నేను ఖండించాను. ప్రేక్షకులు ఏమీ తెలివి తక్కువ వాళ్లు కాదన్నాను. నిజ జీవితంలో మేమిద్దరం తండ్రీకుమార్తెలం కాదని వారికి తెలుసు. కాబట్టి వాళ్లు ఏమీ తప్పుగా అనుకోరని బదులిచ్చా'' అని ఆమిర్ ఖాన్ తెలిపారు.

తాము మొదట అనుకున్న విధంగా సినిమా తెరకెక్కించలేకపోయామన్నారు. సమయానుగుణంగా స్క్రిప్ట్లు మార్చాల్సి వచ్చిందన్నారు. సినిమా పరాజయానికి అదీ ఒక కారణమని తెలిపారు. చిత్రీకరణ సమయంలోనే సినిమా ఎలా ఆడుతుందనే దానిపై తనకొక క్లారిటీ వచ్చిందన్నారు. పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్ గా ఇది రూపొందింది. విజయ్ కృష్ణ ఆచార్య దర్శకుడు. అమితాబ్ బచ్చన్, కత్రినా కైఫ్ కీలక పాత్రలు పోషించారు.

## 'అఖండ-2'లో బజరంగీ భాయిజాన్ ఫేమ్ హర్షాలి




గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'అఖండ 2 - తాండవం' కోసం ప్రేక్షకులు ఏ రేంజ్ లో ఎదురుచూస్తున్నారో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకడు బోయపాటి శ్రీను తనదైన మార్క్ టేకింగ్ తో తెరకెక్కిస్తున్నాడు. ఇక ఈ సినిమాతో మరోసారి బాక్సాఫీస్ దగ్గర బోయపాటి-బాలయ్య కాంబినేషన్ సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయమని చిత్ర వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

అయితే, ఈ సినిమాలో బాలయ్య రెండు వైవిధ్యమైన పాత్రల్లో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆయనతో పాటు ఈ సినిమాలో పలువురు నటీనటులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కాగా, ఈ సినిమాలో తాజాగా బాలీవుడ్ చిత్రం 'బజరంగీ భాయిజాన్'లో మున్నీ పాత్రలో నటించిన హర్షాలి మల్హోత్రా కూడా నటిస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు. జనని అనే పాత్రలో హర్షాలి కనిపించబోతున్నట్లు మేకర్స్ తాజాగా ఓ కొత్త పోస్టర్ ద్వారా వెల్లడించారు. దీంతో ఈ సినిమాలో ఆమెది ఎలాంటి పాత్ర అయి ఉంటుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ సినిమాలో సంయుక్త మీనన్ హీరోయిన్ గా నటిస్తుండగా థమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై రామ్ ఆచంట, గోపి ఆచంట ప్రొడ్యూస్ చేస్తున్నారు. దసరా కానుకగా ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

## 'హరి హర వీరమల్లు' ట్రైలర్ టైమ్ ఫిక్స్.. దర్శకుడిని అభినందించిన పవన్

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ 'హరిహర వీరమల్లు'. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఇది సిద్ధమవుతోంది. ఈ సినిమా అప్డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా దీని ట్రైలర్ విడుదల వివరాలను టీమ్ పంచుకుంది. జులై 3 ఉదయం 11.10 గంటలకు ఇది విడుదల కానున్నట్లు తెలిపింది. పవన్ కల్యాణ్ ఈ ట్రైలర్ చూసి ఎంజాయ్ చేస్తోన్న వీడియోను పంచుకుంది. ఆ వీడియో చివర్లో పవన్ దర్శకుడిని అభినందించారు. 'చాలా కష్టపడ్డావ్..' అంటూ ఆత్మీయంగా హత్తుకున్నారు. ''తుపాను వెనక ఉండే శక్తి.. ట్రైలర్ చూశాక పవన్ కూడా తన ఉత్సాహాన్ని అదుపు చేయలేకపోయారు'' అని నిర్మాణ సంస్థ తెలిపింది. ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ తో కలిసి పవన్ ఈ ట్రైలర్ ను వీక్షించారు. ఈ సినిమాని క్రిష్ కొంతభాగం తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ప్రొడ్యూసర్ రత్నం తనయుడు జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు తీసుకున్నారు. పవన్ ఇందులో చారిత్రక యోధుడిగా మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్. బాబీ దేవోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తొలిభాగం 'హరి హర వీరమల్లు: పార్ట్ 1- స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది.




Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.